
'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 346

బుధవారం 8-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



యూఎస్ కాన్సులేట్‌కు కొత్త భవనం

మార్చి 20 నుంచి హైదరాబాద్ నానక్‌రామ్ గూడలోని కొత్త భవనం నుంచే యూఎస్ కాన్సులేట్ కార్యకలాపాలు సాగనున్నాయి.

వివరాలు 14లో ▸



అంటార్కిటికా కరుగుతోంది!

అంటార్కిటికాలో వేగంగా కరుగుతున్న మంచు. పలు దేశాల తీర ప్రాంతాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని హెచ్చరిస్తున్న శాస్త్రవేత్తలు.

వివరాలు 6లో ▸

పసిఫిక్‌లో కూలిన ఎంటీ-1

కాలం చెల్లిన ఎంటీ-1 ఉపగ్రహాన్ని పసిఫిక్ సముద్రంలో కూల్చాలన్న ఇస్రో ప్రయత్నం సఫలీకృతమైంది.

వివరాలు 6లో ▸

నేడు మహిళా దినోత్సవం

ఆరేళ్ల వయసులోనే తన మీడియం పేస్ బౌలింగ్‌తో ప్రత్యర్థులను గడగడలాడించింది **షబ్నమ్.** నేడు ఏకంగా ఆంధ్ర ప్రదేశ్ తరఫున ఉమెన్ ప్రీమియర్ లీగ్ స్థాయికి ఎదిగిపోయింది. ఇటీవల అండర్-19 వరల్డ్‌కప్‌ను సొంతం చేసుకున్న జట్టులోనూ తన సత్తా చాటింది.

మూడేళ్ల వయసులోనే క్రికెట్‌లో ఓనమాలు దిద్దిన తెలుగు తేజం **గొంగడి త్రిష** భారత్ క్రికెట్ జట్టులో కీలక ప్లేయర్‌గా ఎదిగింది. భద్రాచలం నుంచి ఎదిగిన త్రిష అండర్-19 వరల్డ్ కప్-2023 ఫైనల్లోనూ కీలకపాత్ర పోషించింది.

మహిళా క్రికెటర్ల ఇంటర్వ్యూ 11లో

హైహై నాయికా..

నాయకత్వ లక్షణాలు మహిళల్లోనే అధికం

ఒత్తిడిలోనూ సానుకూల నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం వారి సొంతం

స్పష్టం చేస్తున్న పలు పరిశోధనలు, అధ్యయనాలు

- 14లో ▶

స్టార్టప్‌లలో మహిళల హవా

- 13లో

ప్రస్తుత డిజిటల్ యుగంలో కమ్యూనిటీ రేడియోను స్థాపించి అందరిలో స్ఫూర్తి నింపుతున్న **వనపర్తి ఆవాజ్.. ఖమర్ రహమాన్**

- వివరాలు 2లో ▶

ఢిల్లీ మద్యం కేసులో పిళ్లై అరెస్టు

సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్న ఈడీ



- కవిత, మాగుంట బినామీలుగా పిళ్లై, ప్రేమ్..
- కవిత ప్రతినిధినని పిళ్లై ఒప్పుకున్నాడు
- ఆప్‌కు 100 కోట్ల ముడుపులు చేరవేశాడు.. రిమాండు రిపోర్టులో పేర్కొన్న ఈడీ
- మార్చి 13 దాకా ఈడీ కస్టడీకి పిళ్లై

- వివరాలు 2లో ▶

ఆమె అక్షర... లక్ష్మి



పాలమూరు	శాతవాహన
74%	67%
కాకతీయ	**ఓయూ**
61%	58%

ఉన్నత విద్యలో అగ్రస్థానంలో అమ్మాయిలు

- వర్సిటీల్లో అబ్బాయిలను మించి చేరికలు
- ఓయూ నుంచి పాలమూరు దాకా అంతే
- తొలగిన సంకెళ్లు.. పెరిగిన అవగాహన..



సాక్షి, హైదరాబాద్: ఆడపిల్ల పాఠశాల విద్య పూర్తి చేయడమే గగనం. అవును నిజం.. కానీ ఇప్పుడది గతం. నేడు అగ్రభాగం ఆమె సొంతం. బడిలో బాలికలదే ముందంజ. ఉన్నత చదువుల్లోనూ వనితే ఫస్ట్. అక్షరాన్ని ఆయుధంగా భావిస్తున్న నేటి మహిళలు విద్యారంగంలో సత్తా చాటుతున్నారు. ఇంకా 'సగభాగమేంటి?'.. అంతకు మించే అని గర్వంగా చెబుతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు..ఏ విశ్వవిద్యాలయాని కెళ్ళినా ప్రవేశాల సంఖ్యలో అమ్మాయిలదే మొదటి స్థానం. వందేళ్ళు దాటిన ఉస్మానియా సహా చాలా వర్సిటీల్లో వారే అధిక సంఖ్యలో ఉన్నారు. సంప్రదాయాల సంకెళ్లు తొలగి అవగాహన, ఆధునికత పెరగడం, దానికి తగినట్టుగా బడులు, కళాశాలలు పెద్ద సంఖ్యలో అందుబాటులోకి రావడం, ప్రత్యేక పాఠశాలలు, కాలేజీలు కూడా ఏర్పాటు కావడం, విద్య అవసరం అనే భావన పెంపొందడం..ఇవన్నీ మహిళలను

మిగతా 2వ పేజీలో ▶

సమష్టిగా ఆర్థిక స్వావలంబన సాధించి స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తున్న అతివలు..

లెమన్ గ్రాసే.. లచ్చిందేవి

పేదరికం నుంచి పురోభివృద్ధి దిశగా చీకరుచెట్టు తండా మహిళలు

లెమన్ గ్రాస్‌తో సుగంధ ద్రవ్యాన్ని తయారు చేసి ఓ అంతర్జాతీయ ఏజెన్సీ సహకారంతో ఆర్థికాభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

- 3లో

విలేజ్ వనిత.. ఘనత

గ్రామీణ మహిళలు రూట్ మార్చారు. ఆర్థిక పరిపుష్టి దిశగా అడుగులేస్తున్నారు.

సెర్ప్ ద్వారా శిక్షణ పొందుతున్న మహిళలు వివిధ రకాల యూనిట్లు ఏర్పాటు చేసుకుంటూ తమ తోటివారిలోనూ స్ఫూర్తి నింపుతున్నారు.

- 5లో



సరిగ్గా ఏడాది క్రితం. ముప్పై మంది మహిళలు కలిసి మూడు దశాబ్దాల రంగుల కలను నిజం చేశారు. పైసా పైసా కూడబెట్టి పొదుపు చేసిన డబ్బుతో బెలూన్ థియేటర్ నిర్మించారు. కుమురం భీం జిల్లా ప్రజలకు వినోదం అందించాలన్న స్వయం సహాయక సంఘాల మహిళల ఆలోచనకు ప్రతిరూపమే బెలూన్ థియేటర్.

విమెన్ థియేటర్

-14లో

తలకు మించిన భారం.. తలవంచని మనోధైర్యం...

స్త్రీ శక్తి స్వరూపిణి. భారాలు, దూరాలు ఆమె గమనాన్ని ఆపలేవు. గమ్యాన్ని చేరకుండా ఆమెను అడ్డుకోలేవు. స్త్రీ స్ఫూర్తి ప్రదాత. ఆమె నడిచే తోవలో శిఖరాలు మోకరిల్లుతాయి. ఆమె అడుగులు తాకి శిశిరాలు చిగురిస్తాయి. నేడు మహిళా దినోత్సవం. జగతికే మహోత్సవం.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, వరంగల్





నిప్పులు చిమ్ముకుంటూ.. లక్ష్యాన్ని ఛేదించి..

- నౌకా విధ్వంసక క్షిపణి ప్రయోగం విజయవంతం.. ఐఎన్ఎస్ విశాఖ నుంచి దూసుకెళ్లిన మిస్సైల్
- 70 కి.మీ. లోపు విమానాలు, హెలికాప్టర్లు తుత్తునియలు



6లో

'కోవిడ్'లా విస్తరిస్తున్న హెచ్3ఎన్2



- ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ రణదీప్ గులేరియా హెచ్చరికలు
- ఉత్తర భారతంలో విపరీతంగా పెరుగుతున్న కేసులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

6లో

ఎమ్మెల్యే కోటా అభ్యర్థులు వీరే



నవీన్‌రావు దేశపతి శ్రీనివాస్ వెంకట్రామిరెడ్డి

- ఖరారు చేసిన సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- కుర్మయ్యగారి నవీన్‌కు రెండోసారి అవకాశం
- దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రామిరెడ్డికి చాన్స్
- 9న గవర్నర్ కోటా అభ్యర్థుల ఎంపిక

- 3లో

క్లుప్తంగా...

'ప్రపంచ వేదికలపై తెలంగాణ టూరిజం ప్రమోషన్'



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ పర్యాటక పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే పలు ప్రపంచ స్థాయి వేదికలపై తెలంగాణ టూరిజం ప్రమోషన్‌ను నిర్వహించామని ఎక్సైజ్, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, యువజన సర్వీసుల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జర్మనీ రాజధాని బెర్లిన్‌లోని ఐటీబీ, బెర్లిన్ ఇంటర్నేషనల్ టూరిజం అండ్ కల్చర్ ఎగ్జిబిషన్‌లో తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టూరిజం అండ్ కల్చర్ స్టాల్‌ను ప్రారంభించి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. ఈ ఇంటర్నేషనల్ టూరిజం కల్చర్ ఎగ్జిబిషన్‌లో 180 దేశాలకు చెందిన పర్యాటక, సాంస్కృతిక సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి పర్యాటక ప్రదేశాలెన్నో ఉన్నాయని, వాటికి సరైన ప్రమోషన్‌ను కల్పించడం ద్వారా రాష్ట్రానికి విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే రమేశ్, జర్మనీలోని భారత రాయబారి పర్వతనేని హరీశ్‌రావు, ఇండియా టూరిజం సెక్రెటరీ అరవింద్ సింగ్, తెలంగాణ టూరిజం ఎంబీడీ మనోహర్, జర్మనీలోని తెలంగాణ అసోసియేషన్ జర్మనీ అధ్యక్షుడు రఘు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తాం: ప్రవీణ్‌కుమార్



ఎర్రవల్లి చౌరస్తా: రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులను చిత్రహింసలకు గురిచేస్తున్న ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. మంగళవారం బీఎస్పీ బహుజన రాజ్యాధికార యాత్ర జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని పుటాన్‌దొడ్డి, కోదండపురం, వేముల, బట్లదిన్నె, ధర్మవరం, వల్లూరు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్వరాష్ట్ర సాధనకు ప్రాణాలకు తెగించిన ఉద్యమకారులను పక్కనబెట్టిందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి ఉద్యమకారుడిని ఆదుకుంటామని చెప్పారు. పలువురు ఉద్యమకారులు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఎంపీ కోమటిరెడ్డిపై కేసు నమోదు



నల్లగొండ క్రైం: చంపుతానని బెదిరించారన్న ఫిర్యాదుపై ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ గోపి వెల్లడించారు. తనతో పాటు తండ్రిని చంపుతానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫోన్‌లో బెదిరించినట్లు డాక్టర్ చెరుకు సుధాకర్ కుమారుడు డాక్టర్ చెరుకు సుహాస్ నల్లగొండ ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఈ మేరకు 506 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళా సంఘాలకు కేసీఆర్ మోసం: షర్మిల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 46.10 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులను కేసీఆర్ మోసగించారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆరోపించారు. సున్నా వడ్డీకే రుణాలిస్తామని చెప్పి, మూడేళ్లుగా దాదాపు రూ.4 వేల కోట్ల బకాయిలు చెల్లించలేదని ఆమె ఆరోపించారు. ఎన్నికల ఏడాదిలో మహిళా దినోత్సవం రాగానే మహిళలు యాదికొచ్చారని విమర్శించారు. కేసీఆర్ తీరుతో మహిళలే ఆపసోపాలు పడి బ్యాంకర్లకు వడ్డీలు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మహిళలపై కేసీఆర్‌కు నిజంగానే ప్రేమ ఉంటే పూర్తిగా రూ.4 వేల కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు.



ఈ అవార్డు మీకు కాదు.. మీ భార్యకు వచ్చింది

వనపర్తి ఆవాజ్.. ఖమర్ రహమాన్

గజ్జె కట్టి, పాట పాడి మహిళల్లో చైతన్యం.. రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

సారా నిషేధం కోసం లక్ష సంతకాల సేకరణ	సఖీ కేంద్రాల ద్వారా అణచివేత, వేధింపులకు గురవుతున్న వారికి కౌన్సెలింగ్	వీజేఎంఎస్ ఏర్పాటుతో 25 వేల మంది జీవితాల్లో వెలుగులు

కమ్యూనిటీ రేడియోతో మరింత చైతన్యం రగిల్చే దిశగా అడుగులు..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఆమె అతి పేద ముస్లిం కుటుంబంలో పుట్టిన సామాన్యురాలు. తల్లి అనారోగ్యం, కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ఆరో తరగతి చదువుతుండగానే వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. కుటుంబ భారంతో అనేక సమస్యలు ఎదుర్కొంది. అయితే చిన్నప్పట్నుంచే అభ్యుదయ భావాలు కలిగిన ఆమె ఎలాగైనా తనను తాను నిరూపించుకోవడంతో పాటు మహిళా శక్తిని ప్రపంచానికి చాటాలని నిర్ణయించుకున్నారు. సమాజంలో కట్టుబాట్లను దాటి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా.. భర్త సహకారంతో పదో తరగతి, ఆ తర్వాత డిగ్రీ పూర్తి చేశారు. అవకాశాలను అందిపుచ్చుకున్నారు. మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు గజ్జె కట్టి, పాట పాడుతూ దేశమంతా తిరిగారు. అంతేకాదు స్వయం ఉపాధి చూపడం ద్వారా ఇప్పటివరకు 25 వేల మందికిపైగా మహిళలు, యువతుల జీవితాల్లో వెలుగులు నింపారు. జాతీయ స్థాయిలోనూ పేరు సంపాదించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆవాజ్ వనపర్తి పేరిట కమ్యూనిటీ రేడియోను స్థాపించి అందరిలో స్ఫూర్తి నింపుతున్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌కు చెందిన ఖమర్ రహమాన్‌పై మహిళాదినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..



పాటలు ఎడిటింగ్ చేస్తున్న ఖమర్ రహమాన్

ఇలా మొదలు..

నిరక్షరాస్యత, పేదరికం, వలసలకు కేరాఫ్‌గా నిలిచిన పాలమూరు జిల్లాలో ప్రభుత్వం 1989లో అక్షర కిరణం పేరిట పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా మహిళా అక్షరాస్యతను పెంపొందించడం.. పొదుపు అలవాటు చేసుకునేలా స్వయం సహాయక బృందాల (ఎస్‌ఎస్‌జీ) ఏర్పాటు కార్యక్రమాలు మొదలు పెట్టింది. ఆయా కార్యక్రమాలకు ఆటపాటల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించింది. పాటలు రాయడం, పాడడంతో పాటు గజ్జె కట్టి ఆడటంలోనూ ప్రావీణ్యమున్న ఖమర్ రహమాన్‌కు వెంటనే అవకాశం వచ్చింది. అంతే ఆమె ఇక వెనుతిరిగి చూడలేదు. గజ్జె కట్టి, పాటపాడుతూ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పథకాలను విస్తృత ప్రచారం చేస్తూ గుర్తింపు తెచ్చుకుంది.

ఒక్కో మెట్టు ఎక్కుతూ..

ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి కల్చరల్ డైరెక్టర్ స్థాయికి ఎదిగిన ఖమర్ రహమాన్.. చిన్నమ్మ థామస్ సఖీ కేంద్రాల నిర్వహణ చేపట్టి సమాజంలో అణచివేత, వేధింపులకు గురవుతున్న ఎందరో మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సారా నిషేధం కోసం లక్ష సంతకాలు సేకరించి గవర్నర్‌కు సమర్పించి గుర్తింపు తెచ్చుకున్నారు. భూకంప బాధితులకు విరాళాల సేకరణతో పాటు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ఈ క్రమంలో మహిళలను స్వయం ఉపాధి దిశగా నడిపించేందుకు 1994లో వనితా జ్యోతి మహిళా సంఘం (వీజేఎంఎస్) అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. దీని ద్వారా ఇప్పటివరకు 25 వేల మందికిపైగా మహిళలు, యువతులకు కంప్యూటర్, టైలరింగ్, మగ్గం వర్క్స్, సర్ఫ్, అగర్‌బత్తీల తయారీ తదితరాల్లో శిక్షణ ఇప్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు.



150 గ్రామాలకు ఆవాజ్ వనపర్తి

రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వనితా జ్యోతి సంస్థ ద్వారా వివిధ కార్యక్రమాలు చేపడుతున్న ఖమర్ రహమాన్ కమ్యూనిటీ రేడియో ప్రాధాన్యత గురించి తెలుసుకుని.. తానూ స్థాపించాలనే నిర్ణయానికి వచ్చారు. అనేకసార్లు ప్రయత్నించిన తర్వాత నాలుగేళ్లకు అనుమతి లభించింది. వీజేఎంఎస్ ఆవాజ్ 90.4 ఎఫ్ఎం రేడియో (ఆవాజ్ వనపర్తి) ఏర్పాటయ్యింది. 2018లో ప్రసారాలు ప్రారంభం కాగా.. ప్రస్తుతం ఆవాజ్ వనపర్తి రేడియో కార్యకలాపాల కోసం ప్రభుత్వం ఎకరా స్థలం కూడా కేటాయించింది. ఇందులో నుంచే బ్రాడ్ కాస్టింగ్ నడుస్తోంది. భవన నిర్మాణం పురోగతిలో ఉంది. ఇది పూర్తయితే రికార్డింగ్, బ్రాడ్‌కాస్టింగ్ ఒక్కచోట నుంచే జరుగుతుంది. ప్రస్తుతం వనపర్తి నుంచి 35 కిలోమీటర్ల మేర 150 గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేకున్నా ఎఫ్ఎం కార్యక్రమాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అదేవిధంగా ఆవాజ్ వనపర్తి 90.4 ఎఫ్ఎం పేరుతో వెబ్ రేడియో కూడా అందుబాటులోకి తేగా.. దీనికి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది శ్రోతలు ఉండడం విశేషం. రైతులు, మహిళల సమస్యలు పరిష్కారంపై నిపుణులతో కార్యక్రమాలు, జాతీయ నేతలు, మహానుభావుల జీవిత చరిత్ర, చారిత్రక ప్రాధాన్యం గల అనేక అంశాలతోపాటు ఆరోగ్య సూత్రాలు, చిట్కాలు, పద్యనాటకాలు, మిమిక్రీ, చిన్నపిల్లల కార్యక్రమాలు, యూనిసెఫ్ ప్రోగ్రామ్‌లు ప్రసారంతో ఇది బహుళ ప్రజాదరణ పొందుతోంది.

మహిళల కోసం మరిన్ని కార్యక్రమాలు..

దేశవ్యాప్తంగా కమ్యూనిటీ రేడియోకు నాతో పాటు మొత్తం 614 మంది దరఖాస్తు చేశారు. ఇందులో నాకే అవకాశం లభించింది. సాంకేతికతను ఉపయోగించి సమాజానికి మరింత మేలు చేయాలనే సంకల్పంతో దీన్ని స్థాపించా. ప్రస్తుతం ఈ రేడియోలో 18 మంది మహిళలు పని చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో చాలా అవార్డులు వచ్చినా..డిజిటల్ ఎంపవర్‌మెంట్ ఫౌండేషన్ (డీఈఎఫ్) నుంచి మూడు అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉంది. త్వరలో ప్రతి గ్రామానికి 2 రేడియోల చొప్పున అందజేసి.. మహిళల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతాం.

– ఖమర్ రహమాన్, ఆవాజ్ వనపర్తి రేడియో ఫౌండర్

సీబీఐ దర్యాప్తు జరిపించాలి

ఆధారాల్లేకుండానే వేలాది జనన, మరణ సర్టిఫికెట్లు, కార్డుల జారీపై బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ పరిధిలోని పాతబస్తీలో ఎలాంటి ఆధారాల్లేకుండా జారీచేసిన 27 వేల జనన, 4 వేల మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు రేషన్, ఓటర్ కార్డులపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేయించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యానికి, జీహెచ్‌ఎంసీలో పేరుకుపోయిన అవినీతికి ఈ ఉదంతం నిదర్శనమన్నారు. ఇందుకు నైతిక బాధ్యత వహించి సీఎం కేసీఆర్ పదవికి రాజీనామా చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెద్దలు, ఎంఐఎం నేతల హస్తం లేనిదే ఇంత భారీగా సర్టిఫికెట్ల జారీకి అవకాశం లేదని.. అందువల్ల దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తూతూమంత్రంగా విచారణ జరిపి కిందిస్థాయి సిబ్బంది, అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవాలని చూస్తోందని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో వేలాదిగా సర్టిఫికెట్ల జారీ ఆందోళన కలిగించే అంశమన్నారు.

దేశంలో అల్లర్లకు ఉగ్ర కుట్ర..

జీహెచ్‌ఎంసీ జారీచేసిన బర్త్ సర్టిఫికెట్లతో పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఉగ్రవాదులు పాస్‌పోర్టులు పొంది హైదరాబాద్ కేంద్రంగా దేశంలో అల్లర్లు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు. 'ఓట్లు, సీట్ల కోసం పాతబస్తీని ఎంఐఎంకు కేసీఆర్ ధారాదత్తం చేశాడు. ఎంఐఎం చెప్పినట్లు ఆడుతున్నాడు. మా అనుమతి లేకుండా పాతబస్తీలోకి అడుగుపెట్టే దమ్ముందా? అని అనడంతోపాటు 15 నిమిషాలు టైమిస్తే హిందువులను నరికి చంపుతామని ఒవైసీ సోదరులు సవాల్ విసిరినా నోరు మెదపని చేతగాని దద్దమ్మ కేసీఆర్' అని మండిపడ్డారు. టీఆర్‌ఎస్, ఎంఐఎం ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌లో అల్లర్లకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. పాతబస్తీ మొత్తం జల్లెడపడితే లక్షల్లో ఇలాంటి సర్టిఫికెట్లు మరిన్ని బయటపడే అవకాశం ఉందన్నారు. బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ అంశాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, పార్టీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి వాస్తవాలు వెలుగులోకి వచ్చేదాకా ఉద్యమిస్తామన్నారు.

కేంద్రాన్ని, బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదు

కేసీఆర్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు, బీఆర్‌ఎస్ నేతలకు కేంద్రాన్ని, బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం ఇక్కడ కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'మెడికల్ కాలేజీల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో నిద్ర నటించి ఇప్పుడు ఆ కాలేజీలు ఇవ్వాలని కోరితే, అందులో అర్థమేముంది?' అని ప్రశ్నించారు. తెలంగాణ పురోగతికి సహకరించాలని కోరుతూ వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివిధ అంశాలపై కేసీఆర్‌కు రాసిన లేఖలను కిషన్‌రెడ్డి మీడియాకు విడుదల చేశారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా దాకా మెట్రో డీపీఆర్ మంజూరైనా పాతబస్తీకి ఆ రైలు వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. ఎంఎంటీఎస్ ఫేజ్ 2లో భాగంగా ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు సర్వీస్ ఏర్పాటుకు రాష్ట్ర సర్కారు సహకరించడం లేదన్నారు.

ఢిల్లీ మద్యం కేసులో పిళ్లై అరెస్టు

సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్న ఈడీ

- కవిత, మాగుంట బినామీలుగా పిళ్లై, ప్రేమ్
- కవిత ప్రతినిధినని పిళ్లై ఒప్పుకున్నాడు
- ఆప్‌కు 100 కోట్ల ముడుపులు చేరవేశాడు
- రిమాండు రిపోర్టులో పేర్కొన్న ఈడీ
- మార్చి 13 దాకా ఈడీ కస్టడీకి పిళ్లై



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం అవకతవకల కేసులో మరో అరెస్టు జరిగింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అరుణ్ రామచంద్రన్ పిళ్లైని మనీ లాండరింగ్ అభియోగాలపై ఈడీ సోమవారం రాత్రి అరెస్టు చేసింది. 'సౌత్ గ్రూప్'నుంచి రూ.100 కోట్ల ముడుపులను ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీకి చేరవేశారన్నది పిళ్లైపై అభియోగం. ఆయనను మంగళవారం స్థానిక రౌజ్ అవెన్యూ కోర్టులో ఈడీ హాజరు పరిచింది. ఈ కేసులో ఇతర నిందితులైన మద్యం వ్యాపారి సమీర్ మహేంద్రు, ఆయన భార్య గీతిక మహేంద్రు, వారి కంపెనీ ఇండో స్పిరిట్ గ్రూప్‌తో కూడా ఆయనకు సంబంధాలున్నాయని ఈడీ పేర్కొంది. గత సెప్టెంబర్ నుంచి పిళ్లైని ఈడీ కనీసం 11సార్లు ప్రశ్నించింది. సోమవారం కూడా రోజంతా ప్రశ్నించిన అనంతరం, విచారణకు సహకరించడం లేదంటూ అదుపులోకి తీసుకుంది.

కవిత ప్రతినిధినని ఒప్పుకున్న పిళ్లై: ఈడీ

మద్యం కుంభకోణంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తుల్లో పిళ్లై కూడా ఒకరని రిమాండ్ రిపోర్టులో ఈడీ పేర్కొంది. 'సౌత్ గ్రూప్‌కు ప్రతినిధులుగా పిళ్లై, అభిషేక్ బోయినపల్లి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత సీఏ బుచ్చిబాబు వ్యవహరిస్తున్నారు. మద్యం కుంభకోణానికి సంబంధించి సౌత్ గ్రూప్, ఆప్ నేతల మధ్య రాజకీయ ఒప్పందాల అమలును పిళ్లై సమన్వయం చేశారు. సౌత్ గ్రూప్ నుంచి ఆప్‌కు ముడుపులు చేరవేశారు. ప్రేమ్ రాహుల్ అనే వ్యక్తితో కలిసి కవిత, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఆయన కుమారుడు మాగుంట రాఘవ్‌ల బినామీ పెట్టుబడులకు ప్రతినిధిగానూ ఉన్నారు. ఢిల్లీ మద్యం వ్యాపారంలో 30 శాతానికి పైగా నియంత్రిస్తున్న తయారీదారులు, హోల్‌సేలర్లు, రిటైల్ వ్యాపారులతో సౌత్‌గ్రూప్ తరఫున బోయినపల్లి, బుచ్చిబాబులతో కలిసి పిళ్లై సిండికేట్ ఏర్పాటు చేశారు. తద్వారా కుంభకోణంలో కీలక పాత్ర పోషించారు. ఈ కేసులో పిళ్లై ఇప్పటిదాకా రూ.32.8 కోట్ల ముడుపులను చేరేశారు. రూ.25.5 కోట్లు ఆయన బ్యాంకు ఖాతాకు నేరుగా బదిలీ అయ్యాయి' అని ఆరోపించింది. 'ఎల్1 లైసెన్సు పొందిన ఇండో స్పిరిట్స్‌లో పిళ్లైకి 32.5 శాతం భాగస్వామ్యముంది. పిళ్లై రూ.3.4 కోట్లు పేపర్ ఇన్వెస్టిమెంట్ చేశారు. దీనికి ప్రతిఫలంగా కవిత ఆదేశాల మేరకు పిళ్లైకి రూ.కోటి ఇచ్చారు. పిళ్లై, ఆయన భార్యకు చెందిన రూ.5.72 కోట్లు విలువైన స్థిర, చరాస్తులు జప్తు చేశాం' అని వివరించింది. ఈ కుంభకోణంలో కవిత ప్రతినిధిగా వ్యవహరించానని విచారణలో పిళ్లై చెప్పినట్టు పేర్కొంది. 'ఆడిటర్ బుచ్చిబాబు కూడా తన స్టేట్‌మెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. బుచ్చిబాబు వాట్సాప్ చాట్ ద్వారా వెల్లడైన అంశాల దృష్ట్యా పిళ్లైని, ఆయనను కలిపి విచారించాల్సిన అవసరముంది' అని పేర్కొంది. సాక్ష్యాలుంటే పిళ్లైని ముందే ఎందుకు అరెస్టు చేయలేదని ప్రత్యేక న్యాయమూర్తి నాగ్‌పాల్ ఎం.కె.ప్రశ్నించారు. 'సేకరించిన ఆధారాల మేరకే అరెస్టు చేశాం. మరిన్ని వివరాలు సేకరించాల్సి ఉంది. ఏడు రోజులపాటు పిళ్లైని కస్టడీకివ్వండి' అని ఈడీ న్యాయవాదులు కోరారు. ఇందుకు పిళ్లై తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. 'ఆయన్ను దర్యాప్తు సంస్థలు 39 సార్లు ప్రశ్నించాయి. సహకరించడం లేదనడం సరికాదు'.. అన్నారు. అనంతరం పిళ్లైని మార్చి 13 దాకా ఈడీ కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు. మార్చి 1న ఈడీ అరెస్టు చేసిన మరో నిందితుడు మద్యం వ్యాపారి, బ్రిండ్కో సేల్స్ ఈడీ అమన్‌దీప్ ధాల్‌ను మార్చి 21 దాకా జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించారు.

సిసోడియాను విచారించిన ఈడీ

ఢిల్లీ మద్యం విధానం కేసులో తిహార్ జైల్లో ఉన్న ఆప్ నేత మనీశ్ సిసోడియాను మనీ లాండరింగ్ అభియోగాలపై ఈడీ మంగళవారం ఐదు గంటల పాటు విచారించింది. ఆయన స్టేట్‌మెంట్‌ను నమోదు చేసింది. విచారణ మరి కొన్ని రోజులు కొనసాగే అవకాశముంది. తరచూ సెల్ ఫోన్లు మార్చడం, వాటిని ధ్వంసం చేయడం, ఢిల్లీ ఎక్సైజ్ మంత్రిగా మద్యం విధానంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు, వాటి కాలక్రమం తదితరాలపై ప్రశ్నించనున్నట్టు ఈడీ వర్గాలు తెలిపాయి. ఈ కేసులో సిసోడియాను ఫిబ్రవరి 26న సీబీఐ అరెస్టు చేయడం తెలిసిందే. మనీ లాండరింగ్ కేసులో దోషిగా ఉండి దర్యాప్తుకు సహకరించని పక్షంలో అరెస్టుకు వీలు కల్పించే పీఎంఎల్‌ఏ సెక్షన్ 19 కింద కూడా ఆయనపై అభియోగాలు మోపవచ్చంటున్నారు. ఈ కేసులో ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పేరు కూడా చార్జిషీట్‌లో చోటుచేసుకోవడం తెలిసిందే. మరోవైపు ఈ కేసులో సిసోడియా పీఏ దేవేందర్ శర్మ అలియాస్ రింకూను కూడా సీబీఐ ప్రశ్నించింది.

ఆమె అక్షర... లక్ష్మి

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నత విద్య వైపు నడిపిస్తున్నాయి. అందుకే ఏ వర్సిటీ చూసినా, ఏ కోర్సు పరిశీలించినా మహిళల శాతమే మెరుగ్గా ఉంటోంది.

అబ్బురపరిచే అంకెలు

- ఉస్మానియా వర్సిటీ పరిధిలో లా, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజనీరింగ్, బీఎడ్‌కు సంబంధించిన 20 కాలేజీలుంటే, అందులో 18,763 సీట్లున్నాయి. 2022లో వీటిల్లో 10,897 సీట్లు (58.09 శాతం) అమ్మాయిలే దక్కించుకున్నారు. ఓయూ క్యాంపస్‌లో 1,599 సీట్లుంటే 1,083 సీట్లు వారివే. పీజీ సెంటర్స్‌లోని 202 సీట్లలో అమ్మాయిల వాటా 107.
- జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో 2010–11లో 58 శాతం సీట్లు అబ్బాయిలతో భర్తీ అయ్యాయి. 2022లో సీన్ దాదాపు రివర్స్ అయ్యింది. చేరికల్లో అబ్బాయిలది 45 శాతం అయితే, అమ్మాయిలది 55 శాతం.
- పీజీలోనూ అమ్మాయిలదే హవా. వివిధ కోర్సుల్లో దాదాపు 80 శాతం మహిళలే ఉండటం విశేషం. కరోనా తర్వాత బాలురు ఇంజనీరింగ్, డిగ్రీతో ఉపాధి వైపు వెళ్తుంటే, అమ్మాయిలు మాత్రం పీజీలో చేరుతున్నారు.

పరిశోధనల వరకూ వెళ్లాలి



మహిళల్లో ఇప్పటికే చాలా మార్పు వచ్చింది. పోస్టు–గ్రాడ్యుయేషన్ వరకూ ఎక్కడా ఆగకుండా ముందుకెళ్తున్నారు. కానీ రీసెర్చ్ వరకూ వెళ్లలేకపోతున్నారు. ఆరేళ్ల సమయం వెచ్చించాల్సి రావడం కొంత ఇబ్బందిగానే ఉంది. – ప్రొఫెసర్ విజ్జులత, వీసీ, తెలంగాణ మహిళా యూనివర్సిటీ

సాధికారత సాధించాలి



విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరుగుతోంది. సామాజిక మార్పులు, ప్రభుత్వాల ప్రోత్సాహం వల్లే సమాజంలో మహిళలు ముందడుగు వేస్తున్నారు.

– వాకాటి కరుణ, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి

విధాన నిర్ణేతలుగా ఎదగాలి



చదువుతో సామాజికంగా మహిళ ఉన్నత శిఖరాలనే అధిరోహిస్తోంది. అయితే క్రిటికల్ జాబ్స్‌లో ఇంకా మహిళకు ఎదురీత తప్పడం లేదు. విధాన పరమైన నిర్ణయాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగితే ఈ పరిస్థితి మారుతుంది. అత్యున్నత పదవుల్లో ఉన్నా మహిళకు ఇంటి బాధ్యతలు తప్పడం లేదు. – సూర్యదేవర నీలిమ, సీఈఓ, అనురాగ్ యూనివర్సిటీ

డిజిటల్ టెక్నాలజీ వైపు అడుగులేయాలి



విద్యా రంగంలో మార్పులకు అనుగుణంగా మహిళలూ ముందుకెళుతున్నారు. వృత్తి విద్యా కోర్సుల్లో రాణించేలా ప్రస్తుత సమాజ పోకడలను అవగతం చేసుకుంటున్నారు. మా క్యాంపస్‌లో ప్రత్యేక కోర్సును డిజిటల్ టెక్నాలజీలో ప్రవేశపెడుతున్నాం.

– ప్రొఫెసర్ కవిత దార్యాణి, వీసీ, జేఎన్ఎఫ్ఏ

డిగ్రీలో ఆరేళ్లుగా విద్యార్థులు, విద్యార్థినుల భాగస్వామ్యం ఇలా..

సంవత్సరం	విద్యార్థులు	విద్యార్థినులు
2017-18	90,696	1,10,110
2018-19	94,483	1,07,383
2019-20	94,633	1,07,709
2020-21	1,14,408	1,08,212
2021-22	1,29,245	1,25,887
2022-23	1,02,050	1,10,761



వర్సిటీల్లో విద్యార్థులు, విద్యార్థినుల చేరికలు (2022లో) ఇలా.. (బ్రాకెట్లలో శాతం)



యూనివర్సిటీ	అబ్బాయిలు	అమ్మాయిలు
ఉస్మానియా	7,866 (41.92)	10,897 (58.8)
ఫైన్ ఆర్ట్స్	431 (45)	522 (55)
మహాత్మాగాంధీ	245 (43.91)	313 (56.09)
పాలమూరు	347 (40.69)	585 (59.31)
శాతవాహన	116 (26)	339 (74)
తెలంగాణ	561 (33)	1180 (67)
కాకతీయ	774 (39)	1229 (61)

అనుబంధ కాలేజీల్లో (ప్రైవేటు) వర్సిటీల వారీగా పీజీ ప్రవేశాలు (2022లో)

వర్సిటీ	అబ్బాయిలు	అమ్మాయిలు
కాకతీయ	933	2,874
మహాత్మాగాంధీ	248	611
ఓయూ	1,388	4,197
పాలమూరు	185	450
శాతవాహన	396	2,072
తెలంగాణ	231	825



నేడు 'ఆరోగ్య మహిళ'

- అన్ని వయసుల వారికి 57 రకాల వైద్య పరీక్షలు
- రాష్ట్రవ్యాప్తంగా 100 ఆరోగ్య కేంద్రాల్లో నేడు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా వంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'ఆరోగ్య మహిళ' పథకాన్ని ప్రజాప్రతినిధులు ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం మొదలుకానుంది. ప్రతి మంగళవారం ప్రాథమిక వైద్య కేంద్రాల్లో మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడంతో పాటు, అవసరమైన వారిని రెఫరల్ ఆసుపత్రులకు పంపించనున్నారు. 33 జిల్లాల్లో అన్ని వయసుల వారికి 57 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రధానంగా ఎనిమిది ప్యాకేజీలుగా విభజించిన ఈ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో డయాగ్నోస్టిక్స్, కేన్సర్ స్క్రీనింగ్, పోషకాహార లోపంతో వచ్చే సమస్యలు, మూత్రసంబంధిత సమస్యలు, మెనోపాజ్ సంబంధిత, కుటుంబ నియంత్రణ, ఇన్ఫర్టిలిటీ, మెన్‌స్ట్రువల్ సమస్యలు, సుఖవ్యాధులు, తక్కువ బరువున్న సమస్యలకు వైద్య పరీక్షలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన 20 పాథలాజికల్ లాబ్‌లలో నిర్వహిస్తారు. వీటితోపాటు, బీపీ, షుగర్, అనీమియా పరీక్షలను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తారు. ఈ పరీక్షల రిపోర్టులను 24 గంటలలోపే సంబంధిత మహిళలకు అందచేస్తారు.

కేన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు సైతం

ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలలో 30 ఏళ్లు పైబడ్డ మహిళలకు బ్రెస్ట్ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేపడతారు. జిల్లా కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రులలో మమోగ్రామ్స్ కల్పోస్కోపి, క్రియోథెరపి, బయాప్సి, పాప్‌స్మియర్ పరీక్షలను నిర్వహిస్తారు. హైదరాబాదులోని నిమ్స్, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రుల్లో నిర్ధారిత కేన్సర్ మహిళలకు చికిత్స అందిస్తారు. అయోడిన్ లోపం (థైరాయిడ్), విటమిన్ డి–3, బి–12 తదితర వైద్య పరీక్షలను అవసరం ఉన్నవారికి నిర్వహిస్తారు. మూత్ర సంబంధిత వ్యాధులను ఎదుర్కొనే మహిళలకు రాష్ట్రంలోని అన్ని పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలలో ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారు. మెనోపాజ్, బహిష్టు, కుటుంబ నియంత్రణ, సంతానలేమి తదితర సమస్యలకు కూడా పరీక్షలు నిర్వహించి కౌన్సిలింగ్ చేస్తారు. అవసరమున్నవారికి అల్ట్రాసౌండ్ పరీక్షలకు జిల్లా కేంద్రాలకు రెఫర్ చేస్తారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో పాటు పేషంట్ కేర్ కార్యకర్తలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారు.

రాష్ట్రానికి ఎన్ని కొత్త ఐటీ కంపెనీలు, ఉద్యోగాలొచ్చాయి?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి కొత్తగా ఎన్ని ఐటీ కంపెనీలు, వాటి వల్ల ఎన్ని ఉద్యోగాలు కల్పించారో శ్వేతపత్రం ద్వారా వెల్లడించాలని మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, యూత్ కాంగ్రెస్ నేత సామ రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. ఐటీ పరిశ్రమల గురించి గత నాలుగైదు రోజులుగా బీఆర్‌ఎస్ నేతలు ఆర్భాటపు ప్రచారం చేసుకుంటున్నారని, కాంగ్రెస్ హయాంలో వచ్చిన ఐటీ పరిశ్రమలను విస్తరించడమే తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం నుంచి 65 ఐటీ కంపెనీలు వెళ్లిపోయాయని తెలిపారు. కోదండరెడ్డి మాట్లాడుతూ జలయజ్ఞం, ఐటీ అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్రే లేనట్టు బీఆర్‌ఎస్ నేతలు చెప్పడం ఆక్షేపణీయమన్నారు. కేటీఆర్ వాడుతున్న టెలిఫోన్, ట్విట్టర్‌లు రాజీవ్‌గాంధీ హయాంలో అందుబాటులోకి వచ్చాయని గుర్తుచేశారు.

క్లుప్తంగా...

టీఎస్ఐసెట్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం (2023-2024)లో ప్రవేశాలకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకునే ప్రక్రియ ఈనెల 6 నుంచి ప్రారంభమైందని టీఎస్ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుము లేకుండా ఈ ఏడాది మే 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రూ.250 అపరాధ రుసుముతో మే 12 వరకు, రూ.500 అపరాధ రుసుముతో మే 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. టీఎస్ ఐసెట్‌కు సంబంధించిన సిలబస్, మోడల్ పేపర్లు, ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించే విధానం, ఆన్‌లైన్, పరీక్ష కేంద్రాలు తదితర వివరాలు సంబంధిత వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్//ఐసెట్.టీఎస్‌సీహెచ్ఈ.ఏసీ.ఇన్‌లో అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు.

టీఎస్ లైఫ్‌సైన్సెస్ ఫెలోషిప్‌కు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్ లైఫ్ సైన్సెస్ ఫెలోషిప్ కోసం తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. మానవ జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు నిపుణులు ముందుకు రావాలని, ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం టీఎస్ లైఫ్ సైన్సెస్ ఫెలోషిప్ అందిస్తోందని మంత్రి కేటీఆర్ మంగళవారం ట్వీట్ చేశారు. లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టంను 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన టీఎస్ లైఫ్ సైన్సెస్ ఫెలోషిప్ కోసం నిబద్ధత కలిగిన నిపుణులు దరఖాస్తు చేసుకోవాలని కేటీఆర్ కోరారు.

కవితలకు ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కొత్త సచివాలయం, నిర్మాణంలో ఉన్న భారీ అంబేడ్కర్ విగ్రహం, తెలంగాణ అమరవీరుల స్మారకం.. ఈ మూడు కొత్త నిర్మాణాలకు సంబంధించి కవితా సంకలనాన్ని రూపొందించాలని నిర్ణయించినట్టు తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. ఈమేరకు ఔత్సాహికులు 25 పంక్తులకు మించకుండా కవితలు రాసి పంపాలని కోరారు. కవితలను మార్చి 31వ తేదీలోపు అందేలా tsakademi.2017@gmail.comకు లేదా 9440233261 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలని ఒక ప్రకటనలో తెలిపారు.

సాహితీ ఇన్‌ఫ్రా డైరెక్టర్ సాత్విక్ అరెస్ట్, రిమాండ్



సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: ప్రీ లాంచ్ ఆఫర్‌తో వేలాది మంది నుంచి మొత్తం రూ.900 కోట్లు వసూలు చేసి భారీ మోసానికి పాల్పడ్డ సాహితీ ఇన్‌ఫ్రా ఎండీ లక్ష్మీనారాయణ కొడుకు బుదాటి సాత్విక్‌ను మంగళవారం సీసీఎస్ పోలీసులు శంషా బాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. నిర్మాణాలు చేపట్టకముందే తక్కువ ధరకు గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్ ఇస్తామంటూ సాహితీ ఇన్‌ఫ్రా వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, అతని కుటుంబసభ్యులు భారీ మోసాలకు పాల్పడ్డారు. అమీన్‌పూర్‌లో 23 ఎకరాల్లో సాహితీస్ శ్రావణి ఎలైట్ పేరుతో 38 అంతస్తులతో హైరేజ్ అపార్టుమెంట్లు నిర్మిస్తున్నామని, 1200 చదరపు అడుగుల నుంచి 1700 చదరపు అడుగులలో డబుల్, త్రిబుల్ బెడ్ రూమ్‌లు కట్టిస్తామంటూ ప్రీ లాంచ్ ఆఫర్ ప్రకటించాడు. మార్కెటింగ్ టీమ్‌లను పెట్టి సుమారు 2500 మంది నుంచి రూ.900 కోట్లు వసూలు చేశాడు. ఒప్పందం ప్రకారం ఫ్లాట్లు నిర్మించి ఇవ్వకపోవడంతో బాధితులు లక్ష్మీనారాయణపై ఒత్తిడి తెచ్చారు. అయితే చెల్లించిన డబ్బుతో పాటు 15 నుంచి 18 శాతం వడ్డీ కలిపి ఇస్తానంటూ మరోసారి బాధితులకు మాట ఇచ్చి చెక్కులను అందజేశాడు. కానీ అవి కూడా బౌన్స్ అయ్యాయి. దీంతో బాధితులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గత ఏడాది డిసెంబర్ 3న లక్ష్మీనారాయణను అరెస్ట్ చేశారు. నిందితులలో ఒకరైన అతని కొడుకు సాత్విక్‌పై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నించిన సాత్విక్‌రెడ్డిని శంషాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. సీసీఎస్ పోలీసులు సాత్విక్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ముగిసిన జీ-20 జీపీఎఫ్ఐ సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: జీ-20 అధ్యక్ష స్థానంలో భారత్ నిర్వహించిన రెండో గ్లోబల్ పార్టనర్‌షిప్ ఫర్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూషన్ (జీపీఎఫ్ఐ) సమావేశాలు హైదరాబాద్‌లో మంగళవారం ఘనంగా ముగిశాయి. రెండ్రోజులపాటు జరిగిన ఈ సమావేశాల్లో జీ-20 దేశాలతో పాటు ఇతర దేశాల ఆర్థిక శాఖమంత్రులు, ప్రధాన బ్యాంకుల ప్రతినిధులు, అంతర్జాతీయ రుణ సంస్థలు, ఇతరులు పాల్గొన్నారు. భారత్, ఇటలీ రెండూ జీపీఎఫ్ఐ అధ్యక్ష స్థానంలో దీర్ఘకాలం కొనసాగించాలని ఈ సమావేశాల్లో నిర్ణయించారు. జీపీఎఫ్ఐ ప్లీనరీ సమావేశాల్లో అందరికీ ఆర్థిక వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చేందుకు ఏం చేయాలి? ఎలాంటి లక్ష్యాలతో కార్యక్రమాలను రూపొందించాలి? చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సులువుగా రుణ సౌకర్యాలు కల్పించడం ఎలా? అన్న అంశాలపై చర్చలు జరిగాయి.

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

వారందరూ ఓ చిన్న తండాకు చెందిన గిరిజన మహిళలు. రెక్కాడితే గానీ డొక్కాడదు. ఆ పరిస్థితి నుంచి బయట పడేందుకు, తమ కుటుంబాలను గాడిన పెట్టేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. చివరకు అందరూ ఏకమై దారులు వెతికారు. వినూత్న ఆలోచనను ఒడిసిపట్టి విజయబావుటా ఎగురవేశారు. లెమన్ గ్రాస్ (నిమ్మగడ్డి)తో సుగంధ ద్రవ్యాన్ని (నూనె) తయారుచేస్తూ.. ఓ అంతర్జాతీయ ఏజెన్సీ సహకారంతో మార్కెటింగ్ చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే తొలి యూనిట్ ఏర్పాటు చేసి ఆర్థికాభివృద్ధి దిశగా పయనిస్తూ.. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న చీకరుచెట్టు తండా మహిళలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

లెమన్ గ్రాసే లచ్చిందేవి!



నిమ్మగడ్డితో సుగంధ ద్రవ్యం తయారీ

సబ్బులు, సెంట్లు, లెమన్ టీ పొడి తదితర ఉత్పత్తులు కూడా..

పేదరికం నుంచి పురోభివృద్ధి దిశగా చీకరుచెట్టు తండా మహిళలు

అంతర్జాతీయ ఏజెన్సీతో మార్కెటింగ్ ఒప్పందం



లెమన్‌గ్రాస్ ఆయిల్‌తో తయారు చేసిన సెంట్ బాటిళ్లు

అడుగులు ఇలా..

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని చీకరుచెట్టు తండా జనాభా 570 మంది. ఈ చిన్న తండాలో 14 మహిళా సంఘాలు ఉండగా.. ఇందులో సుమారు 150 మంది సభ్యులు ఉన్నారు. గతంలో బ్యాంకు లింకేజీ రుణాలతో చిన్నపాటి వ్యాపారాలు చేసుకునేవారు. ఆంధ్రప్రదేశ్‌లోని సెరా అనే సంస్థ మహిళా చైతన్యం, ఆర్థికాభివృద్ధిపై 2021 జనవరిలో జిల్లాలోని పలు గ్రామాల్లో మహిళా సంఘాలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ఈ క్రమంలోనే పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లిలో జరిగిన సదస్సుకు చీకరచెట్టు తండాలోని మహిళలు హాజరయ్యారు. లెమన్ గ్రాస్‌తో సుగంధ ద్రవ్యంతో పాటు పలు ఉత్పత్తులు తయారు చేయవచ్చని తెలుసుకున్నారు. పదిమంది మహిళలు గ్రూపుగా ఏర్పడి.. తమ ఆసక్తిని అప్పటి కలెక్టర్ షేక్ యాస్మిన్‌భాషా దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆర్థిక సాయంతో పాటు ప్రోత్సాహం అందించడంతో.. వారంతా ఝూన్సీలక్ష్మీబాయి మహిళా సంఘంగా ఏర్పడి సుగంధ ద్రవ్యం, ఇతర ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను ప్రారంభించారు.

ఆదరణ లభిస్తోంది..

నిమ్మగడ్డి పంట రెండు నెలలకోసారి వస్తుంది. అయినా దీని సాగు ఇంకా పెరగాల్సి ఉంది. ఈ మేరకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం రెండు నెలలకోసారి 80 నుంచి 100 లీటర్ల వరకు ఆయిల్ విక్రయిస్తున్నాం. దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఎగ్జిబిషన్లలో పాల్గొన్నాం. మేం తయారు చేసే లెమన్ గ్రాస్ ఆయిల్, సబ్బులు ఇతరత్రా ఉత్పత్తుల్లో ఎలాంటి రసాయనాలు లేకపోవడంతో మంచి ఆదరణ ఉంది. వనపర్తి కలెక్టరేట్‌లో లెమన్ టీ సెంటర్ ఏర్పాటు చేశాం.

- మోతీబాయి, ఝూన్సీ లక్ష్మీబాయి మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

అంతర్జాతీయ సంస్థతో ఒప్పందం

మొత్తం యూనిట్ కాస్ట్ రూ.11.50 లక్షలు కాగా.. కలెక్టర్ నుంచి రూ.6.50 లక్షలు, సెరా సంస్థ రూ.2 లక్షలు సాయం లభించింది. మహిళలు తమవంతుగా రూ.3 లక్షలు వేసుకుని యూనిట్‌ను నెలకొల్పారు. మొదట లెమన్ గ్రాస్ సేకరించి సుగంధ ద్రవ్యం తయారు చేయడం మొదలుపెట్టారు. ఆ తర్వాత నూనెతో పలు ఉత్పత్తులకూ రూపకల్పన చేశారు. అంతేకాదు.. వీటిని మార్కెటింగ్ చేయడం ఎలా అని ఆలోచించి ఓ స్వచ్ఛంద సంస్థ సహకారం తీసుకున్నారు. బెంగళూరుకు చెందిన ఓ ఇంటర్నేషనల్ మార్కెటింగ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నారు. యూనిట్ ఏర్పాటుకు సంబంధించి ట్రికా నుంచి ఇటీవల రూ.11.13 లక్షల సబ్సిడీ విడుదలైంది.

లీటర్ ఆయిల్‌కు రూ.1,400

టన్ను నిమ్మగడ్డితో ఆ మహిళలు ఆరు లీటర్ల నూనె తయారు చేస్తున్నారు. మార్కెట్‌లో ఈ ఆయిల్ లీటర్‌కు రూ.1,400 పలుకుతోంది. ఈ నూనెతో క్రిమినాశక సబ్బులు, షాంపూలు, పలు కాస్మోటిక్స్, ఫేస్ క్రీమ్, హెయిర్ ఆయిల్, లెమన్‌టీ పౌడర్ తయారు చేయవచ్చు. ప్రస్తుతం ఇక్కడి మహిళలు సబ్బులు, ఫినాయిల్, ఫ్లోర్ క్లీనర్, సెంట్లు, లెమన్ టీ పౌడర్ తయారు చేసి విక్రయిస్తున్నారు. భవిష్యత్‌లో అగర్‌బత్తులతో పాటు ధూప్ స్టిక్స్ ఇతరత్రా తయారు చేయనున్నట్లు మహిళలు వెల్లడించారు.

పెరుగుతున్న సాగు

సంఘంలో ఉన్న సభ్యులు మొదట తమ తమ వ్యవసాయ పొలాల్లో నిమ్మగడ్డి సాగు చేశారు. తర్వాత తాము కొంటామంటూ చుట్టుపక్కల గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయడంతో పాటు రైతులను యూనిట్ వద్దకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు. ఈ క్రమంలో దొడగుంటపల్లి, పామిరెడ్డిపల్లి, చిలకటోనిపల్లి, పెద్దమందడి గ్రామాల్లో చాలామంది రైతులు లెమన్ గ్రాస్ సాగు చేపట్టారు. ఈ మేరకు టన్ను నిమ్మగడ్డికి రూ.4 వేలు ఇవ్వడంతో పాటు మంట కోసం ఉపయోగించిన గడ్డి కాలిపోగా వచ్చిన బూడిదను పొలాల్లో ఎరువుగా వినియోగించేందుకు సదరు రైతులకే అందజేస్తున్నారు.



లెమన్ ఆయిల్ తీసే యూనిట్ వద్ద మహిళా గ్రూపు సభ్యులు

మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం

సీఐఐ వార్షిక సమావేశంలో మంత్రి కేటీఆర్

- మరిన్ని సీఐఐ సదస్సులు నిర్వహిస్తాం
- ఉపాధి కల్పనే మా తొలి ప్రాధాన్యం
- లైఫ్‌సైన్సెస్, టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులకు హైదరాబాద్ అత్యుత్తమ వేదిక



టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు అవార్డు అందజేస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం.. మరిన్ని సీఐఐ సదస్సులు నిర్వహిస్తాం' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. వ్యాపారులు, పెట్టుబడులకు రాష్ట్రంలో అద్భుతమైన వాతావరణం ఉందన్నారు. లైఫ్‌సైన్సెస్‌తోపాటు టెక్నాలజీ రంగానికి హైదరాబాద్ అత్యుత్తమ వేదికగా మారిందన్నారు. బేగంపేటలో మంగళవారం ఏర్పాటుచేసిన సీఐఐ తెలంగాణ వార్షిక సమావేశానికి మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల బయో ఆసియా సదస్సును విజయవంతంగా నిర్వహించుకున్నామని, లైఫ్‌సైన్సెస్ రంగంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని కేటీఆర్ తెలిపారు. 2013తో పోలిస్తే రాష్ట్రంలో పెట్టుబడులు రెట్టింపయ్యాయని, 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాలనే లక్ష్యంతో ఉన్నామని మంత్రి వివరించారు. ఉపాధి కల్పనకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తోందన్నారు.

ప్రపంచ టీకాల్లో సగం హైదరాబాద్‌లోనే తయారీ..

ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయ్యే టీకాల్లో 50 శాతం హైదరాబాద్‌లోనే తయారవుతున్నాయని, 900 కోట్ల టీకాలు ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ ఉత్పత్తి 1,400 కోట్ల డోస్‌లకు పెరగవచ్చన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్టెంట్ తయారీ కేంద్రం తెలంగాణలోని డివైజెస్ పార్కులోనే ఉందన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేశామని, ఇది దేశానికే మొబిలిటీ కేంద్రంగా మారుతుందని చెప్పారు.

వచ్చే ఐదేళ్లలో మరిన్ని పారిశ్రామిక పార్కులు

గత ఎనిమిదేళ్లలో 28,500 ఎకరాల్లో 55 పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసినట్లు కేటీఆర్ తెలిపారు. గత 40 ఏళ్లలో 26 వేల ఎకరాల్లో అభివృద్ధి చేసిన 109 పారిశ్రామిక పార్కులకంటే ఇవి ఎక్కువన్నారు. ప్రస్తుతం మరో 72 ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లలో 30 వేల ఎకరాల్లో పారిశ్రామిక పార్కుల్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు.

సాంకేతిక పురోగమనం..

నేడు తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఈ పరిణామం దేశవ్యాప్తంగా ప్రతిభావంతులను, మేధావులను ఆకర్షిస్తోందని మంత్రి కేటీఆర్ చెప్పారు. డిజిటల్ అక్షరాస్యత, సాంకేతిక పురోగమనం పెద్దవారికే కాకుండా చిన్న, సూక్ష్మ పారిశ్రామికవేత్తలకు సహాయపడేలా వివిధ కార్యక్రమాల ద్వారా ప్రయత్నిస్తున్నామన్నారు. తెలంగాణ వ్యాపారాల కోసం ప్రారంభించిన ఇండియన్ బిజినెస్ పోర్టల్ గ్లోబల్‌లింకర్ ప్రత్యేకంగా ఎగుమతులను ప్రోత్సహించడం కోసం రూపొందిందన్నారు.

విద్యుత్, టెక్స్‌టైల్ రంగాలకు ఊతం..

ఎలక్ట్రిక్ వాహన రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని కేటీఆర్ తెలిపారు. టెక్స్‌టైల్ రంగంలోనూ పెట్టుబడులకు విస్తృత పరిధి ఉందన్నారు. భారీస్థాయిలో కాకతీయ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ సంస్థ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. ఈ సంస్థకు 200 ఎకరాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, సీఐఐ సదరన్ రీజియన్ చైర్‌పర్సన్ సుచిత్ర ఎల్లా, సీఐఐ తెలంగాణ చైర్మన్ వాగీష్ దీక్షిత్, కిటెక్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ సాబు ఎం.జాకబ్, గ్లోబల్ లింకర్ డైరెక్టర్ మాళవిక జగ్గీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఇండస్ట్రీస్ అవార్డ్స్-2022' విజేతలను ప్రకటించింది. 28 మంది అవార్డు గ్రహీతలను ప్రభుత్వం తరఫున మంత్రి కేటీఆర్ అభినందించారు.

హైదరాబాద్ అత్యుత్తమ వేదిక..

ఫార్మా పరిశ్రమలకు ఒకేచోట అత్యుత్తమ వసతులు కల్పిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. సుల్తాన్‌పూర్ వద్ద అతిపెద్ద మెడికల్ డివైజెస్ పార్కు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రైవేటు రంగంలో ఉపగ్రహాల తయారీ మొట్టమొదటగా హైదరాబాద్‌లోనే జరిగిందని, ప్రైవేటుగా రాకెట్ లాంచింగ్ చేసిన స్కైరూట్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. డ్రోన్ల ద్వారా ఔషధాలు సరఫరా చేసే వినూత్న కార్యక్రమం చేపట్టామని, అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, అడోబ్ వంటి సంస్థలు హైదరాబాద్‌లో అతిపెద్ద ప్రాంగణాలు ఏర్పాటు చేసుకున్నాయని కేటీఆర్ వివరించారు.

ఎమ్మెల్యే కోటా అభ్యర్థులు వీరే

ఖరారు చేసిన సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

- కుర్మయ్యగారి నవీన్‌కు రెండోసారి అవకాశం
- దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రామిరెడ్డికి చాన్స్
- 9న కేబినెట్ భేటీలో గవర్నర్ కోటా అభ్యర్థుల ఎంపిక

సాక్షి, హైదరాబాద్: ఆశావహుల్లో ఉత్కంఠకు తెర దించుతూ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం ఖరారు చేశారు. శాసనమండలిలో ఈ నెల 29న ఖాళీ అవుతున్న మూడు ఎమ్మెల్యే కోటా స్థానాల కోసం నామినేషన్ల దాఖలుకు గడువు ఈ నెల 13న ముగియనుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థులను కేసీఆర్ ప్రకటించారు. ప్రస్తుత ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌రావుకు మరోమారు అవకాశం ఇవ్వగా, కొత్తగా రచయిత, గాయకుడు దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డిని ఎంపిక చేశారు. ఈ నెల 9న వీరు తమ నామినేషన్ పత్రాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేయాల్సిందిగా శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కేసీఆర్ ఆదేశించారు.

'గవర్నర్' అభ్యర్థుల ఖరారు రేపు



శాసనమండలిలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు డి.రాజేశ్వర్‌రావు, ఫారూక్ హుస్సేన్ ఈ ఏడాది మేలో ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకుంటున్నారు. ఈ స్థానాల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఈ నెల 9న సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగే కేబినెట్ భేటీలో అభ్యర్థులను ఎంపిక చేసి గవర్నర్‌కు సిఫారసు చేయనున్నా రు. రాజేశ్వర్‌రావు, ఫారూక్ హుస్సేన్ ఇద్దరూ మైనారిటీ వర్గానికి చెందిన వారు కావడంతో కొత్త అభ్యర్థుల విషయంలో ఉత్కంఠ నెలకొంది. రిటైర్ అవుతున్న ఇద్దరూ ఇప్పటికే రెండుసార్లు ఎమ్మెల్సీలుగా పనిచేశారు. రాజేశ్వర్‌రావుకు మరోమారు అవకాశం దక్కుతుందని సమాచారం.

గౌడ సామాజికవర్గం నుంచి..

ప్రస్తుతం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్ రిటైర్ అవుతుండటంతో మండలిలో గౌడ సామాజికవర్గానికి ప్రాతినిధ్యం లేకుండా పోతోంది. దీంతో గవర్నర్ కోటాలో మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ లేదా గంగాధర్‌గౌడ్‌కు అవకాశం దక్కుతుందని అంటున్నారు. గతంలో గవర్నర్ కోటాలో పాడి కౌశిక్‌రెడ్డి పేరును కేబినెట్ సిఫారసు చేసినా గవర్నర్ తిరస్కరించడాన్ని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల ఎంపిక ఉంటుందని సమాచారం. ప్రొఫెసర్ గంటా చక్రపాణి పేరు కూడా గవర్నర్ కోటాలో సిఫారసు చేసే అంశం సీఎం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

వ్యూహాత్మకంగా అభ్యర్థుల ఎంపిక

ఈ నెలాఖరులో పదవీకాలం పూర్తి చేసుకుంటున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలు కుర్మయ్యగారి నవీన్‌రావు, ఎలిమినేటి కృష్ణారెడ్డి, వి.గంగాధర్ గౌడ్‌లో నవీన్‌రావు ఒక్కరికే రెండోసారి అవకాశం దక్కింది. జీహెచ్ఎంసీ పరిధిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేస్తున్న బృందంలో ఈయన కీలకంగా పనిచేస్తున్నారు. ఇక తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తిలో కీలకపాత్ర పోషించిన దేశపతి శ్రీనివాస్ రాష్ట్ర ఆవిర్భావం నుంచి సీఎం కార్యాలయ ఓఎస్డీగా పనిచేస్తున్నారు. ఆయనకు కేసీఆర్‌తో సాన్నిహిత్యం ఉన్నా సుదీర్ఘ కాలం తర్వాతే అవకాశం లభించింది. బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వా త ఆలంపూర్ మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌లో వెంకట్రామిరెడ్డిది తొలి చేరిక కాగా, నడిగడ్డ ప్రాంతంలో రాజకీయ ప్రాబల్యం కలిగిన నేతగా ఆయనకు పేరుంది. ఆలంపూర్, కొల్లాపూర్, గద్వాల నియోజకవర్గాలతో పాటు ఏపీలోని రాయలసీమ ప్రాంతంలో బీఆర్ఎస్ విస్తరణకు చల్లా సేవలను వినియోగించుకునే ఉద్దేశంతో ఆయన్ను ఎంపిక చేసినట్లు సమాచారం.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల నేపథ్యమిదీ..

దేశపతి శ్రీనివాస్: తెలంగాణ కవి, గాయకుడైన దేశపతి శ్రీనివాస్ 1970లో సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని మునిగడప గ్రామంలో దేశపతి గోపాలకృష్ణ శర్మ, బాలసరస్వతి దంపతులకు జన్మించారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం.. ఉద్యమ నాయకుడిగా నాడు కేసీఆర్ నిర్వహించిన వేలాది సభలు, సమావేశాలు, ర్యాలీలలో పాల్గొన్నారు. తన ఆట, పాటలు, ప్రసంగాలతో తెలంగాణ భావజాల వ్యాప్తికి కృషి చేశారు. రాష్ట్ర సాధన అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేశారు. ప్రస్తుతం సీఎం ఓఎస్డీగా పని చేస్తున్నారు.

కుర్మయ్యగారి నవీన్‌రావు: హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన కుర్మయ్యగారి నవీన్‌రావు..కొండల్‌రావు, తిలోత్తమ దంపతులకు 1978 మే 15న జన్మించారు. నవీన్‌రావు తాత రామచంద్రరావు గతంలో మంత్రిగా పనిచేశారు. మేనమామ సుదర్శన్ రావు టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. నవీన్‌రావుకు విద్యార్థి దశ నుంచే రాజకీయాలంటే ఆసక్తి. 2001 నాటి జలదృశ్యం ఆవిర్భావ సభ మొదలుకొని టీఆర్ఎస్ నిర్వహించిన అన్ని సమావేశాల్లో క్రియాశీలంగా పనిచేశారు. తొలిసారిగా 2019 మేలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

చల్లా వెంకట్రామిరెడ్డి: మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి మనవడు (కూతురి కొడుకు) అయిన చల్లా వెంకట్రామిరెడ్డి 1971లో నిర్మలమ్మ, రామ్‌భూపాల్ రెడ్డి దంపతులకు జన్మించారు. గుల్బర్గాలో బీటెక్ చదివిన ఈయన పుల్లూరు గ్రామ ప్రెసిడెంట్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. తర్వాత 2004 నుంచి 2009 వరకు అలంపూర్ ఎమ్మెల్యేగా పనిచేశారు. గత ఏడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళనలు వాయిదా

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ, ఇతర సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఆందోళన కార్యక్రమాలను ఈ నెల 10 వరకు వాయిదా వేస్తున్నట్టు తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ప్రారంభించాల్సిన రిలే దీక్షలను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. సోమవారం జరిగిన చర్చల్లో విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి, విద్యుత్ సంస్థల సీఎండీలు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. 10న మంత్రితో చర్చలకు ప్రభుత్వం ఆహ్వానించిందని తెలిపారు.

కొత్తగా 17 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం 3,929 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 17 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి 18 మంది కోలుకోగా, ఇప్పటివరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 132 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు.

రూ.10 వేలు కట్టలేనన్నా.. కనికరించలేదు

సైదాబాద్: ట్రాఫిక్ పోలీసుల 'చలాన్ల' వేధింపులు ఒక హమాలీ ప్రాణాన్ని బలితీసుకున్నాయి. కూలిపని చేసుకునే తాను చలాన్లు కట్టలేనని చెప్పినా ట్రాఫిక్ ఎస్ఐ కనికరించలేదని సీఎం కేసీఆర్, కేటీఆర్‌లకు తన బాధను వ్యక్తం చేస్తూ మృతుడు సూసైడ్ నోట్ రాశాడు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా నేరడిగొమ్ము గ్రామానికి చెందిన ఎ.ఎల్లయ్య (45) నగరానికి వలస వచ్చి ఐఎస్‌సదన్ డివిజన్ చింతల్‌బస్తీలో నివసిస్తున్నాడు. అతని భార్య సైదాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో స్వీపర్. వారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. హమాలీ పనిచేసే ఎల్లయ్య ద్విచక్రవాహనంపై మూడు చలాన్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఆదివారం రాత్రి భారత్‌గార్డెన్ వద్ద మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులు అతని వాహనాన్ని తనిఖీ చేసి పెండింగ్ చలాన్‌లు ఉన్నాయని వాహనాన్ని సీజ్ చేశారు. చలాన్‌లు చెల్లించాల్సిందేనని పోలీసులు తెలిపారు. డబ్బులు లేకపోవడంతో మనస్థాపం చెందిన ఎల్లయ్య సోమవారం రాత్రి ఇంట్లో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న సైదాబాద్ పోలీసులు అతడి మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్ట్‌మార్టం అనంతరం మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే మృతుడు రాసిన సూసైడ్ నోట్ సోషల్ మీడియాలో వైరలైంది. అందులో సీఎం కేసీఆర్, కేటీఆర్‌లకు తన బాధ తెలుపుతూ- 'మీర్‌చౌక్ పోలీసులు రూ.పది వేలు కడితేనే నా బండి ఇస్తామంటున్నారు. కూలిపని చేసుకునే వాడినని బతిమాలినా వినలేదు' అని ఎల్లయ్య సూసైడ్‌నోట్‌లో ఆవేదన వ్యక్తం చేశాడు. మీర్‌చౌక్ ట్రాఫిక్ ఎస్ఐ వేధింపులు తట్టుకోలేక చనిపోతున్నాని అందులో పేర్కొన్నాడు.

ఆమె రెక్కలు తెగివున్నాయి: ఎగరడం ఎలాగో తెలియదని ఆమెను నిందిస్తారు.

– సైమన్ ది బువా

సాక్షి

బుధవారం, మార్చి, 8

వలస జీవులపై వికృత క్రీడ

అసత్యాల కన్నా అర్ధసత్యాలు ఎక్కువ ప్రమాదం. ఎక్కడో జరిగినదాన్ని మరెక్కడో జరిగినట్టు చూపెట్టి, బోడిగుండుకూ మోకాలికీ ముడిపెట్టే ఫేక్ వీడియోల హవా పెరిగాక ఈ ప్రమాదం ఇంకెంతో పెరిగింది. ఉత్తరాది వలస కార్మికులపై తమిళనాట దాడులంటూ సోషల్ మీడియాలో తెగ తిరిగిన ఘటన, దానిపై బిహార్ సహా దేశవ్యాప్తంగా రేగిన రచ్చ అందుకు తాజా నిదర్శనం. తమిళనాడు ప్రభుత్వం, పోలీసులు వెంటనే రంగంలోకి దిగి, వేరెక్కడో జరిగిన ఘటనల దృశ్యాల్ని ఇప్పుడు ఇక్కడ జరిగినట్టు వీడియోల్లో చూపారని నిర్ధారించాల్సి వచ్చింది. బిహార్ సీఎం తొందరపాటుతో హడావిడిగా తమిళనాడుకొచ్చిన బిహార్ ప్రభుత్వాధికారులూ నిజం తెలుసుకొని, సంతృప్తి వ్యక్తం చేయాల్సి వచ్చింది. గతంలో మహారాష్ట్ర, ఢిల్లీల్లోనూ ఇలాంటి ఘటనలే జరిగాయి. మొత్తం మీద ఈ వ్యవహారం ఫేక్ న్యూస్‌ల ముప్పుతో పాటు వలసదారులనే గుర్తింపు తీరని కళంకంగా మారి, హింసా ద్వేషాలను ప్రేరేపిస్తున్న వికృత ధోరణిని చర్చకు పెట్టింది.

స్వరాష్ట్రం, వలసపోయిన రాష్ట్రం – రెండింటి ఆర్థికాభివృద్ధిలో అంతర్ రాష్ట్ర వలసలది కీలక పాత్ర. అయితే, దేశంలో వలసలపై ప్రభుత్వ గణాంకాలు సమగ్రంగా లేవు. పాత లెక్కలే ఇప్పటికీ ఆధారం. 2011 జనగణన ప్రకారం మన దేశంలోనే అంతర్గత వలసదార్ల సంఖ్య 45.36 కోట్లు. అంటే దేశ జనాభాలో 37 శాతం మంది. ఇక, 2016 – 17 నాటి ఆర్థిక సర్వే ప్రకారం స్వస్థలం వదిలిపోతున్న మొత్తం వలస శ్రామికుల్లో దాదాపు సగం మంది సాపేక్షంగా తక్కువ అభివృద్ధి చెందిన ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల జనాభాయే. ఈ అభాగ్య సోదరులను గోవా, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కేరళ, కర్ణాటకలు అధికంగా ఆదరిస్తున్నాయి. వెరసి, జీవనోపాధికై వస్తున్న ఉత్తరాది వారిని ఢిల్లీ తర్వాత ఎక్కువగా అక్కున చేర్చుకుంటున్నది దక్షిణ భారతావనే అనుకోవచ్చు.

పారిశ్రామిక కేంద్రంగా పేరున్న తమిళనాట 10 లక్షల మందికి పైగా వలస కార్మికులున్నారు. ఇది ఆ రాష్ట్ర కార్మిక విభాగం పక్షాన జరిపిన 2016 సర్వే లెక్క. అధికశాతం మంది బడుగు వేతన జీవులైన నైపుణ్యం లేని శ్రామికులు. ఎక్కువగా బెంగాల్, అస్సామ్, ఒడిశా, బిహార్, జార్ఖండ్‌ల నుంచి వచ్చినవారే. తిరుప్పూర్, ఈరోడ్ లాంటి వస్త్ర కేంద్రాల వృద్ధికి, రాష్ట్ర పురోగతికి వీరు వెన్నెముక. ఈ పరిస్థితుల్లో వలస కార్మికులపై తమిళనాట దాడులంటూ సంబంధం లేని పాత వీడియోలు సోషల్ మీడియాలో తిరగడం తాజా సమస్యకు కారణం. హిందీవారికి వ్యతిరేకంగా తమిళనాట ఏదో జరిగిపోతోందని నమ్మించడానికి ఒక వర్గం వీడియోలను ఆన్‌లైన్‌లో తెగతిప్పింది. దాంతో తమిళనాడు ఆ ఘటనలు వేరెక్కడివో, ఎవరెవరి మధ్య జరిగిన ఘటనల తాలూకువో వివరించాల్సి వచ్చింది. నిజం వెల్లడయ్యేలోగా కథ బిహార్ అసెంబ్లీకి ఎక్కింది.

నిజం కాళ్ళకు చెప్పులు తొడిగే లోపల అబద్ధం ఊరంతా చుట్టివస్తుందన్నట్టుగా అసత్యప్రచారం దేశం చుట్టింది. అయితే, బీజేపీయేతర పార్టీల ఏలుబడిలోని రాష్ట్రాల్లో ఈ తరహా వైరల్ ఫేక్ న్యూస్ వల్ల ఎవరికి, ఏ ప్రయోజనం ఉందనే అనుమానాలూ పైకి వచ్చాయి. సాక్షాత్తూ తమిళనాడు సీఎం సైతం ఘర్షణలు రేపి, తమ ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్రకోణం గురించి ప్రస్తావించడం గమనార్హం. వాస్తవానికి ఏ రాష్ట్రం, ఏ భాషకు చెందినవారినైనా స్థానికులుగా కలుపుకొనే ఆత్మీయ, ఆతిథేయ సంస్కృతి దక్షిణాదిన, అందులోనూ తమిళనాట తరతరాలుగా ఉన్నదే. శాంతిభద్రతల పరిరక్షణలో అక్కడి పోలీసు యంత్రాంగం పేరున్నదే. అక్కడే ఇలా జరిగిందంటే – ఇతర రాష్ట్రాలకిది మేలుకొలుపు. కొందరి తుంటరితనం, స్వార్థ రాజకీయాలు సోదర భారతీయుల మధ్య విభజన గీతలు గీస్తే అది పెను ప్రమాదం. ఐకమత్యం, సౌభ్రాతృత్వాలకు గొడ్డలిపెట్టయ్యే ఏ వికృత ధోరణినీ ఎవరూ సహించకూడదు. సహకరించకూడదు.

హోలీకని రద్దీ రైళ్ళలో స్వరాష్ట్రాలకు తరలివెళ్ళిన వలస కార్మికుల్లో ఎందరు తిరిగొస్తారనేది ఇప్పుడు తమిళనాట హోటళ్ళ నుంచి పరిశ్రమల వరకు అన్నిటి ఆందోళన. ఏ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలోనైనా అంతర్ రాష్ట్ర వలస కార్మికుల వాటా అవిస్మరణీయం. వారికి సౌకర్యాలు, సురక్షిత వాతావరణం కల్పించడం కీలకమంటున్నది అందుకే. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మూడు దశాబ్దాలకు కానీ పార్లమెంట్ 'అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం–1979' చేయలేదు. అయినా ఇప్పటికీ వారి పరిస్థితి పూర్తిగా మారలేదు. వారి స్థితిగతులపై విస్తృత సర్వేలు జరపాలి. కేరళ నమూనా సర్వేలు అందుకు ఆదర్శం. సర్వేల సమాచారంతో సొంత, వలస రాష్ట్రాల్లో మెరుగైన విధానాలు చేపట్టవచ్చు.

వలసదార్ల వల్ల స్థానికులకు ఉద్యోగాలు పోతున్నాయనీ, మురికివాడలు, నేరాలు పెరుగుతున్నాయనీ రాజకీయ స్వార్థంతో పేలడం తేలిక. ఇలా 'బయటివార'నే ముద్ర వేసి స్థానికుల్ని రెచ్చగొడితే, తాత్కాలిక లబ్ధి ఉంటుందేమో కానీ, శాశ్వత నష్టం తథ్యం. భారత పౌరులెవరైనా దేశ భూభాగంలో ఎక్కడికైనా ఉపాధికై స్వేచ్ఛగా వెళ్ళవచ్చు, స్థిరపడవచ్చునేది మన రాజ్యాంగం (ఆర్టికల్ 19) కల్పించిన ప్రాథమిక హక్కు. కానీ, కరోనా వేళ 'ఇన్‌ఫెక్షన్ వాహకులు' అంటూ కన్న ప్రాంతం, ఉన్న ఊరు వలస కార్మికుల్ని 'అవాంఛనీయులు'గా చూశారు. వారిపై దాడులూ అనేకసార్లు రికార్డులకెక్కవు. ఈ పరిస్థితుల్లో వలసదార్లు సైతం స్థానికులతో ఏకమయ్యేలా తగిన చర్యలు చేపట్టడం ప్రభుత్వ విధి. అలాగే, సామాజిక న్యాయం, మానవ హక్కులను పరిగణనలోకి తీసుకొని కీలకమైన ఈ శ్రామిక పెట్టుబడిని కాపాడుకొనేలా సమగ్ర, వ్యవస్థీకృత విధానం అవసరం. అప్పుడే తమిళనాట తలెత్తిన తాజా ఫేక్ న్యూస్ రచ్చ లాంటివి నిర్వీర్యమవుతాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.7.12 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తర రా.3.55 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** ఉ.9.54 నుండి 11.37 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.46 నుండి12.33 వరకు, **అమృతఘడియలు:** రా.8.10 నుండి 9.55 వరకు.

సూర్యోదయం : 6.18
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

నాయకత్వ నిర్వచనం మారాలి!

భౌతిక దారుఢ్యం, ఆచరణాత్మకంగా ఉండటం వంటి వాటిని నాయకత్వ లక్షణాలుగా చూడడం వల్ల అనాదిగా పురుషులే నాయకత్వ స్థానాలలో కనిపిస్తున్నారు. కానీ మహిళలు నాయకత్వ బృందాలలో ఉన్నప్పుడు కరుణ వంటి లక్షణాలు కూడా ముఖ్యం అవుతున్నాయి. మహిళా నాయకత్వానికీ, సామాజిక సంక్షేమానికీ మధ్య ధనాత్మక సంబంధాన్ని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. 21వ శతాబ్దపు ఒక క్లిష్టమైన పోరాటం అందుబాటులో ఉన్న వనరులకూ, మానవ వైఖరులకూ మధ్య జరుగుతుంది. దీన్ని ఎదుర్కొనేందుకు బహుముఖ నాయకత్వం అవసరం. మెరుగైన సమాజం నిర్మించడం కోసం మహిళల విభిన్న అనుభవాలు, నైపుణ్యాలు ఎంతో అవసరం.

ఏది నాయకి?

సందర్భం



గణపతిరాజు పావనీ దేవి

2030 నాటికి ప్రపంచం సాధించాల్సిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో లింగ సమానత్వాన్ని ఐదో లక్ష్యంగా నిర్ణయించి, దీన్ని సాధించడంలో మహిళల సమాన భాగస్వామ్య అవసరాన్ని ఐకరాజ్య సమితి నొక్కి చెప్పింది. కానీ వాస్తవాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉండి, లింగ సమానత్వ లక్ష్యాన్ని ఎప్పటికి సాధించగలమనే ప్రశ్నను రేకెత్తిస్తునాయి.

ప్రపంచవ్యాప్తంగా నిర్ణయాలు తీసుకొనే అనేక స్థానాలలో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. 1 సెప్టెంబర్ 2021 నాటికి కేవలం 24 దేశాలలో మాత్రమే మహిళలు దేశ, ప్రభుత్వ అధిపతులుగా ఉన్నారు. దీని ప్రకారం, అత్యున్నత అధికార స్థానాల్లో లింగ సమానత్వం మరో 130 సంవత్సరాల వరకు కూడా సాధించలేము. ప్రపంచంలోని మూడు వంతుల పార్లమెంటరీ స్థానాలను పురుషులు కలిగి ఉండటం రాజకీయాల్లో పురుషుల ఆధిపత్యాన్ని సూచిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా మంత్రులుగా 21 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. మహిళా వ్యవహారాల శాఖలకే సాధారణంగా మహిళలు పరిమితం కావాల్సి వస్తోంది.

మహిళా నాయకత్వానికీ, సామాజిక సంక్షేమానికీ మధ్య ధనాత్మక సంబంధాన్ని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. భారత్‌లో మహిళల నేతృత్వంలో ఉన్న పంచాయతీ ప్రాంతాల్లో తాగు నీటి ప్రాజెక్టుల సంఖ్య పురుషుల నేతృత్వంలోని పంచాయితీల కంటే 62 శాతం అధికంగా ఉన్నదనీ, మున్సిపల్ కౌన్సిళ్లలో మహిళల ప్రాతినిధ్యానికీ, పిల్లల సంరక్షణకీ మధ్య ప్రత్యక్ష సంబంధం ఉన్నదనీ సర్వేలు చెపుతున్నాయి.

21వ శతాబ్దపు ఒక క్లిష్టమైన పోరాటం అందుబాటులో ఉన్న వనరులకూ, మానవ వైఖరులకూ మధ్య జరుగుతుంది. వాతావరణ మార్పు, ఆరోగ్యం, పర్యావరణ క్షీణత, సామాజిక అసమానతలు మొదలైన సమస్యలను ఎదుర్కొనేందుకు బహుముఖ నాయకత్వం అవసరం. మెరుగైన సమాజం నిర్మించడం కోసం తీసుకొనే నిర్ణయాలలో మహిళల విభిన్న అనుభవాలు, నైపుణ్యాలు ఎంతో అవసరం.

మహిళలకు సాధికారత చేకూర్చడానికి లింగ బడ్జెట్‌ను చాలా దేశాలు ఒక మార్గంగా ఎన్నుకున్నాయి. ఐఎంఎఫ్ ప్రకారం, ప్రపంచంలో 80 దేశాలు లింగ బడ్జెట్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. భారతదేశం కూడా 2006 నుండి లింగ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మన లింగ బడ్జెట్‌లో సాధారణంగా రెండు రకాల పథకాలు గమనించవచ్చు. మొదటిది, మహిళలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని ఖర్చు చేసే పథకాలు: ఉదాహరణకు బేటీ బచావో, బేటీ పఢావో. రెండవది పాక్షికంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ప్రవేశపెట్టినవి. ఇక్కడ పథక ప్రయోజనాలు కనీసం 30 శాతం మహిళలకు చేకూరుతాయి. అయితే రెండో కోవకు చెందిన పథకాలే ఆధిపత్యంలో ఉంటున్నాయి. ఉదాహరణకు 2021 బడ్జెట్‌లో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ బడ్జెట్ 16 శాతం పెరిగింది. కానీ ఈ మొత్తం బడ్జెట్‌లో 80 శాతం అంగన్‌వాడీ, మిషన్ పోషణ్ 2.0 పథకాలకు కేటాయించడం జరిగింది.

సమాన అవకాశాలను కల్పించగలిగే ప్రగతిశీల సమాజాన్ని నిర్మించడానికి నిర్ణయాత్మక స్థానాలలో మహిళల పాత్ర, ప్రాముఖ్యతలను గుర్తించడం కీలకం. మార్పు అనేది దానికదే స్వతంత్రంగా రాదు. సమాజంలో సమానత్వం సృష్టించే సద్గుణ చక్రాన్ని సాధించడానికి వ్యవస్థలు మారాలి.

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఇప్పటివరకు ఈ ప్రపంచం ప్రధానంగా పురుషుల ఆలోచనలు, నాయకత్వంలో నడుస్తోంది. చారిత్రకంగా భౌతిక దారుఢ్యం, హేతుబద్ధత, ఆచరణాత్మకంగా ఉండడం వంటి వాటిని నాయకత్వ లక్షణాలుగా చూడడం వల్ల అనాదిగా పురుషులే నాయకత్వం స్థానాలలో కనిపిస్తున్నారు. నాయకత్వ నిర్వచనాన్ని మరింత బహుమితీయంగా మార్చి, నాయకత్వ లక్షణాలను విస్తృతం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. మారుతున్న ఆర్థిక కార్యకలాపాలు, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి శారీరక బలాల మీద కాకుండా నైపుణ్యాలపై ఆధారపడి ఉంది. సహజంగా మహిళలు వ్యూహాత్మక దృష్టితో ఆలోచించే విధానం సమాజ నిర్మాణం కోసం ఉపయోగపడుతుంది. మహిళలు నాయకత్వ బృందాలలో ఉన్నప్పుడు కరుణ వంటి లక్షణాలు నాయకత్వంలో భాగం అవుతున్నాయి.

వ్యాసకర్త ఆర్థిక శాస్త్ర లెక్చరర్

పితృస్వామ్యమే ముద్దాయి

స్త్రీ అనగానే కేవలం సౌందర్య భావనతో ప్రాచీన కవులు ఎన్నో కావ్యాలలో రకరకాలుగా వర్ణించారు. మహిళ అనే పదం ఈ మహిలో చాలా గొప్పది. ఒక మహిళను చూసే కళ్ళలో, మనసులో మార్పు వచ్చి తీరాలి. తనకు జన్మ నిచ్చిన స్త్రీ జాతిని గౌరవించకపోగా రకరకాలుగా అవమానించడం అమానుషం. క్షమించరాని నేరం. స్త్రీల దైన్యస్థితికి అతి ముఖ్యమైన కారణం పితృస్వామ్య వ్యవస్థ. నిజానికి ఆదిమ సమాజంలో మాతృస్వామ్యం ఉండేది. స్త్రీ కేంద్రంగా సమాజం నడిచేది. కాలక్రమంలో స్త్రీలు ఉత్పత్తి పరికరాలకు దూరమవడం, పురుషులు వాటిపై ఆధిపత్యం చలాయించడం, బానిస వ్యవస్థ, గుంపు పెళ్లి నుండి దంపతీ వివాహానికి వివాహ వ్యవస్థ పరిణామం చెందడం, వ్యక్తిగత ఆస్తి భావన పెరగడం, ఆయుధాల మీద పురుషుల ఆధిపత్యం వంటి అనేక కారణాల వల్ల స్త్రీ వెనక్కి నెట్టివేతకు గురై క్రమంగా పురుషాధిక్యత పాదుకు పోయింది.

సందర్భం



స్వప్న కొండ

ఈ సంవత్సరం 'ఆవిష్కరణ, సాంకేతికతల్లో లింగ సమానత్వం' అంశాన్ని థీమ్‌గా మహిళా దినోత్సవాన్ని జరుపుతున్నారు. ఇది ఆహ్వానించదగినది. ఎందుకంటే... 'ఐకాస', 'ఉమెన్స్ జెండర్స్ స్నాప్ షాట్– 2022' నివేదిక ప్రకారం డిజిటల్ ప్రపంచంలో మహిళలు లేకపోవడం వల్ల గత పదేళ్లలో తక్కువ, మధ్య ఆదాయ దేశాల స్థూల జాతీయ ఉత్పత్తి తగ్గింది. ఈ విషయంలో ఏమీ చేయలేక పోయినట్లయితే ఈ నష్టం 2025 నాటికి ఇంకా పెరుగుతుంది. స్త్రీలు విద్యావంతులు కానంత వరకూ ఏ దేశమూ బాగుపడదు. మన అభివృద్ధి అంతా స్త్రీల అభివృద్ధిపైనే ఆధారపడి ఉన్నది. అయితే పురుషులతో సమానంగా ఉద్యోగం చేస్తున్నా... భారతీయ సమాజంలో ఇంటి పని, వంట పని, పిల్లల పెంపకం స్త్రీ బాధ్యత కాబట్టి ఆమెపై ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ అన్ని విధులనూ మహిళ అత్యంత చాకచక్యంగా నిర్వర్తిస్తోంది.

వ్యాసకర్త తెలుగు ఉపాధ్యాయురాలు

అపర కాళీమాత కూడా...

స్త్రీ ప్రకృతికి ప్రతీక. అందానికే నిర్వచనం. ఇంటికి దీపం. అమృతాన్ని వర్షించే అమ్మగా, అనునయించే అక్కగా, అనురాగాన్ని పంచే చెల్లిగా, ఆత్మీయతను కురిపించే భార్యగా ఆమె ఒక కుటుంబానికి ఎంత సుపరిచితురాలో... ఒక టీచరుగా, డాక్టరుగా, పోలీస్ ఆఫీసరుగా, పైలెట్‌గా, రైతుగా, కూలీగా, ఇంటిపనులు చేసే మనిషిగా... ఇలా అన్ని హోదాలలో కూడా సమాజానికి అంతే సుపరిచితురాలు. భారతీయ సంస్కృతిలో స్త్రీలకు సముచిత స్థానాన్నే అందించారు. మనం నిత్యం ఆరాధించే ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి స్వరూపాలైన అమ్మవార్లు కూడా స్త్రీలే కదా. స్త్రీని ఒక దేవతలా చూడడం, ఆమెను జాగ్రత్తగా కాపాడుకోవడం అనేది అనాదిగా మన రక్తంలోనే జీర్ణించుకుపోయింది.

అయితే నేడు ఈ జాగ్రత్తనే కొన్ని సందర్భాలలో అతియై ఆడపిల్లల స్వేచ్ఛకు ఆటంకంగా మారుతోంది. సమాజంలోని కొన్ని దుస్సంఘటనలకు వెరసి ఇంట్లోవాళ్ళు విధించే ఆంక్షలు ఆడపిల్లల అభివృద్ధికి అవరోధాలుగా పరిణమించడంతో పాటు, పిల్లలకూ తల్లిదండ్రులకూ మధ్య అగాధాలను సృష్టిస్తున్నాయి.

ప్రతి పరిణామం ఇంటి నుండే మొదలవ్వాలి. ఆది గురువులై అమ్మలు మంచి చెడుల వివేచన జ్ఞానాన్ని తమ పిల్లలకు రంగరించి ఎటువంటి ఆటుపోట్లనైనా ఎదుర్కొనే ధైర్యాన్ని అలవరచాలి. భర్త అడుగుజాడల్లో నడిచిన సీతగా, అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన సావిత్రిగా, యుద్ధభూమిలో తోడు నిలిచిన సత్యభామగా, బుద్ధి కుశలతతో త్రిమూర్తులనే పసిబిడ్డలను చేసి లాలించిన అనసూయగా ఉంటూనే, అవసరమైతే ఇంతులు అపర కాళీ మాతలవ్వాలి. సమాజాభివృద్ధికి హేతువయ్యే ప్రతి పాత్రను సంపూర్ణంగా పండించాలి.

– డా॥ బి. నీలిమా కృష్ణమూర్తి
సహాయ కార్మిక అధికారి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎలా ఉండాలింక?



నటి సుస్మితా సేన్ యోగా ఫిట్‌నెస్ ఛాలెంజ్ ఫొటోలు ఇంకా నా కళ్లముందున్నాయి. అలాంటి ఆమెకు 47 ఏళ్ల వయసులో 95 శాతం బ్లాకేజ్‌తో తీవ్ర గుండెనొప్పి రావడం! ఇక ఆరోగ్యకరమైన జీవన విధానం అంటే ఏమిటి మరి?

– నీతూ గార్గ్, ఎంఎన్‌సీ మేనేజర్

చిన్నతనపు కల



స్కూల్లో ప్రతి ఆటనూ ఆడేదాన్ని, 'జెంటిల్‌మన్స్ గేమ్' (క్రికెట్) తప్ప. తర్వాత పదకొండు మందిని పోగేసి జట్టు కట్టడం నుంచి, 'డబ్ల్యూపీఎల్' చూసేదాకా రావడం నా వ్యక్తిగత విజయంలా అనిపిస్తోంది. నా చిన్నతనపు కలను నిజం చేసుకునేలా వచ్చే ఏడాది సెలక్షన్స్ కోసం ప్రయత్నిస్తాను, నాకు మాటింగులు లేకపోతే!

– సయామీ ఖేర్, నటి

వైఫల్య విధానం



స్వీడన్ కోవిడ్ విధానం నిజంగా విజయవంతం ఏమీ కాలేదు. చరిత్రను తిరగరాయడానికి ప్రయత్నించవచ్చు, కానీ వాస్తవాలు మారిపోవు. ఇతర 'నార్డిక్' దేశాలతో పోల్చితే స్వీడన్‌లో మొత్తం మరణాలు 1.5 – 2 రెట్లు ఎక్కువ.

– దీప్తి గురుదాసానీ, పరిశోధకురాలు

ప్రకృతే చికిత్స



ఏ థెరపీ కన్నా ప్రకృతి చవక. అందుకే వైఫై బలహీనంగా ఉన్నచోటుల్లో సంచరిద్దాం. హైకింగ్ బూట్లలో జీవితం బాగుంటుందని అనడానికి నేనే రుజువు.

– సెలీనా జైట్లీ, నటి

అదే ఆకాంక్ష



ప్రతీ నవ్వు వెనుకా, ఒక కఠినమైన బాల్యం ఉంటుంది. కానీ ఆశతో ఒక నమ్మకమైన భవిష్యత్తు ఇవ్వగలం. బాలికలు అందరూ చదవాలి.

– పూజ శాలి, న్యూస్ యాంకర్

ఇదే మహిళా సాధికారత!

సందర్భం



పోతుల సునీత

'మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదు. ఏ పక్షి అయినా ఒక రెక్కతో ఎగరలేదు' అని స్వామి వివేకానంద అన్నారు. ఆ ఒక రెక్కలా తాను ఉన్నానని మన జగన్ అన్న భరోసా ఇచ్చి... మన రాష్ట్రంలో మహిళా సాధికారత ఆచరణలో సాధించి చూపిస్తున్నారు. 'ఆమె' ఒక తల్లి, కూతురు, సోదరి, భార్య. వీటన్నింటికీ మించి ఒక పోరాట యోధురాలు. శక్తి యుక్తులు కలిగిన నారీమణి. అతని వెంట ఆమె కాదు... అన్నింటా ఆమే. అదే ఇప్పుడు ఆమె లక్ష్యం. ఆమె ఆకాశంలో సగం కాదు. ఇప్పుడు ఆమే ఆకాశం. ప్రపంచ చరిత్రలోనే మహిళా సాధికారతను ఆచరణలో చూపించిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్.

జగనన్న కాలనీల్లో పంపిణీ చేసిన 30 లక్షల 76 వేల ఇళ్ల పట్టాలు మహిళల పేరుపైనే అందించి భరోసా అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్. అక్క చెల్లెమ్మల పేరు మీదనే స్థలమిచ్చి, ఇళ్లు కట్టించి లక్షలాది రూపాయల స్థిరాస్తి అందించారు. అక్క చెల్లెమ్మలకు పథకాలలో లబ్ధి చేకూర్చడమే కాకుండా వారికి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా కూడా ప్రాధాన్యత పెంచి మహిళా సాధికారతకు మరో పేరుగా నిలిచారు. 1993 నుంచి చట్టసభల్లో మహిళా రిజర్వేషన్‌కు పార్లమెంటులో బిల్లులు పెడుతూనే ఉన్నారు. కానీ ఆమోదం మాత్రం పొందడం లేదు. అయితే ప్రజాపాలనా వ్యవస్థలో సగం కంటే ఎక్కువ శాతం పదవులిచ్చిన తొలి ప్రభుత్వం వైసీపీదే. 1,356 పదవుల్లో 51 శాతం మహిళలకే ఇచ్చారు. 75 మున్సిపాలిటీల్లో 73 చోట్ల వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తే అందులో 45 మంది అంటే 64 శాతం మంది మహిళలే ఛైర్మన్లుగా ఎంపికయ్యారు. 2123 మంది వార్డు మెంబర్లలో 1,161 మంది అంటే 55 శాతం మంది మహిళలు ఉన్నారు. అమ్మ ఒడి నుంచి డ్వాక్రా సున్నావడ్డీ దాకా పలు పథకాల్లో మహిళలకే పెద్ద ఎత్తున లబ్ధి కలుగచేశారు. వివిధ పథకాల ద్వారా మహిళలకు సుమారు లక్షా ఇరవై ఐదు వేల కోట్ల రూపాయలకు పైగా అందజేశారు.

మహిళలపై అత్యాచారాలకు శిక్ష ఒక్కటి మాత్రమే కాకుండా చట్టాల్లో మార్పు చేసి, వాటి మూలాలపై కూడా గురి పెడితే గానీ మార్పు సాధ్యం కాదు. మహిళలపై దాడులు జరిగినప్పుడు రాత్రుళ్ళు బయటకు ఎందుకు వచ్చారనీ, వస్త్రధారణ సరిగా లేనందువల్లనే అలా జరిగిందనే వ్యాఖ్యలతో వారిని కించపరచరాదు. ఇలాంటి పరిస్థితుల్లో మార్పు కోసమే... మహిళల భద్రత కోసం రూపొందించిన 'దిశ' చట్టం దేశ చరిత్రలోనే ఒక ఉజ్వల ఘట్టం. మహిళలకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్ల వల్ల తమకు ఏదైనా అన్యాయం జరిగితే ధైర్యంగా ఫిర్యాదు చేయగలుగుతున్నారు. మహిళల్లో ఇప్పుడున్న చైతన్యం, బతుకు పట్ల భరోసా చూస్తే మహాకవి గురజాడ అప్పారావు అన్నట్లు ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాసే సమయం వచ్చినట్లే అనిపిస్తోంది.

వ్యాసకర్త ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు

సమానత్వం కోసం సంఘర్షించిన మహిళ

సందర్భం



డాక్టర్ దేవరాజు మహారాజు

ప్రుడెన్సియా అయాల (1885–1936)... ఎల్ సాల్వడార్ కవయిత్రి, వ్యాసకర్త, స్త్రీ హక్కుల కార్యకర్త. 20వ శతాబ్దపు ప్రారంభంలో తన రచనలతో ప్రపంచాన్ని ఆకట్టుకున్న మహిళ. ఎల్ సాల్వడార్‌లో స్త్రీలకు ఓటు హక్కు కూడా లేని రోజుల్లో దేశాధ్యక్ష స్థానానికి మొదటిసారి పోటీలో నిలిచిన ధీర వనిత. అలాంటి సమాజం ఆమెను ఎలాగూ గెలవనివ్వదు. కానీ, ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది ఏమంటే, అంతటి ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఆమె ప్రదర్శించిన గుండె ధైర్యం, తెగువ. ఆ దేశపు సుప్రీం కోర్టు ఆమె నామినేషన్‌ను అప్పుడు కొట్టేసింది. అయితే, ఆమె మరణం (1936) తర్వాత చాలా కాలానికి ఆ దేశ రాజ్యాంగ సవరణ ప్రకారం 1950లో మహిళలకు అక్కడ ఓటు హక్కు లభించింది.

ఎల్ సాల్వడార్ మధ్య అమెరికాలో ఒక దేశం. ప్రస్తుత జనాభా 68 లక్షలు. ఎక్కువ శాతం మంది స్పానిష్ మాట్లాడుతారు. ప్రుడెన్సియా అయాల మహిళా సాధికారత కోసం ఉద్యమించడమే కాదు, జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై కూడా స్పందిస్తూ వచ్చారు. అమెరికా నియంతృత్వ ధోరణితో – వారి దేశం మీద సైనిక చర్య చేపట్టడాన్ని ఆమె తీవ్రంగా నిరసించారు. పరిపాలనలో పారదర్శకత ఉండాలనీ, ప్రజలకు మత స్వేచ్ఛ ఉండాలనీ, మద్యం అమ్మకాలు నియంత్రించాలనీ, హక్కులు స్త్రీలతోపాటు పిల్లలకు కూడా ఉండాలనీ ఆమె ఉద్యమాలు సాగించారు. ఫలితంగా అనేక సార్లు ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

పెళ్లి కాని జంటలకు పుట్టిన పిల్లలకు కూడా హక్కులు వర్తింప జేయాలని ఆమె డిమాండ్ చేశారు. అక్రమ సంబంధంతో పిల్లల్ని కన్న వారికి శిక్ష విధించవచ్చుగానీ, ఏమీ తెలియని పిల్లలు ఎందుకు బలి కావాలి? అన్నది ఆమె వాదన. పుట్టారంటే వారికి బాలల హక్కులు, ఆ తర్వాత మానవ హక్కులు వర్తించవల్సిందే అన్నది ఆమె ఉద్దేశం.

ప్రుడెన్సియా అయాల లింగ సమానత్వం ఎందుకు కావాలన్నారో దానికి తగిన వివరణ కూడా ఇచ్చారు – ''స్త్రీ–పురుషుడు ఉంటేనే ఇల్లు. స్త్రీ–పురుషుడు ఉంటేనే ఇంట్లో ఇంద్రధనుస్సులు. స్త్రీ– పురుషుడు ఉంటేనే సమాజం. స్త్రీ–పురుషుడు ఉంటేనే రాబోయే తరాలు. స్త్రీ–పురుషుడు అంటేనే జీవన సౌందర్యం! స్త్రీ–పురుషుడు ఉంటేనే అర్థం –పరమార్థం. పౌరసత్వం అనేది ఇద్దరికీ సమానమే. ఓటు హక్కుతో పాటు ఇతర హక్కులూ, బాధ్యతలూ ఇద్దరికీ సమానమే. సమాజంలో సమ భాగస్వాములైన స్త్రీలను తక్కువగా చూడటం, సౌకర్యాలు కల్పించక పోవడం, విద్యనందించక పోవడం హేయమైన చర్య. సత్వరం దాన్ని సరిచేసుకోవాలి'' అని ఆమె జీవితాంతం ఆవేదన చెందారు. ఆక్రోశించారు. చివరికి ఆమె మరణం తర్వాత చాలా కాలానికి ఆమె కృషి ఫలితంగానే మార్పులు జరుగుతూ వచ్చాయి.

పురుష అహంకారాన్ని ధిక్కరిస్తూ హక్కుల కోసం పోరాడుతున్న ప్రుడెన్సియా అయాల గురించి ఆ దేశపు జర్నలిస్ట్ అయిన అల్బర్టో మాస్ ఫెర్రర్ – ఆ రోజుల్లో ఇలా రాశాడు.

''ప్రుడెన్సియా అయాల పోరాటంలో న్యాయం ఉంది. ఆమె కేవలం స్త్రీ అయినందుకే ఆమెను రాజకీయాల్లోకి రాకూడదనడం, ఎన్నికల్లో



ప్రుడెన్సియా అయాల

నిలబడగూడదనడం అన్యాయం. స్త్రీలను చులకనగా చూడకూడదని ఆమె గొంతెత్తి ఆక్రోశించడంలో నిజాయితీ ఉంది. విశ్వజనీనమైన ఆమె వాదనను ఆలకించాల్సిందే. శ్రద్ధ వహించాల్సిందే. ఒక మహోన్నతమైన ఆశయం కోసం ఆమె సమిధ కావడానికి సిద్ధపడ్డారు. ఇక, ఈ దేశంలో లింగ అసమానత్వం ఇంకా ఎంతో కాలం నిలవదు''!

హక్కుల కోసం నిరంతరం పోరాడిన ధీర వనితగా ప్రపంచం గుర్తించిన తర్వాత, ఆమె మరణానంతరం వారి దేశం ప్రుడెన్సియా అయాలకు దేశపు అత్యున్నత గౌరవం 'ఆర్డర్ ఆఫ్ జోస్ మాటియాస్ డెల్ గాడో' 2014లో ప్రకటించింది.

ప్రుడెన్సియా అయాల వంటి వారి జీవితాలు మనకు తెలిశాయి కనుక, ప్రపంచ దేశాలన్నింటిలో స్త్రీల పరిస్థితి ఒకే విధంగా ఉందని తెలుస్తోంది. ప్రపంచపు పనిలో మూడింట రెండు వంతులు పనిచేసి, పదింట ఒక వంతు మాత్రమే సంపాదించుకుని – నూటికి ఒక వంతు ఆస్తి కూడా సమకూర్చుకోలేని అభాగ్యుల మీద, అర్ధ జనాభా అయిన స్త్రీల మీద చరిత్రలో మొట్టమొదటిసారి ప్రపంచం దృష్టి పడింది. అప్పటి నుంచే చరిత్ర తప్పిదాన్ని సరిచేయడానికి తగిన కృషి ప్రారంభమైంది.

తల్లిగా, భార్యగా స్త్రీ నిర్వహించే పాత్ర అద్వితీయమైంది. ఆమె కాలాన్ని, శక్తిని, ఆలోచనల్ని అన్నింటినీ ఇంటి పని మింగేస్తుంది. ఆ పని ఎంత విలువైందో, అంత 'విలువ' లేనిది! అంటే ఎంత పని చేసినా ఆమెకు ఒక రూపాయి ఆదాయంగానీ, కనీస గుర్తింపుగానీ దొరకవు. ప్రపంచ దేశాలన్నింటా పరిస్థితి ఇదే. ఇంటి పని పోను, బయట పని అదనం. అంటే ఒక రోజులో స్త్రీలు రెండు రోజుల పని చేస్తున్నారన్న మాట. నిన్న మొన్నటి దాకా ఉద్యోగాల్లో కూడా ఈ తేడా ఉండేది. చేస్తున్న ఉద్యోగం ఒకటే అయినా, స్త్రీల వేతనం పురుషుల వేతనం కంటే తక్కువగా ఉండేది. 1975–80 ప్రాంతాల్లో ఈ తేడా సవరించబడింది.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవ శాస్త్రవేత్త

క్లుప్తంగా...

మూగజీవాల మృత్యువాత



మృతిచెందిన గోవులు

పాల్వంచ: అక్రమంగా రెండు డీసీఎం వ్యాన్లలో 110 పశువులను తరలిస్తుండగా.. ఆ తొక్కిసలాటలో 10 గోవులు మృతిచెందాయి. మరో పది పశువుల పరిస్థితి విషమంగా ఉంది. ఇచ్ఛాపురం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న గోవులను ఖమ్మం జిల్లా కల్లూరు వద్ద సోమవారం రాత్రి పోలీసులు పట్టుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని అన్నపూర్ణ గోశాలకు తరలించారు. ఒక్కో వ్యాన్‌లో 50కి పైగా పశువులను ఎక్కించడంతో అప్పటికే వాటి మధ్య జరిగిన తొక్కిసలాటలో 11 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. మరో పది పశువుల పరిస్థితి విషమంగా ఉండటంతో గోశాల నిర్వాహకుడు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది చికిత్స చేస్తున్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు



అపస్మారక స్థితిలో సాయిసందీప్

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం మగ్గిడి గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి బేర సాయిసందీప్‌ను ఉపాధ్యాయుడు సురేష్ తీవ్రంగా కొట్టారు. దెబ్బలకు తాళలేక విద్యార్థి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్కూల్లో బుధవారం నిర్వహించే ఓ సమావేశం కోసం సందీప్ స్నేహితులతో కలిసి రిహార్సల్స్ చేసి తర్వాత తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. ఇంతలో పీఈటీ సురేష్.. విద్యార్థి సందీప్ వద్దకు వచ్చి చితకబాదారు. తాను ఏ తప్పూ చేయకున్నా ఎందుకు కొడుతున్నారని వేడుకున్నా వదల్లేదు. కొద్ది సేపటికి సందీప్ అపస్మారకస్థితికి చేరుకోవడంతో ఆందోళన చెందిన పీఈటీ.. 'మీ అబ్బాయికి ఫిట్స్ వచ్చిందని, త్వరగా రావాలని తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. స్కూలుకి చేరుకున్న తల్లిదండ్రులు వెంటనే సాయిసందీప్‌ని ధర్మపురిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెబుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ రాజమణిని సంప్రదిస్తే.. ఏదో పెన్‌డ్రైవ్ విషయమై పీఈటీ నరేశ్ విద్యార్థిని కొట్టాడనే సంగతి ఇప్పుడే తెలిసిందన్నారు. పూర్తివివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలని కోరుతూ తల్లిదండ్రులు శిరీష- సత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయిసందీప్‌ను డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు.


ఆర్టీసీ ఉద్యోగినుల సెలవులు పెంచండి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగినుల వ్యక్తిగత, శారీరక ఇబ్బందుల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం వారికి గతంలో 5 సాధారణ సెలవులను అదనంగా ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ఆర్టీసీలో అమలు చేయాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు కోరారు. మహిళా దినోత్సవం నేపథ్యంలో మహిళా కండక్టర్ల సెలవులను 18 నుంచి 23కు, మహిళా ఉద్యోగులకు 15 నుంచి 20కి పెంచాలని కోరారు.

పోరాట యోధులకు నారీశక్తి పురస్కారాలు: ఝాన్సీ

సాక్షి, హైదరాబాద్: ఈఏడాది భారత్‌లో 'డిజిటల్: ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ' పేరిట మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ తెలిపారు. బుధవారం వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో మహిళా సాధికారత, లింగ సమానత్వంలో సాధించిన విజయాల కోసం పోరాడిన మహిళలకు నారీశక్తి పురస్కారాలు అందజేస్తారని తెలిపారు.

విలేజ్ వనిత ఘనత



- మోడల్ ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటుతో ఆదాయార్జన
- బేకరీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో కుటుంబానికి ఆసరా..
- ఇతరులకు సైతం ఉపాధి
- ధాన్యం సేకరణతోనూ ఆర్థిక సాధికారత
- శిక్షణ ఇస్తూ సహకరిస్తున్న 'సెర్ప్'

నాడు వ్యవసాయ కూలీ..

◆ మంచిర్యాల జిల్లా భీమారానికి చెందిన పండ్ల శ్రీలత స్కూల్ స్థాయిలోనే చదువు మానేశారు. వ్యవసాయ కూలీగా పనిచేసిన ఆమె.. శ్రీరామ విలేజ్ ఆర్గనైజేషన్‌లోని ఝాన్సీ ఎస్‌హెచ్‌జీలో సభ్యురాలు. ప్రస్తుతం భీమారంలోనే ఆదివాసీ విస్తరాకుల తయారీ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా.. బ్యాంకులు, ఇతర రూపాల్లో అందిన రుణాలతో మోదుగ, అడ్డాకులతో పర్యావరణహిత టేబుల్ ప్లేట్లు, బఫె ప్లేట్లు, టిఫిన్ ప్లేట్లు, దొప్పలు తయారీకి సంబంధించి సొంత మెషిన్లను ఏర్పాటు చేసుకున్నారు. శ్రీలత, ఆమె భర్త, పిల్లలు ఈ యూనిట్‌లోనే పనిచేస్తున్నారు. మరో ఇద్దరు పనివాళ్లను కూడా పెట్టుకున్నారు. తాము ఆదాయం పొందుతూ ఇతరులకు ఉపాధి కల్పించడంతో పాటు బ్యాంకు రుణం కూడా తీరుస్తున్నారు.





బిస్కెట్ల యూనిట్‌తో భరోసా..

◆ వికారాబాద్ జిల్లా యాలాల మండలానికి చెందిన కొడంగల్ హాజీరా బేగం గతంలోనే మహబూబ్ సుభానీ ఎస్‌హెచ్‌జీలో చేరారు. తర్వాత బిస్కెట్ల తయారీ, మార్కెటింగ్ యూనిట్ వైపు మళ్లారు. బ్యాంకులు, స్త్రీనిధి, ఇతర రూపాల్లో ఆర్థిక సహకారం అందడంతో బేకరీ ఉత్పత్తులతో పాటు పలురకాల తినుబండారాలు తయారు చేస్తూ తమ వ్యాపారాన్ని విస్తరింపజేశారు. వివిధ రకాల బిస్కెట్లు, బ్రెడ్లు, బన్ను, టోస్టులు, ఎగ్, కర్రీ పఫ్‌లు విక్రయిస్తున్నారు. కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు ఈ వ్యాపారంలో నిమగ్నం కావడంతో పాటు మరో ఐదుగురు పనివారికి ఉపాధి కల్పిస్తున్నారు. కేంద్ర మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సర్టిఫికెట్, ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ పొందారు. ప్రస్తుతం ఈ కుటుంబానికి అన్ని ఖర్చులు పోను నెలకు రూ.50 వేల దాకా ఆదాయం మిగులుతోంది.

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ మహిళలు రూట్ మార్చారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ వ్యవసాయేతర కార్యకలాపాల వైపు మళ్లుతున్నారు.'మోడల్ ఎంటర్‌ప్రైజెస్' వీరికి చేదోడుగా నిలుస్తున్నాయి. చిన్న చిన్న యూనిట్లు ఏర్పాటు చేసుకుంటున్న మహిళలు తాము ఆదాయాన్ని పొందుతూ కుటుంబానికి ఆసరాగా నిలవడమే కాకుండా ఇతరులకూ ఉపాధి కల్పిస్తున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా శిక్షణ పొందుతున్న మహిళలు వివిధ రకాల యూనిట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. హైదరాబాద్ మినహా మిగతా 32 జిల్లాల్లో స్టార్టప్ విలేజ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్ కింద విలేజ్ ఆర్గనైజేషన్స్ (గ్రామ సంస్థలు)లో ఈ 'మోడల్ ఎంటర్‌ప్రైజెస్' ఏర్పాటవుతున్నాయి. ఒక్కో విలేజ్ ఆర్గనైజేషన్‌లో 5–8 దాకా మోడల్ ఎంటర్‌ప్రైజెస్ ఉంటున్నాయి. గత రెండేళ్లలో 1.70 లక్షలకు పైగా మోడల్ ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రమోట్ చేసినట్లు చెబుతున్నారు. మరోవైపు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం కింద కూడా గ్రామ ప్రాంతాల్లో స్టార్టప్ ప్రమోషన్, ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్సింగ్, ధాన్యం సేకరణ, తదితరాల ద్వారా మహిళలకు ఆర్థిక సాధికారత దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. స్వయం సహాయక బృందాల్లో (ఎస్‌హెచ్‌జీల) సభ్యులుగా ఉంటున్న మహిళలు స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులు, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ వంటి వాటిని ఉపయోగించుకుంటూ ఆర్థికంగా బలపడుతున్నారు. 2022-23లో ఈ విలేజ్ ఆర్గనైజేషన్స్ రైతుల నుంచి 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాయి. కమీషన్ల రూపంలో రూ.64 కోట్ల మేర ఆదాయం పొందాయి.

అవుషా ఫుడ్స్ అదుర్స్..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ గ్రామంలోని వివిధ స్వయం సహాయక బృందాలకు చెందిన 18 మంది మహిళా సభ్యులు కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్‌గా ఏర్పడి ఎన్ఐఆర్‌డీలోని రూరల్ టెక్నాలజీ పార్క్‌లో శిక్షణ అనంతరం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేశారు. తమ తమ సంఘాల నుంచి రుణరూపేణా తీసుకున్న మొత్తంతో ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ పొంది అవుషా ఫుడ్స్ ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ కారంపొడి, పసుపు, అల్లం-వెల్లుల్లి పేస్ట్, కోల్డ్‌ప్రెస్డ్ నూనెలు, రాగి, జొన్న ఇతర పిండి పదార్థాలు కలిపి మొత్తం 41 వస్తువులను ఉత్పత్తి చేస్తోంది. ఈ యూనిట్ నెలవారీ టర్నోవర్ రూ.3 లక్షలుగా ఉంది. గ్రూపులోని మహిళలంతా సొంత కాళ్లపై నిలబడడమే కాకుండా ఎస్‌హెచ్‌జీలకు చెందిన మరో పది మంది మహిళలకు నెలకు రూ. 4 వేల చొప్పున ఉపాధి కల్పిస్తున్నారు.



ఔత్సాహిక మహిళలకు ప్రోత్సాహం

రాష్ట్రవ్యాప్తంగా 1.70 లక్షలకు పైగా ఎంటర్‌ప్రైజెస్ ప్రమోట్ చేశాం. వాళ్లకు రూ.75 వేల నుంచి రూ.5 లక్షల దాకా ఫండింగ్ సపోర్ట్ కల్పించాం. బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా అందిన రుణాలను ఈ ఔత్సాహిక మహిళలు తమ తమ యూనిట్లతో పొందే ఆదాయం ద్వారా తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఎస్‌హెచ్‌జీ బృందాల్లోని ఉత్సాహవంతులు, సొంత వ్యాపారంపై ఆసక్తి ఉన్నవారిని బ్యాంక్‌లతో టయ్యప్ చేయిస్తాం. 2021–22లో దీనిని మొదలు పెట్టాం. ఆ ఏడాది 65 వేల దాకా ఎంటర్‌ప్రైజెస్ గ్రౌండ్ చేశాం. 2022–23లో 1.34 లక్షలు టార్గెట్‌గా పెట్టుకుని 1.10 లక్షల దాకా సాధించాం.

– రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) అధికారులు

కొండగట్టు గుడిలో మళ్లీ చోరీ

కొండగట్టు (చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం మళ్లీ చోరీ జరిగింది. స్వామివారి ఆలయంలోని వెండి ఆభరణాల చోరీ సంఘటన మరువకముందే మరోసారి దొంగతనం జరగడం కలకలం రేపుతోంది. మూడు ఆలయ గదుల్లో మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో దొంగలు చొరబడ్డారు. రూ.10 వేల నగదుతోపాటు ఆలయ ప్రాంగణంలో నిద్రిస్తున్న భక్తుల మొబైల్‌ఫోన్‌ను అపహరించారు.

ఆయనకు ఇద్దరితో పెళ్లి.. ఒకే ముహూర్తానికి..

- ఏడాదిగా ఇద్దరితోనూ కాపురం, పిల్లలు కూడా..
- రేపు పెళ్లికి ఏర్పాట్లు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా శుభలేఖ



చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని ఓ గిరిజన గ్రామానికి చెందిన వ్యక్తి ఒకే ముహూర్తానికి ఇద్దరు వధువుల మెడలో తాళిబొట్టు కట్టనున్నాడు. కుర్నపల్లి గ్రామపంచాయతీకి చెందిన కోయ గిరిజనుడు, వ్యవసాయ కూలీ మడివి సత్తిబాబు అదే గ్రామానికి చెందిన సునీతతో పాటు దోశిళ్లపల్లికి చెందిన స్వప్నకుమారిని ప్రేమించాడు. ఈ క్రమంలో స్వప్నతో వివాహం జరిపించేందుకు ఇరు కుటుంబాల పెద్దలు నిశ్చయించగా.. విషయం తెలుసుకున్న సునీత నిలదీసింది. ఇరువురికీ సర్దిచెప్పేందుకు పెద్దలు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో సత్తిబాబు ఇద్దరితోనూ ఎర్రబోరులో ఏడాది క్రితం కాపురాన్ని ప్రారంభించాడు. ప్రస్తుతం సునీత, స్వప్నకు ఒక్కో సంతానం ఉన్నారు. కోయ గిరిజనుల్లో కొన్ని తెగల వారు కొంత కాలం కలిసి కాపురం చేశాక వివాహం చేసుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో వివాహ విషయాన్ని నలుగురికి తెలిసేలా విందు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు, పెద్దలు సూచించారు. దీంతో సత్తిబాబు గురువారం ఉదయం 7.04 గంటలకు ఇద్దరితో కల్యాణ ముహూర్తమని శుభలేఖలు అచ్చు వేయించి బంధువులకు పంచాడు. దీంతో ఈ కార్డు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

అమ్మను నాన్నే చంపాడు

- శానిటైజర్ పోసి నిప్పు అంటించాడన్న కూతురు



పిల్లలు, భర్తతో మృతురాలు నవ్యశ్రీ

మేడ్చల్: కట్టుకున్న భార్యను హత్య చేసి పథకం ప్రకారం ఆత్మహత్యగా చిత్రీకరించిన భర్త దురాగతాన్ని ఆయన కూతురు బట్టబయలు చేసింది. సిద్దిపేట ములుగు మండలం తుంకిబొల్లారం గ్రామానికి చెందిన తిరునగర్ నవ్యశ్రీ(33), నాగేందర్ భార్యాభర్తలు. వీరికి కూతుళ్లు చందన, మేఘన ఉన్నారు. మేడ్చల్ పట్టణంలోని సూర్యనగర్ కాలనీలో నివాసముంటున్నారు. శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 20న నవ్యశ్రీ పూజ చేయడానికి అగ్గిపెట్టెను వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తూ అగ్గిపుల్ల చీరపై పడి మంటలు చెలరేగాయని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు. ఆమె పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో కూడా అలానే పేర్కొంది. నవ్యశ్రీని ప్రాథమిక చికిత్సల అనంతరం గాంధీ ఆస్పత్రికి తర లించగా ఈ నెల 5న మృతి చెందింది. ఈ నెల 6న పెద్ద కూతురు చందన మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి తల్లి నవ్యశ్రీని తండ్రి నాగేందర్ చంపాడని స్టేట్‌మెంట్ ఇచ్చింది. తల్లి ఒంటిపై నాగేందర్ శానిటైజర్ పోసి నిప్పంటించాడని, అడ్డం వెళ్లిన తనపై కూడా శానిటైజర్ పోశాడని ఫిర్యాదు చేసింది. నాగేందర్ నవ్యశ్రీ ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించిన దృశ్యాలు అక్కడే ఉన్న సీసీ కెమెరాలలో రికార్డయ్యాయి. ఈ మేరకు నాగేందర్‌పై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కల్యాణ క్రతువుకు శ్రీకారం

- భద్రాద్రి రామాలయంలో నవమి వేడుకలు ప్రారంభం



స్వామివారిపై వసంతం చల్లుతున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని చేపట్టిన తలంబ్రాల తయారీ కార్యక్రమంతో శ్రీ సీతారాముల కల్యాణోత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. స్వామివారి ఉత్సవ మూర్తులను మేళతాళాలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్తర ద్వారం వద్ద ఆశీనులను చేశారు. ప్రత్యేక గులామ్, పసుపు, సుగంధ ద్రవ్యాలు, అత్తరును బియ్యంలో కలిపి తలంబ్రాలు తయారు చేశారు. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ తదితర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు గోటితో వొలిచిన తలంబ్రాలను తీసుకొచ్చి వీటిలో కలిపారు. భారీ సంఖ్యలో భక్తుల రాకతో మిథిలా స్టేడియ ప్రాంగణం కిటకిటలాడింది. ఇక హోలీ పండుగను పురస్కరించుకుని రామాలయంలోని బేడా మండపంలో స్వామివారికి డోలోత్సవం, వసంతోత్సవం వైభవంగా జరిపించారు. ఊయలలో కొలువుదీరిన సీతారాములకు అర్చకులు లాలలు..జోలలు పాడారు. అనంతరం భక్తులు, ఆలయ అధికారులు, సిబ్బంది వసంతాలను చల్లుకుని ఆనందోత్సాహాలతో కార్యక్రమాన్ని ముగించారు.

నేత్రపర్వంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి డోలోత్సవం



ధర్మపురి బ్రహ్మపుష్కరిణిలో తెప్పోత్సవం

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో మంగళవారం సాయంత్రం డోలోత్సవం, తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి కోనేరు వరకు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో తీసుకెళ్లారు. కోనేరులో హంస వాహనంపై ఐదు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం భోగ మండపంలోని ఊయలపై స్వామివారిని ఆశీనుల్ని చేసి డోలోత్సవం నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

కబ్జా చేసిన భూములు తిరిగివ్వండి

- మావోయిస్టు కార్యదర్శి ఆజాద్ హెచ్చరిక

భద్రాచలం: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ భూములను వివిధ పార్టీల నాయకులు కబ్జా చేస్తున్నారని, వీరు పద్ధతి మార్చుకోకపోతే ప్రజాకోర్టులో శిక్ష తప్పదని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కార్యదర్శి ఆజాద్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పేరిట లేఖ విడుదలైంది. ఐటీడీఏ వెనకాల సర్వే నంబర్ 111/5లో 4.15 ఎకరాల భూమిని కాంగ్రెస్ నేత బోగాల శ్రీనివాసరెడ్డి, టీడీపీ నేత కొడాలి శ్రీనివాస్, సీపీఐ నేత రావులపల్లి రాంప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు కబ్జా చేశారని ఆరోపించారు. రాజుపేట కాలనీ చైతన్య స్కూల్ ఎదురుగా క్రిస్టియన్ సంస్థలకు చెందిన మూడెకరాలు, వాసిరెడ్డి దుర్గయ్యకు చెందిన మూడెకరాలను రాంప్రసాద్ కబ్జా చేశారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యేను అడ్డం పెట్టుకుని బంధువులమంటూ ఆదివాసీ సంఘాలపై ఒత్తిడి తెచ్చి భూముల కబ్జాలకు పాల్పడుతున్నారని ఆజాద్ ధ్వజమెత్తారు.

అక్కడ ఆనవాయితీగా 'పిడిగుద్దులాట'

- హున్సాలో పోలీసులు, గ్రామపెద్దల పర్యవేక్షణలో కొనసాగిన సంప్రదాయం



సాలూర మండలంలోని హున్సా గ్రామంలో పిడిగుద్దులాట ఆడుతున్న గ్రామస్తులు

బోధన్‌రూరల్(బోధన్): నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలోని హున్సాలో మంగళవారం పిడిగుద్దులాట ఆడారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఈ సంప్రదాయన్ని గ్రామస్తులు కొనసాగించారు. పోలీసులు, గ్రామపెద్దల పర్యవేక్షణలో హనుమాన్ ఆలయం ఎదుట పిడిగుద్దులాట ఉత్కంఠభరితంగా సాగింది. పిడిగుద్దులాట ఆడే స్థలంలో ముందుగా 5 అడుగుల ఎత్తుతో ఉన్న బలమైన కర్రలను ఏర్పాటు చేసి పొడవైన తాడును కట్టి సిద్ధం చేశారు. డప్పువాయిద్యాల మధ్య గ్రామస్తులు వేదిక వద్దకు చేరుకుని ఇరువర్గాలుగా విడిపోయి పిడిగుద్దులాటను ప్రారంభించారు. సుమారు 10 నిమిషాల పాటు గ్రామస్తులు ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. గ్రామపెద్దలు ఆట ముగిసినట్లు ప్రకటించగానే గ్రామస్తులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పిడిగుద్దులాటను తిలకించేందుకు మహారాష్ట్ర వాసులు, బోధన్ చుట్టు పక్కల మండలాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.

'రెడ్డి కార్పొరేషన్‌పై కేబినెట్ తీర్మానించాలి'

రాంగోపాల్‌పేట్: కేబినెట్ సమావేశంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు ప్రతిపాదనను ఆమోదించాలని రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. పార్క్‌లేన్‌లోని సంఘం కార్యాలయంలో మంగళవారం సమన్వయ బాధ్యులు పైళ్ల హరినాథ్‌రెడ్డి, జక్కిరెడ్డి నరేందర్‌రెడ్డిల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఉగాదిలోపు రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు.

143 రోజుల్లో 148 టీఎంసీల తరలింపు!

- గోదావరి-కావేరీ అనుసంధాన సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదికలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: గోదావరి-కావేరి (గ్రాండ్ ఆనకట్ట) నదుల అనుసంధాన తొలిదశ ప్రాజెక్టులో భాగంగా జూన్-అక్టోబర్ మధ్య రోజుకు 1.1 టీఎంసీల చొప్పున 143 రోజుల్లో మొత్తం 148 టీఎంసీల గోదావరి జలాలను తరలిస్తామని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ప్రతిపాదించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై 87 మీటర్ల ఎత్తులో రిజర్వాయర్‌ను నిర్మించాలని తొలుత భావించింది. దిగువన ఉన్న సమ్మక్క (తుపాకులగూడెం) బ్యారేజీకి వరద నిర్వహణలో ఇబ్బందులు ఎదురుకానుండడంతో సమ్మక్క బ్యారేజీ నుంచే గోదావరి జలాలను తరలిస్తామని పేర్కొంది. బ్యారేజీ ఎత్తు 83 మీటర్లు, నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు ఉండనుందని, 48 రేడియల్ గేట్లతో 85 వేల క్యూసెక్కుల డిశ్చార్జి సామర్థ్యాన్ని కలిగి ఉండనుందని తెలిపింది. ఇటీవల రాష్ట్రాలకు పంపిన ప్రాజెక్టు సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదికలో ఎన్‌డబ్ల్యూడీఏ వెల్లడించింది. సమక్క బ్యారేజీ నిర్వహణ తెలంగాణ నీటిపారుదల శాఖ పరిధిలోనే ఉంటుందని, ఇక్కడి అవసరాలు తీరాకే మిగులు జలాలను తరలిస్తామని హామీనిచ్చింది.

భారీ సొరంగాలు, కాల్వలు..

గోదావరి నుంచి కావేరి అనుసంధానం ప్రాజెక్టు వరకు 1,211 కి.మీ.ల పొడవుతో మూసీ, నాగార్జునసాగర్, సోమశిల జలాశయాల మీదుగా సాగనుంది. గోదావరి ఉపనది ఇంద్రావతి సబ్ బేసిన్‌లో ఛత్తీస్‌గఢ్ వాడుకోని 148 టీఎంసీలను తొలుత నాగార్జునసాగర్‌కు తరలించనున్నారు. మధ్యలో 86.35 కి.మీ. వద్ద 9.15 కి.మీ. సొరంగాన్ని సైతం నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 302.78 కి.మీ. నుంచి 304.1 కి.మీ. మధ్య 1.3 కి.మీ. పొడవైన మరో సొరంగం, సోమశిల లింక్ కాల్వ వద్ద 4 కి.మీ. వద్ద ఇంకో సొరంగం, 700.97 కి.మీ. నుంచి 701.97 కి.మీ., 826.77కి.మీ. నుంచి 829.87 కి.మీ. మధ్య మరో రెండు సొరంగాలను నిర్మించనున్నారు.

ఎక్కడి నుంచి ఎన్ని నీళ్లు పారుతాయి?

నాగార్జునసాగర్, సోమశిల జాశయాలను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వినియోగించనున్నారు. అక్కడి నుంచి పెన్నా మీదుగా కావేరికి తరలిస్తారు. ఏపీ, తెలంగాణ అవసరాలు తీరాకే సాగర్ నుంచి పెన్నాకు జలాలను తరలిస్తారు. మొత్తం 30 బ్రాంచి కాల్వలు, 7 డైరెక్ట్ స్లూయిజ్‌లు/ఫీడర్ల ద్వారా ఆయకట్టుకు సాగునీరందిస్తారు. సమ్మక్క బ్యారేజీ నుంచి నాగార్జునసాగర్‌కు 14,231 క్యూసెక్కులను, సాగర్ నుంచి సోమశిలకు 5403 క్యూసెక్కులు, అక్కడి నుంచి గ్రాండ్ ఆనకట్టకు 3,990 క్యూ సెక్కులను తరలించేలా కాల్వలు, ఎత్తిపోతల పథకాల నిర్మాణాలు జరగనున్నాయి.

రెండు జలవిద్యుత్ కేంద్రాలు..

ఈ ప్రాజెక్టులో భాగంగా రెండు జలవిద్యుత్ కేంద్రాలను ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. మూసీ జలాశయం కాల్వపై 9.7 మీటర్ల ఎత్తులో విద్యుత్ కేంద్రాన్ని, సాగర్ కాల్వ మీద 20 మీటర్ల ఎత్తులో మరో విద్యుత్ కేంద్రాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించింది.

ఏటా రూ.10వేల కోట్ల లబ్ధి!

గోదావరి-కావేరి ప్రాజెక్టు వ్యయం రూ.39,274.92 కోట్లు కానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరాతో ఏటా రూ.10,084.64 కోట్ల వార్షిక ప్రయోజనం కలగనుంది. ప్రాజెక్టు లబ్ధి వ్యయ నిష్పత్తి 1.91 గా ఉండనుంది. 50 శాతం కొత్త ఆయకట్టుకు సూక్ష్మసేద్యం విధానంలో నీటి సరఫరా చేస్తారు.

రెండో దశలో 554 టీఎంసీల తరలింపు

గోదావరి-కావేరి అనుసంధాన రెండో దశ ప్రాజెక్టులో భాగంగా మహానది నుంచి 229.54 టీఎంసీలు, ఇచ్చంపల్లి వద్ద గోదావరిలో మిగిలి ఉన్న 176.64 టీఎంసీలు, ఛత్తీస్‌గఢ్ వాడుకోని 147.93 టీఎంసీలు కలిపి మొత్తం 554 టీఎంసీలను తరలించనున్నట్లు నివేదికలో ఎన్‌డబ్ల్యూడీఏ వెల్లడించింది.

క్లుప్తంగా...

సిట్టింగ్‌ల్లో దాదాపు అందరికీ మళ్లీ టికెట్లు

బీజేపీ ఎమ్మెల్యేలకు యడియూరప్ప సంకేతాలు

బెంగళూరు: రాబోయే ఎన్నికల్లో కర్ణాటక బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో దాదాపు అందరికీ మళ్లీ టికెట్లు దక్కుతాయని పార్టీ కీలక నేత యడియూరప్ప మంగళవారం సూచనప్రాయంగా చెప్పారు. ఎవరో నలుగురైదుగురు తప్ప, అందరికీ మరోసారి పోటీ చేసే అవకాశం ఉంటుందన్నారు. గుజరాత్ అసెంబ్లీకి గత ఏడాది ఎన్నికల్లో అధికార బీజేపీ సుమారు 45 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మొండి చేయి చూపింది. ఇక్కడా అదే విధానం పునరావృతం అవుతుందేమోనని సొంతపార్టీ ఎమ్మెల్యేల్లో వ్యక్తమవుతున్న సందేహాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ఆయన ప్రయత్నించారు. అసెంబ్లీ ఎన్నికలు సీఎం బొమ్మై సారథ్యంలోనే జరుగుతాయన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత జరిగే శాసనసభా పక్ష సమావేశంలోనే తదుపరి ముఖ్యమంత్రి ఎవరో పార్టీయే నిర్ణయిస్తుందంటూ.. సీఎం రేసులో తాను లేననే సంకేతాలిచ్చారు.

అమెరికాలో రైలు ఢీకొని.. తెలుగు వ్యక్తి దుర్మరణం

న్యూయార్క్: అమెరికాలోని న్యూజెర్సీలో రైలు ఢీకొని తెలుగు వ్యక్తి ఒకరు మృత్యువాత పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాకు చెందిన శ్రీకాంత్ దిగాల (39) న్యూజెర్సీలోని ప్లెయిన్స్‌బొరోలో ఉంటున్నారు. ఫిబ్రవరి 28న రైలు పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తున్న శ్రీకాంత్‌ను బోస్టన్– వాషింగ్టన్ ఆమ్‌ట్రాక్ రైలు ఢీకొట్టింది. ఆయన అక్కడికక్కడే చనిపోయారు. శ్రీకాంత్‌కు భార్య, పదేళ్ల కొడుకు ఉన్నారు. భారత్‌లో ఉంటున్న వృద్ధ తల్లిదండ్రులు, అత్తమామలకు ఆయనే ఆధారం. వారికి చేయూతనిచ్చేందుకు స్థానిక భారతీయులు, తానా, కుటుంబసభ్యులు, స్నేహితులు ఇప్పటిదాకా సుమారు లక్ష డాలర్ల విరాళాలు సేకరించారు.

ప్రతి చర్యలకు మేం సిద్ధం

అమెరికా, దక్షిణ కొరియాలకు కిమ్ సోదరి వార్నింగ్

సియోల్: అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త యుద్ధ విన్యాసాలను ఉత్తర కొరియా తీవ్రంగా తప్పు పట్టింది. తమపై దాడికొస్తే గట్టి ప్రతిచర్యలుంటాయని దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి, దేశంలోనే అత్యంత శక్తిమంతమైన మహిళ కిమ్ యో జోంగ్ హెచ్చరించారు. ''అమెరికా, దక్షిణ కొరియా కొన్ని నెలలుగా చేస్తున్న విన్యాసాలను మాపై యుద్ధంగానే భావిస్తాం. వారి ప్రతీ అడుగునూ క్షణక్షణం గమనిస్తూనే ఉంటాం. మాకు న్యాయంగా అనిపించే ఏ చర్యనైనా తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం'' అని ఆమెను ఉటంకిస్తూ ఉత్తర కొరియా మీడియా వెల్లడించింది.

అంటార్కిటికా కరిగిపోతోంది!

రికార్డు స్థాయిలో తగ్గిన మంచు.. సముద్ర మట్టాలు పెరిగే ప్రమాదం..

కోల్‌కతా, చెన్నైలకు ముంపు ముప్పు.. గ్లోబల్ వార్మింగే ప్రధాన విలన్

పర్యావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వాటి దెబ్బకు హిమ ఖండమైన అంటార్కిటికాలోనే మంచు రికార్డు స్థాయిలో కరిగిపోతోంది! ఈ పరిణామంపై పర్యావరణ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మేల్కొని దిద్దుబాటు చర్యలకు పూనుకోకుంటే పెను విపత్తులను చేజేతులా ఆహ్వానించినట్టే అవుతుందని హెచ్చరిస్తున్నారు!

అంటార్కిటికాలో సముద్రపు మంచు పరిమాణం ఫిబ్రవరి 25న ఏకంగా 17.9 లక్షల చదరపు కిలోమీటర్లకు పడిపోయింది. అక్కడి తేలియాడే మంచు పరిమాణాన్ని ఉపగ్రహ పరిశీలనల సాయంతో ఎప్పటికప్పుడు కచ్చితంగా లెక్కించడం మొదలు పెట్టిన గత 40 ఏళ్లలో నమోదైన అత్యల్ప స్థాయి ఇదే! ఇలా అంటార్కిటికాలో మంచు పరిమాణం అత్యల్ప స్థాయిలకు పడిపోవడం గత ఆరేళ్లలోనే ఏకంగా ఇది మూడోసారి కావడం ప్రమాద తీవ్రతకు అద్దం పడుతోంది. 2022లో అది 19.2 లక్షల చదరపు కి.మీ.గా తేలింది. 1979లో ఉపగ్రహ ఆధారిత గణన మొదలైన నాటినుంచీ అదే అత్యల్పం! ఈ రికార్డు గత ఫిబ్రవరిలో బద్దలై మంచు పరిమాణం 17.9 లక్షల చదరపు కి.మీ.గా నమోదైంది. అంటే ఏడాది కాలంలోనే ఏకంగా 1.36 లక్షల చదరపు కి.మీ. మేరకు తగ్గిందన్నమాట! ధ్రువ ప్రాంతాలపై పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలను ఇది ఇప్పుడు ఎంతగానో కలవరపరుస్తోంది. అంటార్కిటికాలో ఎక్కడ చూసినా మంచు పరిమాణం బాగా తగ్గిపోతోందంటూ ఆస్ట్రేలియాలోని టాస్మేనియా యూనివర్సిటీలో అంటార్కిటికా ఖండపు మంచుపై ఎంతో కాలంగా పరిశోధనలు చేస్తున్న డాక్టర్ విల్ హాబ్స్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఖండపు పశ్చిమ భాగంలో గతేడాది మంచు ఊహాతీతంగా కరిగిపోయిందని, ఆ నష్టం నుంచి ఆ ప్రాంతాలింకా తేరుకోనే లేదని చెప్పారాయన. ''నిజానికి సముద్రపు మంచుకు పరావర్తన గుణం చాలా ఎక్కువ. కనుక సూర్యరశ్మికి పెద్దగా కరగదు. కానీ దాని వెనకాల నీరు చేరితే మాత్రం కిందనుంచి కరుగుతూ వస్తుంది. ఇప్పుడదే జరుగుతోంది'' అని వివరించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్





తీరాలన్నీ మునకే!

- అంటార్కిటికా మహాసముద్రంలో ఉండే అపార హిమ రాశి తీరానికి కాస్త సమీపంలో ఉండే మంచుపై తుఫాను గాలుల ప్రభావాన్ని బాగా తగ్గిస్తుంది. ఆ హిమ రాశి ప్రస్తుత వేగంతో కరిగిపోతూ ఉంటే అలల తాకిడి వేగం బాగా పెరుగుతుంది. దాంతో సముద్రంలో తీరానికి సమీపంలో ఉన్న మంచూ క్రమంగా బలహీనపడి కరుగుతుంది. తర్వాత ఆ ఖండంలో నేలపై ఉన్న అపారమైన మంచుకు, హిమానీ నదులకు స్థిరత్వమిచ్చే ఈ ఆసరా శాశ్వతంగా కనుమరుగవుతుంది.
- పశ్చిమ అంటార్కిటికాలోని అముండ్సెన్, బెలింగ్‌హసన్ సముద్రాల్లో మంచు ఊహాతీత వేగంతో కరగడం శాస్త్రవేత్తలను మరీ కలవరపెడుతోంది. అంటార్కిటికాలో సగటు మంచు పరిమాణం 2014 దాకా ఎంతో కొంత పెరిగిన సమయంలో కూడా ఈ సముద్రాల్లో మంచు కరుగుతూనే వచ్చింది!
- పశ్చిమ అంటార్కిటికాలోనే ఉన్న త్వాయిట్స్ హిమానీ నదం కూడా క్రమంగా కరుగుతోంది. కేవలం ఇదొక్కటి గనక పూర్తిగా కరిగిందంటే సముద్ర మట్టాలు ఏకంగా అర మీటరు పెరుగుతాయి! అందుకే దీన్ని 'డూమ్స్‌డే గ్లేసియర్'గా పిలుస్తారు!
- గత ఫిబ్రవరిలో తొలిసారిగా అంటార్కిటికా ఖండపు తీర రేఖలో ఏకంగా మూడింట రెండు వంతులు ఏ మాత్రం మంచు లేకుండా సముద్రపు జలాలతో బోసిపోయి కన్పించిందట!



- అంటార్కిటికా సముద్రంలోని అపారమైన మంచు ఇలా కరుగుతున్న కొద్దీ ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు మీటర్ల మేరకు పెరుగుతాయి!
- దాంతో తీర ప్రాంతాలన్నీ ముంపు బారిన పడతాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహానగరాలెన్నో ఈ జాబితాలోకి వస్తాయి! అది కోట్లాది మందిని నిర్వాసితులను చేసి ఊహించని పెను విషాదానికి దారి తీస్తుంది.

మున్ముందు మరింత ముప్పే!



సమీప భవిష్యత్తులో అంటార్కిటికాలో మంచు కరిగే వేగం తగ్గే సూచనలేవీ పెద్దగా లేవని సైంటిస్టులు చెబుతున్నారు. ''గ్లోబల్ వార్మింగ్ ప్రభావం అంటార్కిటికాపై కొన్నేళ్లుగా చాలా పడుతోంది. కనుక సముద్రపు మంచు కరిగే వేగానికి ఇప్పుడప్పట్లో అడ్డుకట్ట పడుతుందని భావించడం అత్యాశే'' అని యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్‌వేల్స్‌కు చెందిన ఓషనోగ్రాఫర్, వాతావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మాథ్యూ ఇంగ్లండ్ కుండబద్దలు కొట్టారు. అక్కడి మంచు ఈ స్థాయిలో కరగడం కచ్చితంగా పెను ప్రమాద సూచికేనని స్పష్టం చేశారు. శాస్త్రవేత్తలు ఇప్పుడు అంటార్కిటికా సముద్రంలోని మంచు ఈ స్థాయిలో కరిగిపోతుండటం వెనక గ్లోబల్ వార్మింగ్‌తో పాటు ఇంకేమేం కారణాలున్నాయో వెదికి వాటికి అడ్డుకట్ట వేసే పనిలో పడ్డారు.

కోల్‌కతా, చెన్నైలకు ముంపు ముప్పు..



సముద్ర మట్టాల పెంపు వల్ల ముప్పు ముంపున్న మహా నగరాల జాబితాలో కోల్‌కతా, చెన్నై ముందున్నాయి. గ్లోబల్ వార్మింగ్ ఇలాగే పెరుగుతూ ఉంటే 2100 నాటికి ఆ రెండు నగరాల్లో సముద్ర మట్టాలు 20 నుంచి 30 శాతం దాకా పెరిగే ప్రమాదముందని తాజాగా ఓ అధ్యయనంలో తేలింది. ఆసియాలో యాంగూన్, బ్యాంకాక్, హోచిమిన్ సిటీ, మనీలా కూడా ఇదే జాబితాలో ఉన్నాయి.

- సముద్ర ప్రవాహాల్లో మార్పుల వల్ల సముద్ర మట్టాల్లో పెరుగుదల ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంటుంది. వీటి తో పాటు ఎల్ నినో తదితరాల ప్రభావాలను కూడా అధ్యయనం చేసి న మీదట ఈ నివేదికను రూపొందించారు.

విశేషాలు...

- సముద్ర మట్టాల్లో పెరుగుదల కేవలం వాతావరణ మార్పులతో పోలిస్తే అంతర్గత వాతావరణ మార్పులూ తోడైనప్పుడు మరో 20, 30 నుంచి ఏకంగా 50 శాతం దాకా ఎక్కువగా ఉంటుంది!
- దీన్ని పరిగణనలోకి తీసుకుంటే కోల్‌కతా, ముంబై తీర ప్రాంతాల్లో వరదలు 2006తో పోలిస్తే 2100 నాటికి కనీసం 18 రెట్ల నుంచి ఏకంగా 96 రెట్ల దాకా పెరిగే ఆస్కారముంది.
- అమెరికా పశ్చిమ తీరంతో పాటు ఆస్ట్రేలియాకు కూడా ఈ ముంపు సమస్య ఎక్కువగా ఉంటుంది.

పసిఫిక్‌లో కూలిన ఎంటీ–1

ఇస్రో సరికొత్త ప్రయోగం విజయవంతం



బెంగళూరు: మేఘా ట్రోపిక్స్–1 (ఎంటీ–1) అనే కాలం చెల్లిన ఉపగ్రహాన్ని తిరిగి భూమిపైకి తెచ్చేందుకు భారత అంతరిక్ష సంస్థ(ఇస్రో) చేపట్టిన అత్యంత క్లిష్టమైన ప్రయోగం సఫలీకృతమైంది. భూ కక్ష్యలోకి ప్రవేశించిన ఎంటీ–1ను నిర్దేశిత పసిఫిక్ సముద్రంలోని నిర్జన ప్రదేశంలో కూల్చేసింది. వాతావరణ పరిస్థితులపై అధ్యయనం కోసం 2011లో పీఎస్ఎల్వీ–సి18 రాకెట్ ద్వారా ప్రయోగించిన ఈ వెయ్యి కిలోల బరువైన ఉపగ్రహం 2021 నుంచి పనిచేయడం మానేసింది. అందులో మిగిలిపోయిన సుమారు 125 కిలోల ఇంధనంతో పేలుడు సంభవించి, ఇతర శాటిలైట్లకు ముప్పు వాటిల్లుతుందని ఇస్రో అంచనా వేసింది. అందుకే ముందు జాగ్రత్తగా ఆ ఉపగ్రహాన్ని తిరిగి కక్ష్య వెలుపలికి తీసుకురావాలనే క్లిష్టమైన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. నియంత్రిత పునరాగమనం పద్ధతిలో చేపట్టిన ఈ సరికొత్త ప్రయోగం కోసం ఎంటీ–1లోని ఇంధనాన్నే ఉపయోగించుకుంది. ఇందులో భాగంగా శాటిలైట్‌ను కక్ష్య వెలుపలి నుంచి తక్కువ ఎత్తులోకి తీసుకువచ్చి, లక్షిత ప్రాంతంలో నష్టం కనిష్ఠంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. తాము చేపట్టిన కార్యక్రమం మంగళవారం పూర్తిస్థాయిలో విజయవంతమైందని బెంగళూరులోని ఇస్రో కేంద్ర కార్యాలయం ట్వీట్ చేసింది. సాధారణంగా, భారీ ఉపగ్రహాలు లేదా రాకెట్లు భూ కక్ష్యలోకి వచ్చాక మండిపోతాయి. దీనివల్ల చిన్న శకలాలు భూమిపై పడితే పెద్దగా నష్టం వాటిల్లేందుకు అవకాశం ఉండదు. ప్రస్తుతం ప్రవేశపెట్టే శాటిలైట్లను నియంత్రిత పునరాగమనానికి వీలుగానే తయారు చేస్తున్నారని, ఎంటీ–1లో మాత్రం అలాంటి వెసులుబాటు లేదని ఇస్రో తెలిపింది.

భ్రమల్లో బీజేపీ: రాహుల్



లండన్: ''శాశ్వతంగా అధికారంలో ఉంటానని బీజేపీ భావిస్తోంది. కానీ అది నిజం కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థల్ని కాపాడుకోవడానికి ప్రతిపక్షాలన్నీ ఏకమై, మరమ్మతు పనులు చేపట్టే అవకాశాలున్నాయి'' అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. బ్రిటన్ పర్యటన ముగించే ముందు సోమవారం సాయంత్రం లండన్‌లోని చాతమ్ హౌస్‌లో చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌కు కాలం చెల్లిందని, తామే ఎప్పటికీ అధికారంలో ఉంటామని బీజేపీ అనుకోవడం హాస్యాస్పదమన్నారు.


దేశాన్ని అవమానించారు: బీజేపీ

విదేశీ వేదికపై దేశాన్ని రాహుల్ అవమానించారంటూ బీజేపీ మండిపడింది. ఆయన పూర్తిగా మావోయిస్టుల ఆలోచన ధోరణిలో ఉన్నట్టుగా అర్థమవుతోందని కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. ''రాహుల్ అరాచకంగా మాట్లాడుతున్నారు. దేశ ప్రజలు రాహుల్‌కు మద్దతు ఇవ్వకపోతే ఎన్నికల్లో ఆయన ఓడిపోతారు. అంతమాత్రాన తన అసహనాన్ని విదేశీ గడ్డపై వెళ్లగక్కి దేశాన్ని అవమానిస్తారా?'' అంటూ దుయ్యబట్టారు.

కోవిడ్ తరహాలో విస్తరిస్తున్న హెచ్3ఎన్2

ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ రణదీప్ గులేరియా హెచ్చరికలు ● ఉత్తర భారతంలో విపరీతంగా పెరుగుతున్న కేసులు

న్యూఢిల్లీ: దేశాన్ని మరో కొత్త వైరస్ భయపెడుతోంది. హెచ్3ఎన్2 అనే కొత్త రకం వైరస్ కారణంగా దగ్గు, జలుబు, జ్వరంతో ప్రజలు బాధపడుతున్నారు. అచ్చంగా కోవిడ్ లక్షణాలు కలిగిన ఈ ఇన్‌ఫ్లుయెంజా కేసులు గత కొంత కాలంగా విపరీతంగా పెరుగుతున్నాయి. ఉత్తర భారతంలో ప్రతీ ఇద్దరిలో ఒకరు దగ్గు, జలుబు, తుమ్ములు, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఈ వైరస్ కోవిడ్ తరహాలో తుంపర్ల ద్వారా ఇతరులకు సోకుతోందని, అందరూ జాగ్రత్తగా ఉండాలని ఢిల్లీలోని ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ రణదీప్ గులేరియా హెచ్చరించారు. పండగల సీజన్ కావడంతో ప్రజలందరూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, పది మందిలోకి వచ్చినప్పుడు మాస్క్ ధరించడం తప్పనిసరిగా చేయాలని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, ఇప్పటికే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతీ ఏడాది



వేసవి కాలం సమీపిస్తున్నప్పుడు వైరస్‌లు ఉత్పరివర్తనం చెందుతూ అత్యధికులకు సోకుతూ ఉంటాయని, రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారు సులభంగా వీటి బారిన పడుతున్నారని గులేరియా తెలిపారు. ''హెచ్1ఎన్1 కారణంగా కొన్నేళ్ల క్రితం మన దేశాన్ని ఒక మహమ్మారి ఊపేసింది. ఇప్పుడు ఆ వైరస్ పలుమార్లు మ్యుటేషన్‌కు లోనై ప్రస్తుతం విజృంభిస్తున్న హెచ్3ఎన్2 రూపంలో ఉంది. ఇదంత ప్రమాదకరమైన వైరస్ కాకపోయినప్పటికీ దీనిని తట్టుకునే రోగనిరోధక శక్తి మనకి లేకపోవడం వల్ల త్వరగా వ్యాప్తి చెందుతోందని అన్నారు. చలి తగ్గి, ఎండ వేడి పెరుగుతున్న దశలో ఇలాంటి వైరస్‌లో విజృంభించడం సర్వసాధారణంగా జరుగుతూ ఉంటుంది. ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య అంతగా లేకపోవడం గొప్ప ఊరటనిచ్చే అంశం.

వైరస్ లక్షణాలు

ఫ్లూ జ్వరానికి మరో రూపమే హెచ్3ఎన్2 వైరస్. ఇది సోకితే చలి, దగ్గు, జ్వరం, వాంతులు, విరోచనాలు ముక్కు కారడం, గొంతు నొప్పి, వళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉంటాయి

చికిత్స ఏమిటి?

ఈ వైరస్‌కు ప్రత్యేకంగా చికిత్స లేదు. సాధారణ ఫ్లూకి ఇచ్చే మందులే ఇస్తారు. హెచ్3ఎన్2 లక్షణాలుంటే పూర్తిగా విశ్రాంతి తీసుకొని, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే త్వరగా కోలుకుంటారు.

ఎలా వ్యాపిస్తుంది ?

ఈ వైరస్ నోటి తుంపర్ల ద్వారా ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి వ్యాపిస్తుంది. మాట్లాడినప్పుడు, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వచ్చే తుంపర్లు వైరస్‌ను వ్యాప్తి చేస్తున్నాయి. గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు అత్యధికంగా దీని బారిన పడుతున్నారు.

ఏం చెయ్యాలి..?

- మాస్కు ధరించాలి. జనసమ్మర్దానికి దూరంగా ఉండాలి
- చేతులు తరచూ సబ్బుతో కడుగుతూ ఉండాలి
- మీ నోటిని, ముక్కుని చేతులతో తాకవద్దు
- దగ్గు, తుమ్ము వచ్చినప్పుడు ముఖాన్ని కప్పుకోవాలి
- జ్వరం, ఒళ్లు నొప్పులు ఉన్నప్పుడు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి

ఏమి చెయ్యకూడదు

- బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మకూడదు
- ఇతరులతో కరచాలనం చెయ్యవద్దు
- సొంత వైద్యం చెయ్యకూడదు.
- పక్కనే ఎవరైనా ఉంటే ఆహారం తీసుకోవద్దు.

నాగాలాండ్ సీఎంగా ఐదోసారి రియో




నాగాలాండ్ సీఎంగా నిఫ్యూ రియో (కుడివైపు చివర) ప్రమాణం అనంతరం రాష్ట్ర తొలి మహిళా మంత్రి క్రూసెతో మోదీ కరచాలనం

కోహిమా: నేషనల్ డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ) నేత నెఫియు రియో(72) నాగాలాండ్ సీఎంగా ఐదోసారి ప్రమాణం చేశారు. ఆయనతోపాటు ఇద్దరు ఎమ్మెల్యేలు డిప్యూటీ సీఎంలుగా, మరికొందరు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. వీరిలో ఎన్‌డీపీపీకి చెందిన ఏడుగురు, బీజేపీ నుంచి ఐదుగురు ఉన్నారు. వీరిలో మహిళా ఎమ్మెల్యే క్రూసె కూడా ఉన్నారు. రాష్ట్ర అసెంబ్లీకి మొట్టమొదటిసారిగా ఎన్నికైన ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల్లో క్రూసె ఒకరు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లా గణేశన్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను ఇటీవలి ఎన్నికల్లో ఎన్‌డీపీపీ–బీజేపీ కూటమి 37 చోట్ల విజయం సాధించింది. రియో ప్రభుత్వానికి ఇతర పార్టీలు కూడా మద్దతు తెలుపుతూ లేఖలు అందజేశారు. దీంతో, ప్రతిపక్షం లేని అన్ని పార్టీలతో కూడిన ప్రభుత్వానికి సీఎం రియో నాయకత్వం వహించనున్నారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పాల్గొన్నారు. రియో మొదటిసారిగా 2003లో నాగాలాండ్ సీఎం అయ్యారు. మళ్లీ 2008, 2013ల్లో కూడా సీఎం పదవి చేపట్టారు. 2014లో రాజీనామా చేసి లోక్‌సభకు ఎన్నికయ్యారు. మళ్లీ 2018లో సీఎం అయ్యారు. నాలుగు పర్యాయాలు సీఎంగా ఉన్న ఎస్‌సీ జమీర్ రికార్డును తాజాగా బద్దలు కొట్టారు.

మేఘాలయ సీఎంగా కాన్రాడ్ సంగ్మా ప్రమాణం



మేఘాలయ సీఎం కాన్రాడ్, కొత్త మంత్రులతో ప్రధాని మోదీ

షిల్లాంగ్: మేఘాలయ ముఖ్యమంత్రిగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) చీఫ్ కాన్రాడ్ కె.సంగ్మా వరుసగా రెండోసారి ప్రమాణం చేశారు. ఆయన పార్టీకే చెందిన మరో ఏడుగురు ఎమ్మెల్యేలు, యూడీపీ నుంచి ఇద్దరు, బీజేపీ, హెచ్ఎస్‌పీడీపీల నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 11మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మంగళవారం షిల్లాంగ్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ ఫగూ చౌహాన్ వీరందరి చేత పదవీ ప్రమాణం చేయించారు. ఇందులో ఎన్‌పీపీకి చెందిన ఇద్దరు ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, నెడా (నార్త్ ఈస్ట్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ)కన్వీనర్, అస్సాం సీఎం హిమాంత బిశ్వ శర్మ కూడా హాజరయ్యారు. నిబంధనల ప్రకారం.. నాగాలాండ్ అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీఎంతో కలిపి మంత్రివర్గంలో 12 మందికి మించి ఉండరాదు. ప్రమాణ స్వీకారం చేసిన సీఎం కాన్రాడ్, మంత్రులకు ప్రధాని మోదీ ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. మేఘాలయ మరింతగా అభివృద్ధి పథకంలో నడిపించాలనే లక్ష్య సాధనలో వారు విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పర్యాటకంతోపాటు మౌలిక సదుపాయాలను, రహదారులు, విద్యుత్, నీటి వసతులను మెరుగుపర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యాలని ప్రమాణ స్వీకారం అనంతరం సంగ్మా పీటీఐకి చెప్పారు.

బంగ్లాదేశ్‌లో పేలుడు.. 17 మంది దుర్మరణం

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని ఓ వాణిజ్య సముదాయ భవనంలో మంగళవారం సాయంత్రం జరిగిన పేలుడులో 17 మంది చనిపోయారు. 100 మందికి పైగా గాయపడ్డారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నందున మృతుల సంఖ్య పెరిగేలా ఉంది. అక్రమంగా నిల్వ ఉంచిన రసాయనాలే పేలుడుకు కారణమంటున్నారు. రెండు రోజుల క్రితం ఢాకాలో జరిగిన పేలుడులో ముగ్గురు చనిపోగా పలువురు గాయపడ్డారు. గత వారం తీర ప్రాంత చట్టోగ్రామ్‌లోని ప్రైవేట్ ఆక్సిజన్ ప్లాంట్ పేలుడులో ఏడుగురు చనిపోయారు.

70 శిక్షణ విమానాల కొనుగోలుకు.. రూ.6,800 కోట్ల ఒప్పందం

న్యూఢిల్లీ: భారత వైమానిక దళానికి 70 హెచ్‌టీటీ–40 రకం ప్రాథమిక శిక్షణ విమానాల కొనుగోలుకు హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌తో రక్షణ శాఖ రూ.6,800 కోట్ల ఒప్పందం కుదుర్చుకుంది. వీటిని ఆరేళ్లలోగా అందజేయాల్సి ఉంటుంది. మూడు కేడెట్ ట్రెయినింగ్ షిప్‌ల కోసం ఎల్అండ్‌టీతో మరో రూ.3,100 కోట్ల ఒప్పందం ఖరారు చేసినట్లు రక్షణ శాఖ తెలిపింది. ఈ షిప్‌లను 2026 నుంచి అందజేయాల్సి ఉంటుందని పేర్కొంది. మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో అధికారులు సంతకాలు చేశారు.

నిప్పులు చిమ్ముకుంటూ లక్ష్యానికి...

- నౌకా విధ్వంసక క్షిపణి ప్రయోగం విజయవంతం
- ఐఎన్ఎస్ విశాఖ నుంచి దూసుకెళ్లిన మిస్సైల్
- 70 కి.మీ. లోపు విమానాలు, హెలికాప్టర్లు తుత్తునియలు
- ఐఏఐ, డీఆర్‌డీఓ సంయుక్త అభివృద్ధి



దొండపర్తి (విశాఖ దక్షిణ): దేశ భద్రతలో భారత నౌకాదళం మరో మైలురాయిని సాధించింది. ఐఎన్ఎస్ విశాఖ నుంచి మధ్య శ్రేణి నౌకా విధ్వంసక క్షిపణిని మంగళవారం ప్రయోగించింది. నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లిన మిసైల్ విజయవంతంగా లక్ష్యాన్ని ఛేదించింది. అత్యంత వేగంతో దూసుకొచ్చే శత్రు దేశాల యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, గైడెడ్ బాంబులు, క్రూయిజ్ క్షిపణులు, యుద్ధ నౌకలను సైతం నాశనం చేసే సామర్థ్యం ఈ మధ్యస్థ శ్రేణి క్షిపణికి ఉంది. నేలపై నుంచి ఆకాశంలోని లక్ష్యాలను ఛేదించే(ఎంఆర్ఎస్ఏఎం) వ్యవస్థ దీనికి ఉంది. 70 కిలోమీటర్ల రేంజ్‌లో ఉన్న లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించగల శక్తివంతమైన ఈ క్షిపణి వ్యవస్థను భారత రక్షణ పరిశోధన సంస్థ(డీఆర్‌డీఓ), ఇజ్రాయిల్ ఎరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. వీటిని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ఉత్పత్తి చేస్తోంది.

మీడియం రేంజ్ సర్ఫేస్ -టు -ఎయిర్ మిస్సైల్ (ఎంఆర్ఎస్ఏఎం) ప్రత్యేకతలు

- **పరిధి:** 70 కిలోమీటర్లు
- **మార్గదర్శకత్వం:** డ్యూయల్ (కమాండ్ –యాక్టివ్ రాడార్ సీకర్ (ఆర్ఎఫ్)
- **నియంత్రణ:** టీవీఎస్ అండ్ ఏరోడైనమిక్
- **ప్రొపల్షన్:** డ్యూయల్ పల్స్ –సాలిడ్ మోటార్
- **వార్ హెడ్:** ప్రీ–ఫ్రాగ్మెంట్
- **ప్రయాణ సమయం:** 230 సెకన్లు
- **పొడవు:** 4500 మిల్లీమీటర్లు
- **వ్యాసం:** 225 మిమీ
- **బరువు:** 275 కిలోలు
- **లాంచర్:** షిప్/వాహనం (నిలువు) లాంచ్.

'ఆత్మనిర్భర్'లో భాగంగా భారత సైన్యం శక్తివంతమైన క్షిపణులను సిద్ధం చేసుకుంటోంది. ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే మీడియం రేంజ్

భారత రక్షణ దళం శక్తివంతం

క్షిపణిల తయారీ, అభివృద్ధికి బీడీఎల్‌తో 2017లో ఐఏఐతో ఒప్పందం చేసుకుంది. దాని ప్రకారం ఎదురుగా వచ్చే విమానాలు, హెలికాప్టర్లు, మిస్సైళ్లను, యుద్ధ నౌకలను సైతం ధ్వంసం చేసేలా ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఇప్పటికే ఒకసారి ఒడిశాలోని బాలాసోర్ తీరం నుంచి ప్రయోగించిన ఈ క్షిపణి సుదూర శ్రేణిలో ఉన్న హైస్పీడ్ ఏరియల్ లక్ష్యాన్ని ఛేదించింది. తాజాగా పరీక్షించిన ఎంఆర్ఎస్ఏఎం వ్యవస్థలో దేశీయంగా అభివృద్ధి చేసిన డ్యూయల్ పల్స్ రాకెట్ మోటర్‌ను వాడారు. అత్యాధునిక రేడియో ఫ్రీక్వెన్సీ సీకర్ ద్వారా శత్రు విమానాలు, హెలీకాప్టర్లు, యాంటీ షిప్ మిస్సైళ్లను ధ్వంసం చేస్తుంది.

లాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం కేసు... లాలూను 5 గంటలు ప్రశ్నించిన సీబీఐ



న్యూఢిల్లీ: లాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం కేసులో ఆర్‌జేడీ చీఫ్, మాజీ రైల్వే మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌ను సీబీఐ మంగళవారం ప్రశ్నించింది. ఢిల్లీలో కూతురు మిసా భారతి ఇంట్లో ఉన్న లాలూను అధికారులు 5 గంటలపాటు ప్రశ్నించారు. వివరాలను వీడియో రికార్డు చేశారు. ఈ కేసులో లాలూ భార్య, బిహార్ మాజీ సీఎం రబ్రీదేవిని సోమవారం విచారించడం తెలిసిందే. కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకున్న లాలూ గత డిసెంబర్ నుంచి ఢిల్లీలో క్వారంటైన్‌లో ఉంటున్నారు. ఈ కేసులో లాలూ, రబ్రీదేవి, మిసా భారతి సహా 14 మందిపై సీబీఐ చార్జిషీటు దాఖలు చేసింది. 15న విచారణకు రావాలంటూ సమన్లు జారీ చేసింది.


నాన్నకు ఏమన్నా జరిగితే ఊరుకోం

లాలూను సీబీఐ అధికారులు ప్రశ్నించడంపై సింగపూర్‌లో ఉంటున్న ఆయన మరో కూతురు రోహిణి ఆచార్య తీవ్రంగా స్పందించారు. 'సీబీఐ మా నాన్నను వేధిస్తోంది. ఆయనకు జరగరానిదేమైనా జరిగితే ఢిల్లీ పీఠం కదిలిపోతుంది' అంటూ ట్వీట్ చేశారు. ఆయనకు రోహిణియే కిడ్నీ ఇచ్చారు.

బుధవారం । 8 । మార్చి । 2023

మళ్లీ ఆడపిల్లగానే పుడతాం..

- అన్ని రంగాల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతాం
- మహిళా చట్టాలు మరింత కఠినతరం చేయాలి
- 'సాక్షి' సర్వేలో అపూర్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినుల మనోగతం



కరీంనగర్‌క్రైం: 'అన్నింటా ముందువరుసలో ఉంటున్నాం. విద్య, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయం ఇలా ప్రతీ అంశంలో దూసుకెళ్తున్నాం. దేశరక్షణలో ధీరవనితలుగా, ప్రజాపాలనలో ఆదర్శంగా ముందుకు సాగుతున్నాం. సాధన చేస్తాం.. సాధిస్తాం.. మళ్లీ ఆడపిల్లగానే పుడతాం' అని అంటున్నారు కరీంనగర్ జిల్లాకేంద్రంలోని అపూర్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు. వంటగది నుంచి సమాజాన్ని శాసించే స్థాయికి ఎదిగి, అద్భుతాలు సాధించి ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని ఏలుతున్న వారే తమకు ఆదర్శమని చెబుతున్నారు. ప్రస్తుత కాలంలో మహిళా చట్టాలను మరింత కఠినతరం చేయాలని, రక్షణ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కళాశాలలోని 100 మంది యువతులను పలు అంశాల్లో ప్రశ్నించగా.. వారు వెల్లడించిన మనోగతం ఇదీ..!!



సర్వేలో పాల్గొన్న అపూర్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు

స్వేచ్ఛగా జీవిస్తున్నాం

గతంలో కన్నా ప్రస్తుతం అమ్మాయిలు, మహిళలు స్వేచ్ఛగా జీవిస్తున్నారనడంలో సందేహం లేదు. అప్పటి రోజులు వేరు. ఇప్పటి రోజులు వేరు. ప్రస్తుతం మాకు నచ్చినట్టుగా జీవించే సమజానికి స్వాగతిస్తున్నాం. చట్టాల్లో మార్పు తేవాలి. మెడికో ప్రీతి చావుకు కారణమైన వారిని శిక్షించాలి.

– లోహితశ్రీ, గోదావరిఖని



స్వతంత్రంగా ఎదుగుదల

ప్రస్తుతకాలంలో యువతులందరూ స్వతంత్రంగా ఎదగాలని ఆలోచన చేస్తున్నారు. కొత్త ఆలోచనలతో అద్భుతాలు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. దీనికి ఎవరి ప్రమేయం, ప్రోద్బలం లేకుండా స్వతంత్రంగా ఆలోస్తే తప్పనిసరిగా విజయం సాధిస్తాం. ఇంట్లో ఆడ మగ వివక్ష తగ్గాలి.

– ఇషా పర్వేజ్, కరీంనగర్



కట్టడి చేస్తే కష్టం

ప్రస్తుతరోజుల్లో మహిళలకు దాదాపు స్వేచ్ఛ లభిస్తోంది. ఎక్కడో ఒకచోట ఇంట్లోనో, పనిచేసే చోటనో మహిళలను కట్టడి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని ఛేదిస్తే దాదాపు మహిళలు పురోగతి సాధించేందుకు అవకాశం ఉంటుంది.

– ప్రవళిక, మానకొండూర్



రాజకీయంగా వెనకే..

ప్రస్తుతం రాజకీయాల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్ ఉంది. కానీ ఆ సీట్లలో గెలిచిన మహిళల స్థానంలో వారి కుటుంబ సభ్యుల పెత్తన ఉంది. సొంత నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను మహిళల భర్తలు, కుటుంబ సభ్యులు ఇవ్వడం లేదు. ఈ వ్యవస్థ మారితే మరింత బాగుంటుంది.

– జ్యోతిశ్రీ, కమాన్‌పూర్



గరిమా అగర్వాల్

ఐపీఎస్.. ఐఏఎస్

- తొలి ప్రయత్నంలోనే విజయం
- ముక్కుసూటి తనం.. వృత్తిలో నిబద్ధత

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: శ్రమ నీ ఆయుధమైతే.. విజయం నీ బానిసవుతుందన్న నానుడికి చక్కటి నిదర్శనం జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్. చిన్నతనం నుంచే క్రమశిక్షణ, విద్యలో రాణించి, ఉన్నతోద్యోగం సాధించి మహిళా లోకానికే ఆదర్శంగా నిలిచారు. సమాజసేవ చేయాలన్న ఆకాంక్షతో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(ఐఏఎస్) సాధించారు. సుపరిపాలన దిశగా అడుగులు వేస్తుండటం ఆహ్వానించదగ్గ పరిణామం. తల్లిదండ్రులు వ్యాపారులైనా తాను మాత్రం ప్రజాసేవను ఎంచుకుని దిగ్విజయంగా అడుగులు వేస్తున్నారు.

ఎపుడూ ఫస్టే.. ఆపై ఐపీఎస్.. ఐఏఎస్

మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ ప్రాంతానికి చెందిన గరిమా అగర్వాల్‌కి బాల్యం నుంచే చదువుపై మక్కువ ఎక్కువ. అక్కడే సరస్వతి విద్యా మందిర్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. 10వ తరగతిలో 92శాతం, 12వ తరగతిలో 89శాతం మార్కులు తెచ్చుకున్నారు. ఐఐటీలో హైదరాబాద్‌లో అడ్మిషన్ తీసుకోగా తదుపరి జర్మనీలో ఇంటర్న్‌షిప్ తీసుకున్నారు. కానీ, ఏదో తెలియని అసంతృప్తి వెంటాడేది. తిరిగి స్వదేశానికి వచ్చి యూపీపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌కు ప్రయత్నించారు. ఒకట్నిర సంవత్సరాలు పుస్తకాలతో కుస్తీ పట్టగా తొలి ప్రయత్నంలోనే 2017లో 240 ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. అంతటితో ఆమె సంతృప్తి చెందలేదు. ఐపీఎస్ శిక్షణలో ఉంటూనే 2018లో రెండోసారి పరీక్ష రాసి 40వ ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కి ఎంపికయ్యారు. 2019–20 సంవత్సరంలో ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీలో శిక్షణను పూర్తి చేశారు. అనంతరం తెలంగాణలోనే శిక్షణ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకోగా కరీంనగర్ అదనపు కలెక్టర్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.



పరిపాలనలో నిబద్ధత.. ముక్కుసూటితనం

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా వ్యవహరిస్తుండగా పరిపాలనలో తనదైన ముద్ర వేస్తున్నారు. సమస్య ఏదైనా పైరవీకి అస్కారం లేకుండా నిబంధనల ప్రకారం నిక్కచ్చిగా వ్యవహరించడం ఈమె నైజం. మహిళా సంఘాలను ప్రోత్సహిస్తూనే గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోంది. స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పనితీరును మెరుగుపరిచారు. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల అమలులో తనదైన ముద్ర వేస్తున్నారు. రాజకీయ పైరవీలకు ఆస్కారం లేకుండా 'రూల్ ఇజ్ రూల్' అన్న సిద్ధాంతంతో విధులు నిర్వహించడం అభినందనీయం.

- ఆడపిల్లగా భువిపైకి వచ్చి..
- అక్కగా ఆదరించి..
- చెల్లిగా తోడు నిలిచి..
- భార్యగా ఏడడుగులు నడిచి..
- అమ్మగా లాలించి..
- ఇల్లాలిగా ఇంటిని పాలించి..
- భావి తరాలకు మార్గదర్శిగా నిలిచింది మహిళ.

ఆమె అవని.. విశ్వానికి జనని.. ఆమె పుట్టుక ఆనందం. ఆమె ఓపికకు వందనం. ఆమె లేనిదే జననం లేదు. ఈ ప్రపంచానికి మనుగడే లేదు. నాడు వంటింటికే పరిమితమైన మహిళ నేడు ఆకాశంలో సగం.. అవనిలో సగం అన్నట్లు సాగుతోంది. చదువులో అగ్రస్థానంలో నిలుస్తూ.. అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. అటెండర్ నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌గా కొనసాగుతూనే.. ఇంటి బాధ్యతలను మరో చేతితో మోస్తోంది. కుటుంబానికి తోడుగా నిలుస్తూ... కష్టాల్లో ఉన్న బతుకుబండిని లాగుతోంది. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు మహిళలు పురుషులకు తామేమీ తక్కువ కాదంటూ.. ధీమాగా ముందుకు సాగుతున్నారు. ఆడపిల్ల పుట్టిందంటే భయపడే రోజులు పోయాయి. ప్రస్తుతం ఆడపిల్లను మహాలక్ష్మిలా కొలుస్తున్నారు. ఊర్లో అమ్మాయి పుడితే ఆర్థికంగా అండగా ఉంటున్నారు పలువురు ప్రజాప్రతినిధులు..
నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..!!

అన్నింటా ఆమె

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ప్రచురించే కథనాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో ప్రియాంక

- ఉమెన్స్ డే కథనాలను పర్యవేక్షించి ఫైనల్ చేసిన జెడ్పీ సీఈవో
- కథనాల ఎంపిక, డిజైన్‌లలో సూచనలు.. పలు విభాగాల సందర్శన..
- పత్రిక రావడంలో ఇంత శ్రమ ఉందా..!: ప్రియాంక

'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా ప్రియాంక

కరీంనగర్: కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంక మంగళవారం సాయంత్రం తిమ్మాపూర్‌లోని 'సాక్షి' యూనిట్ కార్యాలయాన్ని సందర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గెస్ట్ ఎడిటర్‌గా ఆహ్వానించగా.. సీఈవో హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్తా విశేషాలు, న్యూస్ ఎడిటింగ్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా వచ్చిన ప్రత్యేక కథనాలను పరిశీలించారు. వార్తా కథనాల్లోని వ్యక్తుల గురించి అడిగి తెలు సుకున్నారు. ఉద్యోగుల వివరాలు, పత్రిక ప్రింటింగ్ సమయాలు, ఏయే విభాగాల్లో ఎంత మంది ఉద్యోగులు ఉంటారనే విషయాలపై ఆరా తీశారు. పత్రిక మెయిన్ పేజీతో పాటు జిల్లాల పేజీలను ప్రింటింగ్ అయ్యే సమయంలో ప్లేట్స్‌ను ఎలా వినియోగిస్తారనే విషయాన్ని ఆసక్తిగా పరిశీలించారు. జిల్లా పేజీల కూర్పు, తదితర వివరాలపై 'సాక్షి' సిబ్బందితో మాట్లాడారు. జెడ్పీ సీఈవో మాట్లాడుతూ.. 'ఎంతో మంది నిరంతరం శ్రమిస్తే గాని పేపర్ బయటకురాదు. ప్రతీ క్షణం సమాచారం అందించాలనే తపనతో పనిచేస్తుండడం అభినందనీయం. మహిళా దినోత్సవం ప్రత్యేక కథనాలు బాగున్నాయి. ఇతరులను ప్రభావితం చేసే అంశాలను ఎంచుకున్నారు..' అని అన్నారు. వార్తల సేకరణ.. ఎడిటింగ్ .. పేజీ డిజైనింగ్.. గురించి అడిగి తెలుసుకున్నారు. పేజీ డిజైనింగ్‌ను పరిశీలించి.. హెడ్డింగ్ బాగుందని కితాబునిచ్చారు. మహిళ దినోత్సవం సందర్భంగా పత్రిక కార్యాలయాన్ని సందర్శించడం సంతృప్తినిచ్చిందని ప్రియాంక పేర్కొన్నారు.



పేజీనేషన్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో ప్రియాంక

స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాలి



కరీంనగర్: జిల్లాలో ప్రతి మహిళా ప్రజాప్రతినిధి తన పరిధిలో అభివృద్ధిపరంగా సొంత నిర్ణయాలు తీసుకోవాలి.అభివృద్ధికి అడ్డంకిగా నిలుస్తున్న నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయాలి. మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించినా చట్టసభల్లో కల్పించడం లేదు. ఇప్పటికీ సమాజంలో పురుషాధిక్యత నడుస్తోంది. మహిళలు సొంత నిర్ణయాలు తీసుకోవాలి. ఇతరులపై ఆధారపడొద్దు.

– కనుమల్ల విజయ, జెడ్పీ చైర్‌పర్సన్

ఆడపిల్ల పుడితే రూ.5 వేలు కానుక

తిమ్మాపూర్/కరీంనగర్ రూరల్: ఆడపిల్ల పుడితే ఆర్థికంగా భారమవుతుందని ఎందరో తల్లిదండ్రులు బాధపడుతుంటారు. ఈనేపథ్యంలో ఆడపిల్లలకు తమవంతు కొంతైనా ఆర్థికంగా సాయమందించాలనే ఉద్దేశంతో పలువురు సర్పంచులు చేయూతనందిస్తున్నారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ సర్పంచ్ రావుల రమేశ్ తన తండ్రి రామచంద్రం జ్ఞాపకార్థం ఆడబిడ్డలకు ఆర్థిక చేయూతనందిస్తున్నారు. గ్రామంలో పుట్టిన ప్రతి ఆడపిల్లకు రూ.5,116 ఫిక్స్‌డ్ డిపాజిట్ చేద్దామని నిర్ణయించి గతేడాది నుంచి కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 25 మందికి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలు అందజేశారు. అలాగే సొంత ఖర్చులతో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేసి వారికి పౌష్టికాహారం అందిస్తున్నారు. కరీంనగర్ మండలం మొగ్ధుంపూర్ సర్పంచు జక్కం నర్సయ్య తన కానుకగా రూ.5వేల నగదు సాయం అందిస్తున్నారు. గతేడాది జనవరిలో ప్రారంభించిన ఈ పథకం కింద ఇప్పటివరకు 15మంది చిన్నారుల పేరిట పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలను అందించారు. ఇంకా 10మంది లబ్ధిదారుల పేరిట ఎఫ్‌డీ చేసి త్వరలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా డిపాజిట్ పత్రాలు అందచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నర్సయ్య తెలిపారు. అలాగే చెర్లభూత్కూర్ సర్పంచు దబ్బెట రమణారెడ్డి రూ.5,116 రమణన్న కానుకగా అందిస్తున్నారు. గతేడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్వశక్తి సంఘాల మహిళల సమావేశంలో పథకాన్ని ప్రకటించారు. ఇప్పటివరకు 15మంది చిన్నారుల పేరిట పోస్టాఫీసులో డిపాజిట్ చేసి పత్రాలను తల్లిదండ్రులకు అందించారు.



మానకొండూర్ ఎమ్మెల్యే బాలకిషన్ చేతుల మీదుగా బాండ్ అందిస్తున్న సర్పంచ్ రావుల రమేశ్(ఫైల్)

తల్లిదండ్రులు ప్రోత్సహించాలి




కరీంనగర్‌టౌన్: మా నాన్న టాక్సీ నిర్వాహకులు. అయినా నా చదువు కోసం హైదరాబాద్‌లో ఉంటూ చాలా కష్టపడ్డారు. ముందు చూపుతో ఆ రోజుల్లోనే నన్ను ఇంగ్లిష్ మీడియంలో చదివించారు. నాన్న ప్రోత్సాహంతో ఇష్టంగా చదివా. ఉస్మానియా మెడికల్ కాలేజీలో వైద్య పట్టా పుచ్చుకున్నా. గైనకాలజిస్టుగా కరీంనగర్‌లో స్థిరపడ్డాను. నయా పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ కళాశాలలో చదివిన నాకు ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో వందల కొద్దీ మెడికల్ క్యాంపులు పెట్టి నిరుపేద మహిళలకు వైద్య సేవలు అందిస్తున్నా. 2021లో జాతీయస్థాయి అవార్డుతో పాటు పదుల సంఖ్యలో రాష్ట్ర, జిల్లాస్థాయి అవార్డులు అందుకున్నా. అయినా సేవ చేసినప్పుడే ఎక్కువ ఆనందం పొందుతున్నా. ఆడ పిల్లలను ప్రోత్సహిస్తే ఏదైనా సాధించగలరు.

– డాక్టర్ ఎం.విజయలక్ష్మి, సీనియర్ గైనకాలజిస్టు

అతివ.. స్థానిక సంస్థల్లో హవా

కరీంనగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గతంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఉండేవి. 2013 నుంచి 50 శాతం కల్పిస్తున్నారు. 2013 జూన్‌లో ఉమ్మడి కరీంనగర్‌లో 1,207 గ్రామ పంచాయితీలకు జరిగిన ఎన్నికల్లో 605 మంది మహిళలకు సర్పంచ్‌లుగా అవకాశం వచ్చింది. 2014 ఏప్రిల్‌లో జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో 57 స్థానాలకు 31 స్థానాలు మహిళలే గెలుచుకున్నారు. 57 ఎంపీపీలకు 32 స్థానాలు కైవసం చేసుకున్నారు. అలాగే ఎంపీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లోనూ 50 శాతానికి పైగా మహిళలే ఎన్నిక కావడం విశేషం. ఇక 2018లో స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం మహిళలే అత్యధిక సంఖ్యలో విజయం సాధించారు. ఇల్లందకుంట జెడ్పీటీసీ కనుమల్ల విజయ జెడ్పీ చైరపర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. 313 జీపీలకు గాను 165మంది మహిళలు సర్పంచ్‌లుగా ఉన్నారు.

సంకల్పంతో కృషి చేస్తే సక్సెస్ మనదే..



కరీంనగర్‌స్పోర్ట్స్: ఆడపిల్లనమ్మా అంటూ దిగులు చెందొద్దు. ఆడపులిలా ఈ లోకానికి నీవెంటో నిరూపించాలి. తోటి మహిళల్లో వెలుగులు నింపాలి. మన నమ్మకమే మనల్ని విశ్వవిజేతగా నిలబెడుతుంది. ఏ రంగంలోనైనా రాణించేందుకు దృఢసంకల్పంతో కృషి చేస్తే సక్సెస్ మన ముగింట నిలుస్తుంది. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు వీరవనితలుగా, ఒక ఆయుధంగా తయారుకావాలి. ప్రతి ఒక్కరూ మార్షల్ ఆర్ట్స్ లాంటి యుద్ధ క్రీడల్లో పట్టు సాధించాలి. అప్పుడే మనం సమాజంలో అన్నీ సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవచ్చు.

– గాజుల దీప్తి, అంతర్జాతీయ కరాటే ప్లేయర్, కోచ్

క్లుప్తంగా

కుక్కల దాడిలో ఇద్దరికి తీవ్రగాయాలు

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని బొంతుపల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తులపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గ్రామానికి చెందిన పుష్ప(55) ఇంటి పరిసరాలలో ఉండగా ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. అక్కడి నుంచి కొద్ది దూరంలో ఉన్న ఆయుస్మాన్(5) కరిచాయి. దీంతో వారిని గ్రామస్తులు చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఇటీవల మల్లారెడ్డిపల్లి గ్రామంలో కుక్కల దాడిలో ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాలు పాలయ్యారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గంభీర్‌పూర్‌లో 18 గొర్రెలు మృత్యువాత

కథలాపూర్ (వేములవాడ) : మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో వీధికుక్కల దాడిలో 18 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కేశవేని చుక్కయ్య రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి గొర్రెలను మందవద్ద తోలి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం గొర్రెల మందపై వీధికుక్కలు దాడిచేసినట్లు స్థానికులు చుక్కయ్యకు సమాచారం అందించారు. 18 గొర్రెలు మృత్యువాతపడగా ఏడు గొర్రెలు గాయపడినట్లు బాధితుడు తెలిపాడు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం చోరీ

జగిత్యాల రూరల్ : మండలంలోని తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వఉంచిన బియ్యాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి అంగన్‌వాడీ కేంద్రానికి తాళంవేసి వెళ్లారు. ఉదయం చూసేసరికి నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీనిపై అంగన్‌వాడీ కేంద్రం ఆయా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు ఆరోగ్య మహిళా పథకం ప్రారంభం

- హాజరుకానున్న వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కర్ణన్



మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్

కరీంనగర్‌టౌన్: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 100 ఆసుపత్రుల్లో ప్రతి మంగళవారం మహిళా క్లినిక్‌లను నిర్వహించనున్నారు. ఈ పథకాన్ని కరీంనగర్ నుంచే ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టారు. బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కరీంనగర్‌లోని బుట్టి రాజారాం కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 10.15 గంటలకు పథకాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో మూడో అంతస్తులో ఏర్పాటు చేసిన 100 పడకల అదనపు వార్డు, రేడియాలజీ హబ్, ఆరోగ్య మహిళా వార్డులను 11 గంటలకు ప్రారంభిస్తారు. అలాగే జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో 50 పడకలతో ఏర్పాటు చేయనున్న క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. 11.30 గంటలకు కొత్తపల్లిలో మెడికల్ కళాశాల పునరుద్ధరణ పనులను పరిశీలిస్తారు. 12 గంటలకు మంకమ్మతోటలోని చైతన్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న కార్డియాక్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంపును సందర్శించి, 12.30 గంటలకు ఆరోగ్య మహిళా పథకం ప్రారంభం సందర్భంగా మార్క్‌ఫెడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొన్ని మాట్లాడుతారు.

ఏర్పాట్లు పరిశీలన

ఆరోగ్య మహిళా పథకం ప్రారంభోత్సవానికి జిల్లాకు రానున్న మంత్రి హరీశ్‌రావు పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ పరిశీలించారు. జిల్లా ప్రధాన ఆసుపత్రి, బుట్టిరాజారాం కాలనీ పీహెచ్‌సీ, మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో సభాస్థలి, శ్రీచైతన్య కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్, జెడ్పీ సీఈఓ ప్రియాంక, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్, ఆర్డీఓలు ఆనంద్ కుమార్, హరిసింగ్, డీఎంహెచ్‌వో జువేరియా తదితరులు పాల్గొన్నారు.

9న కాంగ్రెస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

కరీంనగర్‌టౌన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా ఈనెల 9న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగే బహిరంగసభకు ప్రజలు పెద్దెత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ముఖ్యనాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుజురాబాద్, హుస్నాబాద్, మానకొండూర్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, నియోజకవర్గాల్లో పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో భారీ బహిరంగ సభకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో సోనియా గాంధీ ఇక్కడి నుంచే తెలంగాణకు అనుకూలంగా ప్రకటన చేసి, రాష్ట్రం ఇచ్చారని వివరించారు. సభకు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్‌బగెల్, మాజీ ముఖ్య మంత్రులు, తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, కొప్పుల రాజు, రోహిత్ చౌదరి, జై రామ్ రమేష్, మాజీ మంత్రులు, తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పడాల రాహుల్, కర్ర సత్యప్రసన్న రెడ్డి, ఎండీ తాజ్, పులి ఆంజనేయులుగౌడ్, శ్రావణ్‌నాయక్, అబ్దుల్ రెహమాన్, సయ్యద్ అఖిల్, నిహాల్, పోరండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూనారంవాసిని హతమార్చింది మేనల్లుడే

- సీసీ కెమెరాల సాయంతో నిందితుడి పట్టివేత

పెద్దపల్లిరూరల్: భిక్షాటన చేస్తుండటం వల్లే తనకు పెళ్లి కుదరడం లేదని భావించి, మేనమామ మారుపాకల రాయమల్లు (49)ను అతని అల్లుడే హతమార్చాడని డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారం గ్రామానికి చెందిన రాయమల్లు రామగిరి మండలంలోని సెంటినరీకాలనీలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని మేనల్లుడు చిప్పగుర్తి శివ ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో కొద్ది రోజులుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. అయితే మేనమామ భిక్షాటన చేస్తుండటం వల్లే తనకు సంబంధాలు కుదరడం లేదని అనుకున్నాడు. అతన్ని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 4న పెద్దపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోకి రాయమల్లును ఆటోలో తీసుకువచ్చాడు. కర్రతో విచక్షణారహితంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మొదట గుర్తు తెలియని మృతదేహమని కేసు నమోదు చేసిన పోలీసులు తర్వాత సీసీ కెమెరాలను పరిశీలించి, రాయమల్లు అల్లుడే హంతకుడని తేల్చారు. అతన్ని అదుపులోకి తీసుకొని, విచారణ చేపట్టారు. నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు.

పల్లె ప్రకృతి వనంలో మృతదేహం పూడ్చివేత

పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట పల్లె ప్రకృతి వనంలో మృతదేహాన్ని పూడ్చివేశారని ఉపాధి కూలీలు తెలిపారు. అది రాయమల్లు మృతదేహమేనని తెలిసింది. పోలీసులు మృతుడి బంధువులకు అప్పగించగా అంత్యక్రియలు నిర్వహించే స్తోమత లేక వారు ప్రకృతి వనంలో పూడ్చివేశారని సమాచారం. దీనిపై కూలీలు ఆందోళన చెందుతున్నారు. మృతదేహాన్ని పూడ్చిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, బయటకు తీసి, మరోచోట పూడ్చాలని కోరుతున్నారు.

జోడో యాత్ర కాదు.. జూటా యాత్ర

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర(చొప్పదండి): పీసీసీ అధ్యక్షుడు చేస్తున్నది జోడో యాత్రకాదు.. జూటా యాత్ర అని.. అది బస్సు యాత్రనా, పాదయాత్రనో తెలియడం లేదని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాడు సోనియాగాంధీని బలిదేవత అన్న రేవంత్‌రెడ్డికి నేడు దేవత ఎలా అవుతుందో, రూ.50 కోట్లకు పీసీసీ పదవిని కొనుక్కున్నావని ఆరోపిస్తున్న మీ పార్టీ నాయకులకు సమాధానం చెప్పాలన్నారు. కొండగట్టు బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారికి రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.3 లక్షలు తెలంగాణ ప్రభుత్వం అందజేసిందన్నారు. పోతారం రిజర్వాయర్ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అనుభవం ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. మేడిపల్లి సత్యంకు ఆస్తులు ఏం వ్యాపారం చేస్తే వచ్చాయో వివరించాలన్నారు. 'విలేకరుల సమావేశంలో స్థానిక నాయకుడు మాట్లాడుతుంటే నువ్వు, నీ అనుచరులు వెళ్లిపోవడంపై మీ పార్టీ వారే విమర్శిస్తున్నారు' అని గుర్తు చేశారు. స్థానికేతరులకు ఇక్కడ స్థానం లేదని మేడిపల్లి సత్యం గుర్తుంచుకోవాలని సూచించారు. ఏ పార్టీలో ఉండి ఏ పార్టీ టికెట్ అడుగుతావో తెలియదని, నీకు టికెట్ రాదని మీ పార్టీ నాయకులే ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు రాజకీయ, ఆర్థిక స్వాతంత్య్రం రావాలి



డిప్యూటీ మేయర్ స్వరూపరాణితో ఆసుపత్రి సిబ్బంది

కరీంనగర్‌టౌన్: మహిళలకు రాజకీయ, ఆర్థిక స్వాతంత్య్రం వచ్చినప్పుడే సమాజంలో పురుషులతో సమానంగా రాణిస్తారని కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి–హరిశంకర్ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో డిప్యూటీ మేయర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు తమ శక్తి సామర్థ్యాలను తక్కువగా అంచనా వేసుకోవద్దని, ముఖ్యంగా ఆసుపత్రుల్లో 70 శాతం మంది మహిళా సిబ్బందే రోగులకు సేవలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంటిని చక్కదిద్దినట్లే రోగుల ఆరోగ్యాలను సైతం బాగుచేసే బాధ్యతలను మహిళలే చేపట్టడం గర్వకారణంగా ఉందన్నారు. ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్లు శ్వేత పెండ్యాల, ప్రత్యూష, ప్రతిష్ఠారావు, సుహేల, కిరణ్‌కుమార్ కొండపాక, సాయిఫణిచంద్ర, అక్షయ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఏ విద్యార్థులకు మాక్ టెస్ట్‌లు

కరీంనగర్: చార్టెడ్ అకౌంటెంట్ కోర్సు చదువుతున్న ఇంటర్మీడియట్, ఫైనల్ విద్యార్థులకు కరీంనగర్ సీఏ బ్రాంచ్‌లో ఈనెల 13 నుంచి 21వరకు మాక్ టెస్ట్ (నమూనా పరీక్షలు) నిర్వహించనున్నట్లు చైర్మన్ ఆర్.సతీష్, కార్యదర్శి సీఏ వెన్నం మల్లేశం, ఎస్ఐసీఏఎస్ఏ చైర్మన్ సీఏ వనపట్ల శేఖర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. సీఏ ఫైనల్‌కు సంబంధించి ఈనెల 13న పేపర్–1 ఫైనాన్షియల్ రిపోర్టింగ్, 14న పేపర్– 2 స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్, 15న పేపర్– 3 అడ్వాన్స్‌డ్ ఆడిటింగ్ అండ్ ప్రొఫెషనల్ ఎథిక్స్, 16న పేపర్–4 కార్పొరేట్ అండ్ ఎకనామిక్ లాస్, 17న పేపర్– 5 స్ట్రాటజిక్ కాస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ పర్ఫామెన్స్ ఎవల్యూషన్, 18న పేపర్–7 డైరెక్ట్ టాక్స్ లాస్ అండ్ ఇంటర్నేషనల్ టాక్సేషన్, 20న పేపర్– 8 ఇన్ డైరెక్ట్ టాక్స్ లాస్, సీఏ ఇంటర్మీడియట్‌కు సంబంధించి 13న పేపర్–1 అకౌంటింగ్, 14న పేపర్–2 కార్పొరేట్ అండ్ అదర్ లాస్, 15న పేపర్– 3 కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, 16న పేపర్– 4 టాక్సేషన్, 17న అసురెన్స్, 20న పేపర్–7 ఎంటర్‌ప్రైస్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, 21న పేపర్– 8 ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ అండ్ ఎకనామిక్ ఫర్ ఫైనాన్స్ పరీక్షలను మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు నిర్వహించబడునని పేర్కొన్నారు. మే లో జరిగే ఫైనల్, ఇంటర్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వారు రాసిన జవాబు పత్రాలను సరైన పద్ధతిలో వాల్యుయేషన్ చేయించి విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలను ఎక్స్పర్ట్ ద్వారా వారికి తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈనెల 9 లోపు http:// bosactivities. icai. org వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 88867 15959 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వైభవం.. నారసింహుని శకటోత్సవం



స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శకటోత్సవం వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు జిల్లాల నుంచి భారీగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో వచ్చిన భక్తులు స్వామివారు కొలువు దీరిన కొండచుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల ఏర్పాట్లను ఈవో వెంకన్న, ఆలయ చైర్మన్ శ్రీనివాస రావు పర్యవేక్షించారు. సీఐ పర్శ రమేశ్, ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చెన్నకేశవస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

మండలంలోని మొగిలిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీచెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంగళవారం స్వామివారిని దర్శించుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, పాశం అశోక్‌రెడ్డి, కొండలరావు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి డోలోత్సవం



స్వామివారల ఊరేగింపు

ఇల్లందకుంట(హుజూరాబాద్): అపరభద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో హోలీపూర్ణిమ సందర్భంగా రామయ్యకు డోలోత్సవం, వసంతోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఉత్సవమూర్తులను గ్రామ ఆలయం నుంచి ఊరేగింపుగా మేళతాళాల మధ్య ప్రధాన ఆలయానికి తీసుకువచ్చారు. ప్రధాన అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరచార్యుల ఆధ్వర్యంలో, ఆలయ కార్యనిర్వహణ అధికారి సుధాకర్ సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని స్వామివారిపై, భక్తులపై వసంతాన్ని చల్లి హోలీ వేడుకలను ఘనంగా జరిపారు. తిరిగి స్వామివార్లను ప్రధాన ఆలయం నుంచి గ్రామ ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు.


కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న నరేందర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): ప్రతి విద్యార్థి కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన బాలకవి సమ్మేళనం



బాలకవి సమ్మేళనంలో విద్యార్థులు

కరీంనగర్‌కల్చరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జ్యోతిబాపూలే పార్క్‌లో, తెలంగాణ బుక్ ట్రస్టు ఆధ్వర్యంలో, సాహిత్య అకాడమీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కరీంనగర్ బుక్ ఫెయిర్‌లో మంగళవారం నచ్చిన అంశంపై బాలకవి సమ్మేళనం నిర్వహించారు. పలువురు చిన్నారులు తమ కవితలను వినిపించి ఆకట్టుకున్నారు. భవానీ బృందం మెట్‌పల్లి, శంకరపట్నం మహిళా కళాకారులచే డప్పు ప్రదర్శన, హుజూరాబాద్ మురళి మధు, కొండ స్వరూప జానపద గీతాలు, జెడ్పీహెచ్ చామనపల్లి చిన్నారులచే ఒగ్గుకథ, జీహెచ్ఎస్ సప్తగిరికాలనీ విద్యార్థులచే బాల సభ అలరించాయి. అనంతరం కవి విమర్శకుడు, రచయిత ధాన్యం సేనాధిపతి బొద్దుల వెంకటేశం పురస్కారం కింద రూ.10 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నారు. సాయంత్రం 118వ ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమంలో కవులు తమ కవితాగానం చేశారు. వారం రోజుల జరుగుతున్న పుస్తక మహోత్సవం బుధవారంతో ముగియనుందని బుక్‌ట్రస్ట్ కార్యదర్శి చంద్రమోహన్ తెలిపారు.

బీజేపీవి కపట దీక్షలు

కరీంనగర్: మహిళలకు భద్రత కల్పించాలంటూ ఓట్ల రాజకీయం చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దీక్ష చేయడం దయ్యాలు వేదాలు వల్లించడమేనని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం ప్రకటనలో అన్నారు. బల్కిస్ భానో అత్యాచార దుండగులకు కొమ్ము కాసి, నిర్దోషులుగా విడుదలకు సహకరించిన బీజేపీ మహిళల భద్రత గురించి మాట్లాడం సిగ్గుచేటన్నారు. మతోన్మాద బీజేపీ చెప్పేటివి శ్రీరంగనీతులు చేసేటివి దుర్మార్గపు పనులని ఎద్దేవా చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్యాస్ బండపై రూ.50 పెంచడమే మహిళలకు మీరిచ్చే చిరుకానుకనా అని ప్రశ్నించారు. బీజేపీ కపట నాటకాలను, దొంగ దీక్షలు ప్రజలను నమ్మబోరని పేర్కొన్నారు.




హోలీ వేడుకల్లో నృత్యాలు చేస్తున్న కలెక్టర్ దంపతులు, సీపీ సుబ్బారాయుడు



హోలీ సంబురాల్లో ఈల వేస్తున్న మంత్రి గంగుల కమలాకర్



ఈల వేస్తున్న ఎంపీ బండి సంజయ్




నృత్యం చేస్తున్న అడిషనల్ కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్, గరిమా అగర్వాల్

సంబురంగా హోలీ

• స్టెప్పులేసిన మంత్రి, ఎంపీ, కలెక్టర్, సీపీ, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు • రంగులమయమైన నగర కూడళ్లు

కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి: హోలీ రంగ హోలీ.. చెమ్మకేలీల హోలీ అంటూ కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో మంగళవారం హోలీ సంబురాలు జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడాలేకుండా ప్రజాప్రతినిధులతో పాటు కలెక్టర్, సీపీ ఇతర ఉన్నతాధికారులు సైతం వేడుకల్లో పాల్గొని స్టెప్పులేశారు. యువత, కుర్ర కారు సందడిగా వేడుకల్లో పాల్గొన్నారు. నగర వీధులన్నీ రంగులమయమయ్యాయి. విద్యార్థుల, యువతీ, యువకుల ఆనందోత్సాహాలు.. అందరి జీవితాలు రంగుల మయం కావాలన్న ఆకాంక్షతో పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

స్టెప్పులేసిన కలెక్టర్, సీపీ

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్, సీపీ సుబ్బరాయుడులు రంగులు పూసుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డీజే పాటలకు అనుగుణంగా స్టెప్పులు వేస్తూ ఆకట్టుకున్నారు. కలెక్టర్ దంపతులు చేసిన నృత్యం ఆహుతులను అలరించింది. వేడుకల్లో అదనపు కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్, గరిమా అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో..

టీఆర్‌ఎస్ పార్టీ అధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఒక్కరికొక్కరు రంగుల నీళ్లు చల్లుకొని సంబురాలు చేసుకున్నారు. భగత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో మేయర్ సునీల్‌రావు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు,

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ ఆధ్వర్యంలో కోర్టు చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ కార్యకర్తలకు రంగులు పూసి శుభాకాంక్షలు తెలిపారు. ఈలలు, నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు.



డప్పు చప్పుళ్ల మధ్య ర్యాలీగా వెళ్తున్న పోలీసులు



కోర్టు చౌరస్తాలో బీజేపీ శ్రేణులు



రంగులు చల్లుకుంటున్న యువతులు



నగునూరులో వాటర్‌గన్స్‌తో చిన్నారుల సందడి



వేడుకల్లో వైఎస్సార్‌టీపీ నాయకులు కుమార్, శ్రీనివాస్



కలెక్టర్ దంపతులకు రంగులు పూస్తున్న సీపీ సుబ్బారాయుడు



వేడుకల్లో వాకర్స్ అసోసియేషన్ నాయకులు



మేయర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మేయర్ వై.సునీల్‌రావు





కొత్తపల్లిలో జరిగిన హోలీ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు

క్లుప్తంగా

నేటి నుంచి రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని రామచంద్రాపూర్‌కాలనీ దేవక్షపురి పంచముఖ హనుమదీశ్వర ఆలయంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాలు బుధవారం నుంచి జరుగుతాయని వైదిక కార్యక్రమాల ప్రధాన నిర్వాహకుడు, జ్యోతిష్య, వాస్తు, ఆగమశాస్త్ర పండితుడు నమిలికొండ రమణాచార్య ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు ఉదయం, సాయంత్రం వివిధ పూజలు, హోమాలు, అధివాసాలు జరుగుతాయని అన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ప్రతిష్ఠ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

నేడు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న భక్తులు

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం అర్చకులు రామక శ్రీనివాసశర్మ, మణికంఠశర్మ సామూహిక హోమం, వివిధ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. దాదాపు రూ.పది లక్షల వ్యయంతో పదిహేను గుంటల స్థలంలో ఆలయాన్ని నిర్మిస్తున్నామని గ్రామస్తులు వివరించారు. హోమంలో నంగునూర్ డిప్యూటీ తహసీల్దార్ నర్రా రుక్మిణిరెడ్డి, ఆంజనేయస్వామి విగ్రహ దాత, ప్రముఖ దర్శకుడు, సినీహీరో వినయ్ బాబు, ఉపసర్పంచ్ మట్ల శ్రీనివాస్‌రెడ్డిరాధ, మాజీ సర్పంచ్ వంగర మల్లేశంసరోజన, మాజీ ఉపసర్పంచ్ పైడిపెల్లి శ్రీనివాస్‌గౌడ్‌రజిత, తోడేటి శ్రీనివాస్, సతీష్, గంగారం, లక్ష్మినారాయణ, రాజేశ్వర్‌రెడ్డి, బత్తుల వెంకటేశం, సంపత్, భూమయ్య, లింగయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన బీఎస్పీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుమ్మరి సంపత్ మామ ఉప్పులేటి రాజయ్య అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ నిషాని రామచంద్రం సంపత్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి మంద బాలయ్య, జిల్లా అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కి బాలకిషన్, మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడో బోనగిరి ప్రభాకర్, మండల ఉపాధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి బ్రేక్

- ఆపాలంటూ కలెక్టర్ ప్రకటన
- కరీంనగర్ నియోజకవర్గంలో రూ.7.35 కోట్ల ఉపాధిహామీ పనులపై అయోమయం
- ఆందోళనలో ప్రజాప్రతినిధులు



చెర్లభూత్కూర్‌లో సీసీరోడ్డు కోసం పోసిన కంకర, ఇసుక

కరీంనగర్‌రూరల్: గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి బ్రేక్ పడింది. ఉపాధిహామీ పథకం కింద గ్రామాలకు మంజూరైన రోడ్ల పనులు వెంటనే నిలిపివేయాలన్న కలెక్టర్ నిర్ణయంతో కొందరు ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. ఇంకొందరు గండం తప్పిందని సంతోషపడుతున్నారు.

నియోజకవర్గానికి 101 సీసీ రోడ్లు

కరీంనగర్ నియోజకవర్గానికి 101 సీసీ రోడ్లు కేటాయించిన ప్రభుత్వం రూ.7.35 కోట్లు గత నెలలో మంజూరు చేసింది. కరీంనగర్ మండలంలో 73 పనులకు రూ.4.40 కోట్లు, కొత్తపల్లి మండలంలో 28 పనులకు రూ.2.95 కోట్లు కేటాయించడంతో స్థానిక ప్రజాప్రతినిధులు నిర్మాణాలు ప్రారంభించారు. ఈ నెలాఖరు వరకు పనులు పూర్తి చేయాలన్న అధికారుల ఆదేశాల మేరకు తాహెర్‌కొండాపూర్, చెర్లభూత్కూర్, ఫకీర్‌పేట, చామనపల్లి, మొగ్దుంపూర్, నగునూరు, దుర్శేడ్, మల్కాపూర్, చింతకుంట, కమాన్‌పూర్ తదితర గ్రామాల్లో ప్రజాప్రతినిధులు సీసీరోడ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. మిగతా గ్రామాల్లో అవసరమైన ఇసుక, కంకర, సిమెంట్ బస్తాలు తదితర సామగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పనులు నిలిపివేయాలంటూ గత శనివారం కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ప్రకటనతో నిరాశ చెందుతున్నారు. అయితే చేసిన పనులకు బిల్లులు వస్తాయో రావో తెలియకపోవడంతో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ కర్ణన్‌లను కలిసి, పరిస్థితిని వివరించారు. ప్రస్తుతం పూర్తయిన పనులకు బిల్లులు వస్తాయని, కొత్తగా చేయవద్దని కలెక్టర్ స్పష్టంగా చెప్పడంతో వారు కొంత ఊరట చెందారు.

20 పనుల నిబంధనే అడ్డంకి..

కేంద్ర ప్రభుత్వ 20 పనుల నిబంధన సీసీరోడ్ల నిర్మాణానికి అడ్డంకిగా మారింది. ఒక గ్రామంలో ఉపాధిహామీ నిధులతో 20 పనులకు మించి చేసేందుకు అవకాశం లేదు. ఆలోపు ఉంటేనే ఆన్‌లైన్‌లో మస్టర్ పడుతుంది, పనులు జనరేట్ అవుతాయి. అయితే ప్రతీచోట ఈ సంఖ్యకు మించి పనులుండటంతో సీసీరోడ్ల నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే అవకాశం లేకపోవడంతో బిల్లులు మంజూరయ్యే పరిస్థితి లేదు. అంతేకాకుండా కేంద్ర బడ్జెట్‌ను మించి సీసీరోడ్లకు ప్రతిపాదనలు పంపించడంతో బిల్లులు వచ్చే అవకాశం లేదని భావించిన జిల్లా అధికార యంత్రాంగం వెంటనే పనులు నిలిపివేయాలని నిర్ణయించింది.

ఎక్కువ పనులున్న గ్రామాల్లో నిర్మాణాలు వద్దు

గ్రామంలో పనులు 20లోపు ఉంటే సీసీరోడ్ల నిర్మా ణం చేసుకునేందుకు అవకాశముంది. ఆన్‌లైన్‌లో న మోదు చేయడంతోబిల్లులు మంజూరవుతున్నాయి. ఎక్కువ పనులున్న గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టవద్దు.

– బి.రమణారెడ్డి, ఏఈ, పంచాయతీరాజ్

చిత్ర కథ



చిమ్మ చీకట్లు

నగరంలోని కోతిరాంపూర్ వద్ద గల ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి వీధిదీపాలు వెలుగకపోవడంతో చిమ్మ చీకట్లు అలుముకున్నాయి. ఆ రహదారి వెంట వెళ్లే ప్రయాణికులు, పాదాచారులు ఇబ్బందులు పడ్డారు. పాలకవర్గ సభ్యులు, అధికారులు చర్యలు చేపట్టి వీధిదీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

మూఢ నమ్మకాల నిర్మూలనపై చైతన్యపర్చాలి

కరీంనగర్‌రూరల్: గ్రామీణ ప్రజల్లో మూఢ నమ్మకాల నిర్మూలనపై చైతన్యపర్చేందుకు విద్యార్థులు కృషి చేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేశ్ కోరారు. కరీంనగర్ మండలం చామనపల్లిలో వాగేశ్వరీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ముగింపు సమావేశంలో భాగంగా మంగళవారం ×మానవ విలువలు–మూఢ నమ్మకాల నిర్మూలన× పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక కాలంలో సైతం మంత్రాలు, చేతబడి పేరిట గ్రామాల్లో దాడులు చేసి మనుషులను చంపుకోవడం దారుణమని అన్నారు. విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి విద్యార్థి దశ పునాదిలాంటిదని తెలిపారు. అనంతరం నరేశ్ మ్యాజిక్ ప్రదర్శనలో భాగంగా పెద్ద కత్తిని నోట్లో పెట్టుకోవడం, పేపర్‌ను కాల్చి గోల్డ్‌రింగ్ తయారు చేయడం, నోట్లో నుంచి కలర్ పేపర్లు బయటకు తీయడం తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాత్రి వేళ క్యాంప్‌ఫైర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీశ్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్యతో పాటు లెక్చరర్లు పాల్గొన్నారు.



క్యాంప్‌ఫైర్‌లో పాల్గొన్న విద్యార్థులు

కిట్స్ అధ్యాపకులకు ప్రశంసాపత్రాలు

హుజూరాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలోని కేబీఆర్ స్టేడియంలో మంగళవారం ఫాస్టెస్ట్ ఫస్ట్ డ్రోణాస్ సన్మానోత్సవం నిర్వహించారు. హైసి(హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్ ప్రైజెస్), టాస్క్, ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు సంస్థల ఆధ్వర్యంలో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలపై శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. హుజూరాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు ఎన్. రఘు, జి.దీపక్,డా.ఎస్. రాజేంద్రప్రసాద్, డా.యోగేశ్ పుండలిక్, కె.అమర్నాథ్, డా. ఎం.శ్యామ్‌సుందర్, డా.ఎం.ప్రదీప్‌కుమార్, వి.సృజన, ఇ.స్వప్న, వి.విక్రమ్ తరగతుల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు పద్మశ్రీ బీవీఆర్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

అయప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



జమ్మికుంట: గురుస్వాములు, భక్తుల పూజలు



వెలిచాలలో శ్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు గొడపర్తి శ్రీనివాసశర్మ ఆధ్యరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపతిపూజ, అఖండ దీపారాధన, పంచగవ్యప్రాశన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురుస్వాములు సిరిమల్ల జయేందర్‌స్వామి, రాజేంద్రప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, మురళి, శ్రీను, దామోదర్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పూర్ణాహుతి హోమం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలో ఉన్న పురాతన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మంగళవారం వేదపండితులు దామెర వెంకటేశ్వరచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో పూర్ణాహుతి హోమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం నాగవెల్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల్లో అ ర్చకులు నరసింహాచార్యులు, రామాచార్యులు, లక్ష్మణాచార్యులు, హయగ్రీవాచార్యులు పాల్గొన్నారు.

చొప్పదండిలో..

చొప్పదండి: పట్టణంలో నిర్మించిన సాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణపతి పూజ పూజ, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో రుత్వికులు, అర్చకులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం, రాత్రి భజన మండలి సభ్యులు ప్రత్యేక భజనలు చేశారు. ఆలయ నిర్వాహక ట్రస్టు సభ్యులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, సర్పంచ్ సరోజన, భక్తులు, పాల్గొన్నారు.

మైక్‌సెట్ బహూకరణ



రామడుగు: గోపాల్‌రావుపేట శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి గ్రామానికి చెందిన దాత కొలిపాక సునీతగంగయ్య దంపతులు రూ.70 వేల విలువ చేసే మైక్‌సెట్ బహూకరించారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ నార్ల రమేశ్, కమిటీ సభ్యులు దోనపాటి సీతారాంరెడ్డి, ముదుగంటి రాజిరెడ్డి, ఎడవెల్లి పాపిరెడ్డి, కాసారపు బుచ్చిరాములుగౌడ్, సత్యనారాయణరెడ్డి, సత్యనారాయణ, మల్లేశంగౌడ్, శంకరయ్య పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన మెడల్స్‌తో విద్యార్థులు

హుజూరాబాద్: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో హుజూరాబాద్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షులు భూసారపు బాపురావు, జిల్లా అధ్యక్షుడు రొంటాల రాజ్‌కుమార్ తెలిపారు. హన్మకొండ జిల్లా పరకాలలో నిర్వహించిన పోటీల్లో వివిధ విభాగాల్లో 13 గోల్డ్ మెడల్స్ సాధించారని, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులు పతకాలు అందుకున్నారని వివరించారు. అనంతరం విద్యార్థులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీష్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బీఆర్ఎస్ నాయకులు వొడితెల ప్రణవ్‌బాబు, కొలిపాక శ్రీనివాస్ అభినందించారు.

క్లుప్తంగా...



మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిథల్

తల్లి పులి కోసం కూనల కలవరం

- రెండు రోజులు గడిచినా జాడలేని పెద్ద పులి
- తల్లి చెంతకు చేర్చేందుకు అధికారుల ముమ్మర ప్రయత్నాలు

ఆత్మకూరు రూరల్: ఏపీలోని నంద్యాల జిల్లా కొత్తపల్లె మండలం పెద్ద గుమ్మడాపురం శివార్లలోకి నాలుగు పిల్లలతో వచ్చిన తల్లి పులి జాడ రెండు రోజులైనా కానరాలేదు. తల్లి కోసం పులి కూనలు విలవిల్లాడుతున్నాయి. వాటిని తల్లి చెంతకు చేర్చేందుకు అటవీ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పులి కూనలు లభ్యమైన ప్రాంతంలో రెండు కిలోమీటర్ల వలయంలో 70 ఇన్‌ఫ్రారెడ్ ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. తొలుత తల్లి పులిని గుర్తించి ఆపై ఆ ప్రాంతానికి పులి కూనలను చేర్చడం ద్వారా వాటిని తల్లితో కలపడం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తల్లి పులిని గుర్తించిన తరువాత ఒక ఎన్‌క్లోజర్‌లో పులి కూనలను అదే ప్రాంతంలో ఉంచుతారు. తల్లి వాటిని గుర్తించి దగ్గరగా వస్తే కూనలను ఎన్‌క్లోజర్ నుంచి వదులుతారు.

చేరదీస్తుందో.. లేదో!

వన్యప్రాణుల్లో పెద్ద పులి, దొమ్మల గొండి (హైనా) తమ పిల్లల విషయంలో చిత్రంగా ప్రవర్తిస్తాయి. బిడ్డలకు ఏ కారణంగా అయినా మనిషి స్పర్శ తగిలితే వాటిని తిరిగి తమ దగ్గరకు రానీయవు. మరోవైపు పిల్లలను తల్లి చెంతకు చేర్చడంలో జాప్యం జరిగితే.. తల్లి వాటిని మర్చిపోయే అవకాశం కూడా ఉంటుందంటున్నారు. కాగా, మనిషి స్పర్శ తగిలితే పులులు కూనలను తిరస్కరించడం సహజమే అయినా ఇది అన్ని సందర్భాల్లో వర్తించదని నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ పేర్కొన్నారు. పులి కూనలను అత్యంత శాస్త్రీయ పద్ధతుల్లో క్షేమంగా తల్లి వద్దకు చేరుస్తామని ప్రాజెక్టు టైగర్ ఫీల్డ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి చెప్పారు.



తిరుమలలో ముగిసిన వార్షిక తెప్పోత్సవాలు

తిరుపతి అలిపిరి/తిరుమల: తిరుమలలో 5 రోజుల పాటు జరిగిన శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ముగిశాయి. చివరి రోజు శ్రీ మలయప్పస్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా తెప్పపై విహరించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల వేదపారాయణం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనల మధ్య తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది.

నెలాఖరులోగా బకాయిలు

మార్చి చివరి కల్లా రూ. మూడు వేల కోట్ల బిల్లులు చెల్లింపు

- ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం.. పెండింగ్ సమస్యలు కొలిక్కివస్తున్నాయి
- మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు సజ్జల, ఆదిమూలపు
- ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అనుకూలమే
- ఉద్యోగ సంఘాల నేతలతో చర్చల అనంతరం వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న సజ్జల, ఆదిమూలపు సురేశ్, బొప్పరాజు తదితరులు

సాక్షి, అమరావతి: ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, వారికి సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరిస్తామని ఏపీ మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆదిమూలపు సురేష్ చెప్పారు. సీఎం ఆదేశాల ప్రకారం ఈ నెలాఖరుకల్లా ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.3 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ఉద్యోగ సంఘాల నాయకులతో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్, ఆదిమూలపు సురేష్, సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్‌ఆర్) చిరంజీవి చౌదరి సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం సజ్జల, ఆదిమూలపు ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. సజ్జల మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమంపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులను కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని, అందరూ కలిసికట్టుగా పనిచేయడంవల్లే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతోందన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు కొలిక్కివస్తున్నాయని చెప్పారు. కోవిడ్‌వల్ల ఉద్యోగులకు చేయాల్సిన వాటిని కొన్నింటినీ సమయానికి చేయలేకపోయామని తెలిపారు. చర్చల ద్వారానే ఆయా సమస్యలను పరిష్కరించుకోవచ్చని వారు చెప్పారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు చర్చించేందుకే సీఎం జగన్ మంత్రివర్గ ఉపసంఘాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం ఎప్పుడూ ఉద్యోగులకు అనుకూలంగానే ఉంటుందన్నారు.

బిల్లులు పెండింగ్‌లో లేకుండా చేస్తాం

మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు సంబంధించిన అన్ని పెండింగ్ బిల్లులను మార్చి 31లోపు క్లియర్ చేస్తామన్నారు. ఇప్పటివరకు ఉన్న జీపీఎఫ్ పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామన్నారు. రిటైర్మెంట్‌కి సంబంధించి గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను పూర్తిగా చెల్లిస్తామన్నారు. మెడికల్ బిల్లుల్ని కూడా ఎటువంటి షరతులు లేకుండా చెల్లిస్తామని చెప్పారు. టీఏ, ఏపీజీఎల్ఐ కూడా ఇస్తామన్నారు. గత ప్రభుత్వంలో కూడా పరిష్కారం కాని అంశాలపైనా స్పష్టత ఇచ్చామన్నారు. రాబోయే రోజుల్లో ఏ బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూస్తామని మంత్రి చెప్పారు.

మార్చి 31లోగా పెండింగ్ బిల్లుల చెల్లింపు

ఉద్యోగులకు ఈ నెల 31లోగా రూ.3 వేల కోట్లకు పైగా పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మహిళా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 5 స్పెషల్ క్యాజువల్ లీవ్స్ ఇవ్వడానికి సుముఖత వ్యక్తంచేశారు. 2004కు ముందు ఎగ్జామ్స్ పాస్ అయిన వాళ్లకు సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారడానికి అనుమతించడానికి సానుకూలంగా స్పందించారు. వీఆర్ఏలకు డీఏ పునరుద్ధరణ, యూనివర్సిటీలు, ఇతర విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 62 ఏళ్ల వయోపరిమితి ఉత్తర్వులు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించడంతో పాటు, రెండో దశలో నియామకమైన వారికి త్వరగా ప్రొబేషన్ డిక్లరేషన్‌కు అంగీకరించారు. మేం పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచాం. వీఆర్‌వోలకు ప్రమోషన్ కోటా 75 శాతం చేయడం, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు 010 కింద వేతనాల చెల్లింపుకు డిమాండ్ చేశాం. – ఎ. వెంకట్రామిరెడ్డి, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం, ప్రభుత్వోద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు

పెండింగ్ బిల్లులు చెల్లిస్తామన్నారు

ఉద్యోగుల బిల్లుల చెల్లింపులపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించింది. డీఏ బకాయిలను రెండు క్వార్టర్లలో క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారు. రూ.3 వేల కోట్లు క్లియర్ చేస్తామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై చర్యలు తీసకుంటామని చెప్పారు. రూ.16వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే వారికి బయోమెట్రిక్ తొలగించాలని కోరాం. ఈ నెల 16న ఉద్యోగుల హెల్త్‌కార్డులకు సంబంధించి సీఎస్ దగ్గర సమావేశం ఉంది. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని కోరాం.
– బండి శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు

పెండింగ్ డీఏలపై చర్చిస్తామన్నారు

పెండింగ్ డీఏల విషయంలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. సీపీఎస్ రద్దుపైనా చాలాసేపు చర్చించాం. త్వరలో మా సంఘం కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేసుకుని ఉద్యమ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాం.
– బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ జేఏసీ అమరావతి, చైర్మన్

పరిశోధన రంగంలో పరిశ్రమలూ కీలకమే!

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
- ఐఐసీటీలో 'వన్‌వీక్.. వన్ ల్యాబ్'ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: 'కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్'సంక్షిప్త నామం సీఎస్ఐఆర్‌లో 'ఐ'ని మరింత ప్రస్ఫుటంగా ముద్రించాల్సిన సమయం ఆసన్నమైందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానా శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ వ్యాఖ్యానించారు. ఎందుకంటే దేశ పరిశోధన రంగంలో పరిశ్రమలూ (ఇండస్ట్రీస్) అత్యంత కీలకమన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సీఎస్ఐఆర్‌లలో జరుగుతున్న పరిశోధనలను ప్రజలకు, పరిశ్రమ వర్గాలకు విస్తృతంగా పరిచయం చేసేందుకు కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన మంత్రిత్వ శాఖ 'వన్ వీక్.. వన్ ల్యాబ్'పేరుతో ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. హైదరాబాద్‌లోని ఐఐసీటీలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రారంభించారు. ఈనెల 12వ తేదీ వరకూ జరిగే 'వన్ వీక్ వన్ ల్యాబ్'తొలిరోజు మంగళవారం పరిశ్రమల వర్గాలతో సమావేశాలు ఏర్పాటయ్యాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందే సీఎస్ఐఆర్ వ్యవస్థాపకులు పరిశ్రమల అవసరాన్ని, ప్రాముఖ్యతనూ గుర్తించారని, క్విట్ ఇండియా ఉద్యమానికి ఏడాది ముందే 1941లో జమ్మూలో తొలి సీఎస్ఐఆర్ పరిశోధనశాల ఏర్పాటు కావడం ఇందుకు నిదర్శనమన్నారు. సీఎస్ఐఆర్ – ఐఐసీటీ పరిశోధనలు, అభివృద్ధి చేసిన మానవ వనరుల కారణంగా హైదరాబాద్....భారతదేశంలోని ఫార్మా, బయోటెక్ రంగాల్లో ఉన్నత స్థితిలో నిలబడగలిగిందని కొనియాడారు. దేశంలో సీఎస్ఐఆర్‌కు 37 పరిశోధన సంస్థలు ఉండగా.. ఏ పరిశోధనశాలలో ఏం జరుగుతోందో చాలామందికి తెలియదని, ఈ పరిస్థితిలో మార్పు రావాలని ఆయన శాస్త్రవేత్తలను కోరారు. కార్యక్రమంలో ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస రెడ్డి, ఏఐఎంసీఓ పెస్టిసైడ్స్ లిమిటెడ్ చైర్మన్ ప్రదీప్ దవే, భారత్ బయోటెక్ ఎండీ కృష్ణ ఎల్లా, ఎంఎస్ఐ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

రంగులు కడుక్కొనేందుకు మానేరులో దిగి..

- నీటమునిగి ముగ్గురు విద్యార్థులు మృతి
- హోలీ వేడుకల్లో విషాదం.. కరీంనగర్‌లో ఘటన
- మృతుల కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున సీఎం కేసీఆర్ సాయం



ఆంజనేయులు మృతదేహం



అనిల్ మృతదేహం

తిమ్మాపూర్ (మానకొండూర్): ముగ్గురు విద్యార్థులు.. చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు. హోలీ సందర్భంగా ఉదయం కేరింతలతో రంగులు చల్లుకున్నారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తర్వాత స్నానం చేసేందుకు వెళ్లి నీటిలో మునిగి మరణించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీలోని ఒంగోలు జిల్లా చీమకుర్తి మండలానికి చెందిన పలు కుటుంబాలు 15 ఏళ్ల క్రితం కరీంనగర్‌కు వలస వచ్చి, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. ఆయా కుటుంబాలకు చెందిన వీరాంజనేయులు (16), సంతోశ్ (13), అనిల్ (14) స్థానికంగా చదువుకుంటున్నారు. మంగళవారం హోలీ సందర్భంగా ముగ్గురూ కలిసి సంబరాలు చేసుకున్నారు. ఒళ్లంతా రంగులు నిండిపోవడంతో నగర శివారులోని మానేరు వాగులో స్నానానికని వెళ్లారు. లోతు తెలియకపోవడం, ఎవరికీ ఈత రాకపోవడం, మానేరు రివర్ ఫ్రంట్ కోసం తీసిన గుంతలు ఉండటంతో ముగ్గురూ నీటమునిగారు. అక్కడే పనులు చేస్తున్న కూలీలు గమనించి రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి ఘటనాస్థలికి చేరుకొని ఈతగాళ్ల సాయంతో మృతదేహాలు వెలికితీయించారు.

కుటుంబ సభ్యుల ఆగ్రహం..

ముగ్గురు విద్యార్థుల మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మానేరు రివర్‌ఫ్రంట్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే తమ పిల్లలు మరణించారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల వద్ద ఒక సెక్యూరిటీ గార్డ్ లేదా నది చుట్టూ ఒక కంచె వేసినా తమ పిల్లల ప్రాణాలు దక్కేవని వాపోయారు. పిల్లల చావుకు కాంట్రాక్టరే కారణమంటూ ధర్నాకు దిగారు. రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

రూ.5 లక్షల పరిహారం..

మానేరు వాగులో మునిగి ముగ్గురు పిల్లలు మృతి చెందడంపై సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసులు, అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఒక్కో విద్యార్థి కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించగా మంత్రి గంగుల వ్యక్తిగతంగా మరో రూ.2 లక్షల చొప్పున ఇస్తానని తెలిపారు.

చట్టం.. మహిళకు చుట్టమే..!

- స్త్రీలందరూ తెలుసుకోవాలి..
- తోటివాళ్లకూ తెలియచెప్పాలి..
- మహిళా దినోత్సవం సందర్భంగా పలు చట్టాలపై అవగాహన



సీహెచ్. అర్చన, న్యాయవాది, నిర్మల్



నిర్మల్: మనదేశంలో మహిళలకు రక్షణ కల్పించేందుకు అనేక చట్టాలు ఉన్నాయి. మహిళల రక్షణ, అభ్యున్నతి కోసం, మన రాజ్యాంగం వారికి ప్రత్యేక హక్కులను కల్పించింది. చట్టాలపై అవగాహన ఉంటే సమాజంలో వారికి జరిగే ఏ అన్యాయానికైనా వ్యతిరేకంగా పోరాడగలరు. ఈ నేపథ్యంలోనే మహిళా దినోత్సవం సందర్భంగా నిర్మల్‌కు చెందిన మహిళ న్యాయవాది సీహెచ్.అర్చన మహిళలు హక్కులపై ను తెలుసుకోండి, వాటిని తోటి మహిళలకూ చెప్పండి అని పిలుపునిస్తున్నారు.

మహిళల కోసం చట్టాలు..

- గృహహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం (2005)భర్త, అతడి బంధువులు చేసే అన్నిరకాల గృహ హింసల నుంచి రక్షించడానికి ఈ చట్టం ఉపయోగపడుతుంది. గృహహింస శారీరక, లైంగిక, మానసిక, మౌఖిక, భావోద్వేగాలకు లోబడి ఉంటుంది.
- పని ప్రదేశంలో లైంగిక వేధింపులు, నివారణ–రక్షణ చట్టం(2013)ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలోని అన్ని కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నుంచి మహిళలకు రక్షణ కల్పిస్తుంది.
- పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక దోపిడీని సమర్థవంతంగా పరిష్కరించేందుకు లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం –2012 రూపొందించబడింది. 18 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలందరికీ లైంగిక వేధింపులు, అశ్లీల నేరాల నుంచి రక్షణ అందిస్తుంది.

ఇవి కూడా నేరాలే..

- పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఇతర పబ్లిక్ ప్రదేశాల్లో మహిళలకు సరైన టాయిలెట్ల వసతి లేకపోవడం.
- షాపింగ్‌మాల్స్ ట్రయల్ రూమ్స్, టాయ్‌లెట్స్‌లలో అలాగే సినిమాహాల్స్ వంటి పబ్లిక్ ప్రదేశాల్లో రహస్య కెమెరాలు పెట్టడం.
- బస్సుల్లో, ఇతర రద్దీ ప్రదేశాల్లో మహిళలను తాకడం, అసభ్యకరంగా మాట్లాడటం, సైగలు చేయడం, కార్యాలయాల్లో ఉద్యోగినుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం, వారిని తూలనాడడం, వేధించడం, అవమానించడం వంటివన్నీ నేరాలే. 354, 509 ఉమెన్ ఇన్‌సల్టింగ్ సెక్షన్ల కింద వీటికి శిక్ష ఉంటుంది.

- **హిందూ వారసత్వ చట్టం (1956)**
మహిళలకు పురుషులతో సమానంగా తల్లిదండ్రుల ఆస్తిని వారసత్వంగా పొందే హక్కును గుర్తిస్తుంది. ఆ తర్వాత హిందూ వారసత్వ (సవరణ) చట్టం కుమార్తెలు పూర్వీకుల ఆస్తిని వారసత్వంగా పొందే హక్కును మంజూరు చేసింది.
- **ఇండిసెంట్ రిప్రజెంటేషన్ ఆఫ్ ఉమెన్ ప్రొహిబిషన్ యాక్ట్**
ప్రకటనలు, ప్రచురణలు, రచనలు, పెయింటింగ్‌లు, బొమ్మలు మరేదైనా పద్ధతిలో మహిళలను అసభ్యంగా చూపడాన్ని నిషేధిస్తుంది.
- **ఐపీసీ 304బీ**
వరకట్న హత్యలను ఈ సెక్షన్ నేరంగా పరిగణిస్తుంది. ఈ ఘటనల్లో నేరస్తులకు ఏడేళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్షపడే అవకాశాలు ఉంటాయి.
- **ఐపీసీ 326 ఏ 326బీ**
యాసిడ్ దాడుల సంఘటనల్లో నిందితులకు ఈ సెక్షన్ల కింద ఐదేళ్లకు తగ్గకుండా యావజ్జీవ జైలుశిక్షతో పాటు జరిమానా విధించే అవకాశాలు ఉంటాయి.
- **ఐపీసీ 354**
బలప్రయోగం ద్వారా మహిళల గౌరవానికి భంగం కలిగించిన సంఘటనల్లో ఈ సెక్షన్ కింద ఏడాది నుంచి ఐదేళ్ల వరకు జైలు, జరిమానా ఉంటాయి.
- **ఐపీసీ 354ఏ**
మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడే నిందితులకు ఏడాది వరకు జైలుశిక్ష, జరిమానా లేదా రెండూ కలిపి విధించే అవకాశాలు ఉంటాయి.
- **ఐపీసీ 354బీ**
బలవంతంగా మహిళల దుస్తులను తొలగించేందుకు ప్రయత్నించడం, దుస్తులను తొలగించే ఉద్దేశంతో దాడి చేయడం నేరం. ఈ సెక్షన్ కింద మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు, జరిమానా ఉంటాయి.
- **ఐపీసీ 354సీ**
మహిళలు దుస్తులు మార్చుకుంటుండగా, స్నానం చేస్తుండగా వారిని గమనించడం, రహస్యంగా, అనుమతి లేకుండా, ఫొటోలు, వీడియోలు తీయడం ఈ సెక్షన్ కింద నేరం. దీనికి మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా విధించే అవకాశాలు ఉంటాయి.
- **ఐపీసీ 354 డీ**
ఒక మహిళ తన అయిష్టతను స్పష్టంగా తెలియజేసినా, ఆమెను అదేపనిగా వెంటాడడం, ఆమెతో మాట్లాడడానికి ప్రయత్నించడం, ఆమె సోషల్ మీడియా, ఇంటర్నెట్ కార్యకలాపాలను నిరంతరం గమనిస్తూ ఉండడం వంటి చర్యలను ఈ సెక్షన్ కింద నేరంగా పరిగణిస్తారు.
- **ఐపీసీ 366**
బలవంతపు పెళ్లి, అనైతిక శృంగారం కోసం మహిళలను కిడ్నాప్ చేయడాన్ని ఈ సెక్షన్ కింద నేరంగా పరిగణిస్తారు. ఈ నేరానికి పదేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా ఉంటాయి.
- **ఐపీసీ 372**
పద్దెనిమిదేళ్ల లోపు వయసున్న బాలికలను వ్యభిచారం, శృంగారం కోసం ఇతరులకు విక్రయించడం, ఇతరుల వద్ద డబ్బు తీసుకుని బాలికలతో వ్యభిచారం చేయించడం నేరం. ఈ నేరానికి పాల్పడే వారికి పదేళ్ల జైలు, జరిమానా ఉంటాయి.
- **ఐపీసీ 376 సీ**
అధికారం, ఉద్యోగం వంటి ఆశ చూపి మహిళను లొంగదీసుకుంటే ఈ సెక్షన్ అత్యాచారంగా పరిగణిస్తుంది. ఈ సెక్షన్ కింద ఆరేళ్ల నుంచి పదేళ్ల వరకు జైలు, జరిమానా ఉంటాయి.
- **ఐపీసీ 498 ఏ**
భర్త లేదా అతడి తరఫు బంధువులు శారీరకంగా, మానసికంగా హింసించడాన్ని ఈ సెక్షన్ నేరంగా పరిగణిస్తుంది. మూడేళ్ల జైలు, జరిమానా ఉంటాయి.
- **భార్య బతికి ఉండగానే, ఆమెకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే నేరం. దీనిని ఐపీసీ సెక్షన్ 494 ప్రకారం బైగమీ అంటారు. ఈ నేరానికి ఏడేళ్ల జైలు శిక్ష పడుతుంది.**

- **నిర్భయ యాక్ట్–2013...**
ఢిల్లీ నిర్భయ ఘటన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని (క్రిమినల్ లా అమెండ్‌మెంట్ యాక్ట్– 2013) అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఇండియన్ పీనల్ కోడ్‌లో 376ఏ చేర్చడంతో పాటు పలు మార్పులను తీసుకొచ్చింది. అత్యాచారం, మహిళలకు సంబంధించిన ఇతర నేరాల్లో నిందితులకు మరణ శిక్ష సైతం పడేలా ఇండియన్ పీనల్ కోడ్‌ను కఠినతరం చేసింది.



దోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



బ్రహ్మపుష్కరిణి కోనేరులో తెప్పోత్సవం

వైభవంగా తెప్పోత్సవం

ధర్మపురి : ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ సమీపంలోని బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో మంగళవారం బ్రహ్మోత్సవాల్లో ముఖ్యఘట్టమైన లక్ష్మీ నరసింహుడి దోలోత్సవం, తెప్పోత్సవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు పలు రాష్ట్రాలు, జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి తిలకించారు. స్వామిని దర్శించుకునేందుకు గంటల తరబడి భక్తులు బారులుతీరారు. కార్యక్రమంలో మంత్రి కొప్పుల సతీమణి స్నేహలత రేనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ రేనవేషన్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ధర్మపురి : ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఐదోరోజు ఉత్సవాలు నిర్వహించగా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. గోదావరి తీరంలోని మంగలిగడ్డ, సంతోషిమాత ఘాట్ల వద్ద మహిళలకు ప్రత్యేక బయోటాయిలెట్స్, చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పారిశుధ్య పనులు చేపట్టారు. ఎస్పీ భాస్కర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

భక్తులకు అన్నదానం..

బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చిన వేలాది మంది భక్తులకు స్థానిక బ్రాహ్మణ సంఘంలో అన్నదానం నిర్వహించారు. మొదటి డోలోత్సవం సందర్భంగా మంగళవారం సుమారు 40 వేల మంది భక్తులు వచ్చినట్లుఉంటారని అంచనా. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధర్మపురిలోని శేషప్ప కళావేదికపై చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. గోదావరిఖనికి చెందిన చంద్రికా జ్యోతి నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

'అలిశెట్టి కవితా జైత్రయాత్ర' ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: విప్లవ రచయితల సంఘం ప్రచురించిన కవితా జైత్రయాత్ర (అలిశెట్టి ప్రభాకర్), సలంద్ర కవిత్వం, చెరబండరాజు సాహిత్య సర్వస్వం పుస్తకాలను మంగళవారం కరీంనగర్ జ్యోతిబా పూలే గ్రౌండ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెరవే రాష్ట్ర అధ్యక్షుడు గాజోజు నాగభూషణం మాట్లాడుతూ, అలిశెట్టి ప్రభాకర్ మీద వచ్చిన కవితా జైత్రయాత్ర వ్యాసాలను ప్రశంసించారు. అధ్యాపకులు బుర్ర తిరుపతి చెరబండరాజు సర్వస్వాన్ని ఆవిష్కరణ చేసి మాట్లాడారు. నేటి తరానికి చెర సాహిత్యాన్ని పరిచయం చేయాల్సిన బాధ్యత రచయితల మీద ఉందన్నారు. కవి కోడం కుమారస్వామి మాట్లాడుతూ, నిజామాబాద్‌కు చెందిన సలంద్ర లక్ష్మీనారాయణ కవిత్వం మరోసారి విరసం ప్రచురణ చేయడంపై సలంద్ర అభిమానులు హర్షం వ్యక్తం చేశారని చెప్పారు. కార్యక్రమంలో విరసం నాయకులు బాలసాని రాజయ్య, చిన్నయ్య, రవీందర్, రమేశ్, నడిమెట్ల రామయ్య తదితరులు పాల్గొన్నారు.



అలిశెట్టి కవితా జైత్రయాత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

పోలీసు పిస్టల్‌తో మెకానిక్ హల్‌చల్

- స్థానికుల భయాందోళన
- పోలీసులకు సమాచారం
- కరీంనగర్‌లో ఘటన

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బోయవాడలో మంగళవారం రాత్రి బైక్ మెకానిక్ రమణాచారి తన వద్ద పిస్టల్ పెట్టుకుని మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అయితే మెకానిక్ రమణాచారి తన స్నేహితుడైన ఏఆర్ కానిస్టేబుల్(గన్‌మెన్) మార్కు మహేందర్ వద్ద ఉన్న పిస్టల్‌ను తీసుకుని తన బొడ్డు వద్ద పైకి కనిపించే విధంగా పెట్టుకుని కొద్దిసేపు అటూ ఇటూ తిరిగాడని స్థానికులు తెలిపారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే 100కు డయల్ చేయగా బ్లూకోల్ట్స్ పోలీసులు, వన్‌టౌన్ సీఐ నటేశ్ అక్కడికి చేరుకుని పిస్టల్‌ను స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏఆర్ కానిస్టేబుల్ మార్కు మహేందర్ ఐడీసీ మాజీ చైర్మన్ వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే హోలీ పండుగ రోజున గన్‌మెన్ మహేందర్, బోయవాడలోని తన స్నేహితుడు రమణాచారి వద్దకు వెళ్లి అక్కడ మరికొందరితో కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉండగానే మహేందర్ వద్ద ఉన్న పిస్టల్ తీసుకొని బయట షో చేశాడని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇద్దరు కూడా పోలీసుల అదుపులోనే ఉన్నారు. ఈ సంఘటనపై వన్‌టౌన్ సీఐని వివరణ అడగగా.. ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నామని తెలిపారు.



ఎనిమిదేళ్లవయసులో సరదాగా తండ్రితో గ్రౌండ్‌కు వెళ్ళేది. అక్కడ కొంతమంది అమ్మాయిలు క్రికెట్ ఆడుతుంటే ఎంతో ఆసక్తిగా చూసేది. ఓ రోజు తనకూ క్రికెట్ ఆడాలని వుందనే అభిలాషను వ్యక్తపరిచింది. తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో క్రికెట్ బాల్ అందుకుంది. నేడు ఏకంగా ఆంధ్రప్రదేశ్ తరపున ఉమెన్ ప్రీమియర్ లీగ్ స్థాయికి ఎదిగిపోయింది. ఇటీవల అండర్19 టీ20 వరల్డ్‌కప్‌ను భారత్ సొంతం చేసుకున్న జట్టుకు ఆడింది. ఆరేళ్లలోనే తన మీడియం పేస్‌తో ప్రత్యర్థుల్ని బెంబేలెత్తించే స్థాయికి చేరుకుంది విశాఖ ఉమెన్ క్రికెటర్ షబనమ్ మహ్మద్ షకీల్. ఆటే శ్వాసగా రాణిస్తున్న రైట్ ఆర్మ్ మీడియం పేసర్ షబ్‌నమ్ మహిళా దినోత్సవ సందర్భంగా తన అంతరంగాన్ని సాక్షితో పంచుకుంది.

క్రికెట్.. బిర్యానీ.. అంతే..!

- షబ్‌నమ్

● **క్రికెట్ ప్రస్థానం ఎలా ప్రారంభమైంది...**

2017లో క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేసవి శిబిరాల్లో పాల్గొన్నాను. నాకు మొదట్నుంచీ బ్యాటింగ్ కంటే బౌలింగ్‌లోనే ఇష్టం ఉండేది. రెండేళ్ళలో మీడియం పేసర్‌గా ఎదిగాను. పేస్‌లో వేరియేషన్స్‌తో బంతులు విసురుతుండటంతో అండర్ 16 జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. అనతికాలంలోనే ఆంధ్రజట్టుకు ఆడాను. రైల్వేస్ జట్టుతో ప్రాక్టీస్‌లో నెట్‌బౌలర్‌గా సీనియర్స్‌తో ఎలా ఆడాలో నేర్చుకున్నాను. అనంతరం ఏకంగా ఉమెన్ అండర్ 19 వరల్డ్‌కప్, జాతీయ జట్టుకు ఎంపికయ్యాను. ప్రస్తుతం ఉమెన్ ఐపీఎల్‌లో గుజరాత్ జెయింట్స్‌కు ఆడుతున్నాను.

● **చదువెలా సాగుతోంది...**

పదో తరగతి చదువుతున్నాను. ఏప్రిల్‌లో పరీక్షలున్నాయి. ఉమెన్ ఐపీఎల్ పూర్తికాగానే పరీక్షలు రాస్తాను. మా టీచర్లు ఓ ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేశారు. సబ్జెక్ట్ డౌట్స్ వివరిస్తుంటారు. ప్రాక్టీస్, పాఠాలు ఏకకాలంలో సాగుతున్నాయి. ప్రస్తుతం ఉమెన్ ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్ జెయింట్స్ తరపున ఆడుతూ ముంబయ్‌లో ఉన్నాను. ఇటీవలే అండర్ 19 ఉమెన్ వరల్డ్ కప్‌లోనూ ఆడాను.

● **ప్రస్తుత లక్ష్యం...**

సీనియర్ ఉమెన్ జట్టులో ఇండియా తరపున ఆడటమే నా లక్ష్యం. అండర్–19 వరల్డ్‌కప్‌కు ఆడిన జట్లలో నేనే చిన్నదానిని. ఇప్పుడు ప్రీమియర్ లీగ్‌లోనూ చిన్న దాన్ని. ఆంధ్రప్రదేశ్ నుంచి ఉమెన్ ఐపీఎల్‌కు ఎంపికైన తొలి క్రికెటర్‌ను. పదినేహేళ్ల ప్రాయంలోనే ఇది సాధ్యపడటం చాలా సంతోషాన్నిచ్చింది.

● **జూనియర్ వుమెన్ టీ20 వరల్డ్‌కప్‌లో...**

జూనియర్స్ వరల్డ్‌కప్ ఆడుతున్నప్పుడు, సీనియర్ల నుంచి చాలా సలహాలు తీసుకున్నాను. కోచ్‌లు సీనియర్ సభ్యులు ఎక్కువ మ్యాచ్‌లు ఆడాలని, అప్పుడే ఎక్స్‌పోజర్ వస్తుందని సూచించారు. ముందు మన బలహీనతలు తెలుసుకుని, వాటిని అధిగమించాలని కూడా చెప్పారు. అందుకు తగినట్టు గానే మ్యాచ్‌ల్లో సీనియర్స్‌ను జాగ్రత్తగా గమనిస్తున్నాను. అందరిలోకి చిన్నదాన్ని కావడంతో ఎంతో ఆప్యాయత చూపిస్తున్నారు.

● **ఇన్‌స్పిరేషన్ ఎవరు...**

జులన్ గోస్వామి ఆట తీరును జాగ్రత్తగా గమనిస్తుంటాను. ఫాస్ట్ బౌలింగ్‌లో ఆమె నా స్ఫూర్తి.

● **ఏ రంగంలో స్థిరపడాలనుకుంటున్నారు?**

యూనిఫామ్ వేసుకునే జాబ్ చేయాలనేది నా ఆకాంక్ష. దేశం పట్ల నాకు చాలా గౌరవం. డిఫెన్స్, పోలీస్ లాంటి రంగాల్లో పని చేయాలని ఉంది.

● **మీ హాబీలేంటి?**

నాకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటేనే ఇష్టం ఏర్పడటంతో మిగిలిన విషయాల పట్ల పెద్దగా ఆసక్తి కలగలేదు. అందుకే హాలిడే ఎంజాయ్ చేయాలని, ఏవైనా కొత్త ప్రదేశాలకు వెళ్లాలనే ఆలోచన కూడా రాలేదు. నాన్న షకీల్ తన జట్టుకు ఆడుతుంటే సరదాగా చెల్లెలు షాజహానాతో కలిసి కామెంటరీ చెప్పేదాన్ని. అలా సరదాగా ప్రారంభమైన నా క్రికెట్ కెరీర్ నేడు ప్రీమియర్ లీగ్, జూనియర్ వరల్డ్ కప్ ఆడేస్థాయికి చేరింది. మ్యాచ్‌లలో భాగంగా ఆయా ప్రాంతాలకు వెళ్ళాను తప్ప ప్రదేశాలను చూడడం కోసం ఎక్కడికీ వెళ్లలేదు.

● **ఏ రంగు ఇష్టం?**

నీలం రంగు అంటే ఇష్టం. లాంగ్ ఫ్రాక్స్ వేసుకుంటూ ఉంటాను. ఇక బాగా ఇష్టమైనది నిద్ర. ఖాళీ దొరికితే ఎక్కువగా పడుకుంటాను. సరదాగా మ్యాచ్‌లు చూసే స్థాయి నుంచి సీరియస్‌గా మ్యాచ్‌లాడే స్థాయికి ఎదగడంతో తీరిక అనేది ఉండటం లేదు. ఈ నెల 27న తిరిగి విశాఖ చేరుకోగానే పరీక్షలపై దృష్టి పెట్టాలి. చెస్, బ్యాడ్మింటన్ సరదాగా ఆడుతుంటాను.

● **డైట్ ఎలా?**

నాకు బిరియానీ అంటే ఇష్టం. అమ్మ రాత్రికి పుల్కాల్లో రకరకాల వంటలు చేస్తుంది. డైట్ పట్ల చాలా శ్రద్ధ వహిస్తాను. ఆహారసూచనలను పాటిస్తాను. డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తీసుకుంటాను. స్వీట్స్ జోలికి వెళ్ళను.

● **ఎలాంటి సినిమాలిష్టం?**

సినిమాల పట్ల పెద్దగా ఆసక్తి లేదు. ఇప్పటివరకు ఆట, చదువే నా లోకం. కానీ ఆటల మీద వచ్చిన సినిమాల్ని చూస్తాను. ఉదయాన్నే ఐదు గంటల కల్లా ప్రాక్టీస్ చేసుకోవడానికి గ్రౌండ్‌కు వెళ్తాను. కోచ్‌లు చెప్పిన వాటిని తూచ తప్పకుండా ఆచరించడం. వీలు దొరికినప్పుడల్లా సబ్జెక్ట్ బుక్స్ ముందేసుకు కూర్చోవడమే ప్రస్తుత నా దినచర్య.

– డాక్టర్ ఎ. సూర్యప్రకాశరావు మాడిమి, విశాఖపట్నం



స్విమ్మింగ్ చాలా ఇష్టం

పిజ్జా కూడా.. కానీ: త్రిష

తెలుగుతేజమైన గొంగడి త్రిష ఉమన్ క్రికెటర్‌గా మనందరికీ పరిచయమే. భద్రాచల వాసి త్రిష అండర్-19 వరల్డ్ కప్- 2023 ఫైనల్లో టీమిండియాను జగజ్జేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించింది. 'సీనియర్ ఉమన్ క్రికెట్ టీమ్‌లో చోటు దక్కించుకోవడమే నా నిరంతర కృషి' అని చెబుతోంది త్రిష.

ఫిట్‌నెస్ కోచ్ అయిన తండ్రి రామిరెడ్డి ద్వారా మూడేళ్ల వయసులోనే క్రికెట్‌లో ఓనమాలు దిద్దిన త్రిష ఎనిమిదేళ్ల వయసులో హైదరాబాద్ అండర్–16 జట్టులో చేరింది. ఆమెలోని ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు కూతుర్ని హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ అకాడమీలో చేర్చారు. అక్కడ నుంచి ఆమె క్రికెటర్‌గా తనను తాను మెరుగుపరుచుకుంటూ భారతజట్టులో స్థానం దక్కించుకుంది. తెలంగాణ అమ్మాయిగా భారత క్రికెట్ జట్టులో విజయకేతనం ఎగురవేస్తున్న త్రిష తన ఆసక్తులను, భవిష్యత్తు కలను ఇలా వివరించింది...

"నేను మహిళల అండర్–19 కేటగిరిరీలో టీ20 వరల్డ్ కప్‌కి ఆడాను. రాబోయే రోజుల్లో ఇండియన్ సీనియర్ ఉమెన్ క్రికెట్ టీమ్‌లో చోటు సంపాదించాలన్నది నాకల. ఆ లక్ష్యం సాధించడానికే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక తపస్సులా ప్రాక్టీస్ చేస్తున్నాను. గెలుపు ఓటమి గురించి కూడా ఆలోచించకుండా లక్ష్యం కోసం చేసే ప్రయత్నంలో ఏదీ ఒత్తిడిగా అనిపించదు.

● **ఇతర అభిరుచులు...**

నాకున్న మరో అభిరుచి స్విమ్మింగ్. ఎంతసేపైనా వదలాలనిపించదు. అమ్మాయిలకు స్విమ్మింగ్ తప్పనిసరిగా వచ్చితీరాలని. నాకు స్విమ్మింగ్ చేసిన ప్రతీసారి అనిపిస్తుంటుంది. మంచి రిలాక్సేషనిస్తుంది స్విమ్మింగ్.

● **చదువూ ముఖ్యమే..**

ఇప్పుడు 12వ తరగతి చదువుతున్నాను. చదువు, ఆటలు కొనసాగిస్తూ వెళ్లడమే. ఎందుకంటే నా ఎదుగుదలకు ఈ రెండూ ముఖ్యమే అని భావిస్తాను. అయితే, ఎక్కువ సమయం క్రికెట్ సాధనను కేటాయించినప్పటికీ ఎగ్జామ్స్‌కి ప్రత్యేకంగా ప్రిపేర్ అవుతుంటాను.

● **ఇష్టాలు ఏవైనా కల తర్వాతే..**

నాకు స్నేహితులు చాలా తక్కువ. కొందరు క్రికెట్ ఫ్రెండ్స్ ఉన్నారు. కోచ్‌లు సూచించిన డైట్‌ని కచ్చితంగా ఫాలో అవుతాను. ఏ ఆహారం తీసుకుంటే నా హెల్త్‌కి మంచిదో, ఫిట్‌నెస్ పట్ల ఎంత శ్రద్ధ తీసుకోవాలో అవన్నీ పాటిస్తాను. పిజ్జా, బర్గర్ వంటివి ఇంట్రస్ట్ ఉన్నా సరే తీసుకోను. ప్రాక్టీస్‌లోని మా క్రికెట్ టీమ్ మెంబర్స్‌తోనే టైమ్ పాస్ అవుతుంది కాబట్టి, ఇతరత్రా ఆలోచనలు కూడా ఏవీ మైండ్‌లోకి రానివ్వను.

● **ప్రోత్సాహాన్నిచ్చేవి..**

ఉమెన్ క్రికెటర్ మిథాలీరాజ్, ఎం.ఎస్ ధోనీలకు పెద్ద అభిమానిని. వారు ఆడుతున్న తీరును చూస్తూ పెరిగినదాన్ని కాబట్టి, వారు నాకు రోల్‌మోడల్స్. స్ఫూర్తిదాయకమైన వారి మాటలు నన్ను నేను మెరుగుపరుచుకోవడానికి ఉపయోగించుకుంటాను" అని తెలియజేసిన త్రిష లక్ష్య సాధనలో ఎన్నో విజయాలు దక్కించుకోవాలని కోరుకుందాం.

– నిర్మలారెడ్డి

అంతటా నేనే అన్నింటా నేనే

కంచెలు తెంచేశాం. హద్దులు చెరిపేశాం.
ఆంక్షలు తుడిచేశాం. అవరోధాలు ఎదిరించాం.
నేల, నింగి, నీరు, ఊరు... కొలువు, క్రీడ, కార్మిక వాడ...
గనులు, ఓడలు, రోదసి యాత్రలు..
పాలనలో.. పరిపాలనలో..
ఆర్థిక శక్తిలో.. అజమాయిషీలో
సైన్యంలోన సేద్యంలోన
అన్నీ మేమై... అన్నింటా మేమై...
అవకాశం కల్పించుకుంటాం.
అస్తిత్వం నిలబెట్టుకుంటాం.
స్త్రీని గౌరవించే సమాజం
స్త్రీని గౌరవించే సంస్కారం
ప్రతి ఇంటి నుంచి మొదలవ్వాలి.
ప్రతి రంగంలో పాదుకొనాలి.

అతివకు కాదేది అనర్హం



ఈమె పేరు రమాదేవి. విజయవాడ నగరం, రామలింగేశ్వర నగర్ నివాసి. భర్త వ్యసనపరుడై మరణించాడు. ఇద్దరు పిల్లలను పోషించుకోవడానికి ఇంత కష్టమైన పనిని చేయడానికి ముందుకు వచ్చింది. ఎయిర్ బ్రేక్ సిస్టమ్ మెకానిక్‌గా పని చేస్తోంది.



స్వరూపరాణిది పశ్చిమగోదావరి జిల్లా, దెందులూరు మండలం, గంగన్నగూడెం. ఆడవాళ్లు వేదాలను ఎందుకు చదవకూడదనే ప్రశ్నకు తానే జవాబుగా నిలవాలనుకుంది. వేదాలు ఔపోశన పట్టి, బ్యాంకు మేనేజర్ ఉద్యోగం నుంచి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని పౌరోహిత్యం చేస్తున్నారు.



ఆటో నడుపుతున్న సరస్వతి సుమతిది నెల్లూరు నగరం. ఇంటర్ వరకు చదువుకున్న సుమతి పిల్లల పోషణ కోసం ఆటో నడుపుతూ, పిల్లలతో పాటు చదువును మళ్లీ మొదలు పెట్టి బీఎల్ పూర్తి చేసింది.



నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం పులికల్లు సర్పంచ్ గొడ్డేటి వెంకటసుబ్బమ్మ... పొలం దుక్కి దున్నడంతోపాటు నిమ్మచెట్లకు తెగుళ్లు సోకితే స్ప్రేయర్‌తో క్రిమిసంహారక మందులను స్వయంగా పిచికారి చేస్తుంది.



కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో పెట్రోలు బంకులో పెట్రోలు పడుతున్న పగిడేల ఉమా మహేశ్వరి.

నాడు కూలీ... నేడు ఓనర్...

స్టీరింగ్ తిప్పింది



ట్రాక్టర్ నడుపుతున్న బడియా సావిత్రిది శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం డొంకూరు గ్రామం. మత్స్యకార కుటుంబానికి చెందిన సావిత్రి పెద్దగా చదువుకోలేదు. కుటుంబ పోషణ కోసం ట్రాక్టర్ కూలీగా పనిచేసేది. ఆడవాళ్లు కార్లు, బైక్‌లు, బస్సులు, రైళ్లు, విమానాలు నడుపుతున్నారు, ట్రాక్టర్ కూడా నడపవచ్చు అనుకుంది. డ్రైవింగ్ నేర్చుకుంది. తనకు సొంతంగా ట్రాక్టర్ ఉంటే బావుణ్నని కలగన్నది. స్వయంసహాయక బృందంలో సభ్యురాలు కావడంతో గత ఏడాది ఆమెకు 'స్త్రీ నిధి' నుంచి 80వేలు, గ్రామ సంఘం నుంచి లక్ష రూపాయల లోన్ వచ్చింది. ఆ డబ్బు డౌన్ పేమెంట్‌గా కట్టి వాయిదాల పద్ధతిపై ట్రాక్టర్ కొన్నది. ప్రస్తుతం తన ట్రాక్టర్‌ను తానే నడుపుతూ వ్యవసాయ పనులు, ఇతరత్రా పనులు చేసుకుంటోంది సావిత్రి.

కాచరమైన కళమ్మ ఉండేది కుషాయిగూడ హైదరాబాద్‌లో. మొదట భవన నిర్మాణ కార్మికురాలిగా ఉన్న కళమ్మ 30 ఏళ్లుగా ఇండ్లకు, దేవాలయాలకు పెయింటింగ్ వేస్తోంది.



మదనపల్లె పట్టణంలో రేణుక... డ్రైవింగ్ స్కూల్‌లో స్వయంగా తానే మహిళలకు డ్రైవింగ్ నేర్పిస్తోంది.





యదళ్ళపల్లి ఆదిలక్ష్మి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సుజాతనగర్‌లో ఉంటుంది. గత 5 ఏళ్లుగా మెకానిక్‌గా పనిచేస్తోంది.

డోలు కొట్టి ఘనత చాటింది

ఆంధ్రప్రదేశ్‌లో ఆ అమ్మాయికి డోలు నేర్పించడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపలేదు. కట్ చేస్తే... సీన్ మారింది! సోమవారం హైదరాబాద్‌లో విమెన్స్ డే సందర్భంగా తెలంగాణ గవర్నర్ తమిళి సై ఆ అమ్మాయిని ఘనంగా సన్మానించారు. ఆమే **లలితా మనీషా!** ఆమె పరిచయం...



సోమవారం, మార్చి 6న హైదరాబాద్ రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళి సై కొంత మంది మహిళలకు సత్కారం చేస్తున్నారు. అదే సందర్భంగా ఏర్పాటైన గాత్ర కచ్చేరిలో అందరి దృష్టి లలిత మనీషా మీద పడింది. అందుకు కారణం ఆమె డోలు వాద్యం పై విన్యాసం చేస్తూ ఉండటమే. తెలుగునాట నాదస్వరం వాయించే స్త్రీలు కొద్దిమందైనా ఉన్నారు. కాని డోలు వాయించే వారు అతి తక్కువ. రెండు రాష్ట్రాలకు కలిసి డోలు విద్వాంసురాలిగా ఇటీవల గుర్తింపు పొందుతున్నది 24 ఏళ్ల లలిత మనీషా.

తెనాలి అమ్మాయి

లలిత మనీషాది తెనాలి. వీరి తల్లి మస్తాన్‌బీ, తండ్రి షేక్ వెంకటేశ్వర సాహెబ్ నాదస్వర విద్వాంసులు. ఇద్దరూ వందలాది ప్రదర్శనలు ఇచ్చారు. మస్తాన్ బీ వంశంలో 300 వందల ఏళ్లుగా నాదస్వరం కొనసాగుతూ ఉంది. అయితే డోలు వాయించిన మహిళలు లేరు. మస్తాన్ బీకి ఇద్దరు కూతుళ్లు. పెద్దమ్మాయి నాగ భ్రమరాంబ గాత్ర విద్వాంసురాలిగా శిక్షణ తీసుకుంది. ఇప్పుడు చదువు నిమిత్తం అమెరికా వెళ్లింది. చిన్నమ్మాయి లలిత మనీషా డోలు నేర్చుకోవడంలో ఆసక్తి చూపింది. 'నేను ఏడవ తరగతి చదువుతున్నప్పుడు వరసకు వదిన అయ్యే ఒకామె డోలు నేర్చుకోవడానికి ప్రయత్నించింది. ఆమెకు రాలేదు. నేను నేర్చుకోవడానికి ప్రయత్నించాను. నాకు వచ్చేసింది. డోలు వాయిద్యానికి తాళంతో పాటు శక్తి కూడా కావాలి. నాలో అవి రెండూ గమనించి మా అమ్మా నాన్నలు ప్రోత్సహించారు' అంటుంది మనీషా.



తెలంగాణ గవర్నర్ తమిళి సై చేతుల మీదుగా సన్మానం అందుకుంటూ...

కుంభకోణం వెళ్లి

డోలు వాయిద్యాన్ని సాధన చేయాలంటే ఇక్కడ అనుకూలంగా లేదని తొమ్మిదో తరగతి డిస్కంటిన్యూ చేసి కుంభకోణంలో డోలు విద్వాంసుడు టి.ఆర్.సుబ్రహ్మణ్యం దగ్గర సంవత్సరం పాటు శిష్యరికం చేసింది లలిత మనీషా. గురువు ఇంట్లోనే ఉంటూ డోలు నేర్చుకుని వచ్చింది. ఆ తర్వాత తెలుగు యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ కోర్సు, డిప్లమా కూడా పూర్తి చేసింది. డిగ్రీ ఉండాలి కనుక బీసీఏ చేసి డోలు వాయిద్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలనుకుంది. ఆ కోర్సు అన్నామలై యూనివర్సిటీ కింద చిదంబరంలో ఉంది. 'అక్కడ మా బేచ్‌లో మొత్తం 50 మంది విద్యార్థులు ఉంటే నేనొక్కదాన్నే అమ్మాయిని. అందుకని నన్ను అందరూ బాగా చూసుకునేవారు. మిగతా దక్షిణాది రాష్ట్రాలతో పాటు తమిళనాడులో కూడా డోలు వాద్యం మగవారిదే అని భావించడం వల్ల ఇప్పటి వరకూ ఒక్క ఆడపిల్ల కూడా ఆ కోర్సు చేయలేదు. దాంతో మొత్తం దేశంలోనే డోలు వాయిద్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన ఏకైక అమ్మాయిగా నేను నిలిచాను' అంటుంది మనీషా. నిజంగా ఇది తెలుగు వారి గర్వకారణమే.

మంగళవాయిద్యం

డోలు, సన్నాయి మంగళకరమైన వాయిద్యాలు. దక్షిణ భారతంలో శుభకార్యక్రమాలకు సన్నాయి మేళం తప్పనిసరి. అయితే కర్నాటక సంగీతంలో కూడా సన్నాయి, డోలు ప్రాశస్త్యం మెండుగా ఉంది. డోలు సహ వాయిద్యంగా ఉంటోంది. 'గాత్ర కచ్చేరిలో గాని వయొలిన్, ఫ్లూట్ కచ్చేరిలో గాని మృదంగాన్ని సహ వాయిద్యంగా తీసుకుంటారు. డోలును కూడా తీసుకునేవారు ఉంటారు. కర్నాటక సంగీతంలో డోలు వాయిద్యకారిణిగా నేను గుర్తింపు పొందాలనుకుంటున్నాను. డోలు వాయించడానికి 108 రకాల తాళాలు ఉన్నాయి. ఉద్దండులు లోతుకు వెళితే ఇంకా వినూత్న తాళాలు వేస్తారు. నేను ఇప్పటి వరకూ 35 రకాల తాళాలు డోలు మీద వేయగలను. మా అమ్మా నాన్నలతో కలిసి అనేక కచ్చేరీలు చేస్తున్నాను. శ్రీశైలం, భద్రాచలం, హరిద్వార్, పూరీ, ద్వారకా, కాశీ పుణ్యక్షేత్రాలలో కచ్చేరీలు ఇచ్చాను. అలాగే తమిళులు డోలు, సన్నాయి కచ్చేరీలను ఇష్టపడతారు. వారి ఆహ్వానం మేరకు మదురై, తంజావూరు... ఇలా అనేక నగరాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. ఇంకా నేను చాలా సాధించాల్సి ఉంది' అంది మనీషా.

– ఇన్‌పుట్స్: **బి.ఎల్.నారాయణ**, సాక్షి, తెనాలి



స్కీట్‌లో గనీమత్ జాతీయ రికార్డు సమం

ప్రపంచకప్ షాట్‌గన్ షూటింగ్ టోర్నమెంట్‌లో మహిళల స్కీట్ ఈవెంట్‌లో భారత షూటర్ గనీమత్ సెఖోన్ జాతీయ రికార్డును సమం చేసింది. దోహాలో జరుగుతున్న ఈ టోర్నీలో చండీగఢ్‌కు చెందిన 22 ఏళ్ల గనీమత్ క్వాలిఫయింగ్‌లో 125 పాయింట్లకుగాను 120 పాయింట్లు స్కోరు చేసింది. అయితే ఆమె ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. షూట్ ఆఫ్‌లో గనీమత్ గురి తప్పి టాప్–8లో నిలువలేకపోయింది. భారత్‌కే చెందిన దర్శన రాథోడ్ 117 పాయింట్లతో 25వ స్థానంలో, మహేశ్వరి చౌహాన్ 116 పాయింట్లతో 28వ స్థానంలో నిలిచారు.

మెయిన్ 'డ్రా'కు ప్రణవ్ రావు అర్హత

థాయిలాండ్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ కుర్రాడు గంధం ప్రణవ్ రావు మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. బ్యాంకాక్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ప్రణవ్ రావు 15–21, 21–14, 21–17తో చాంగ్ షి చియె (చైనీస్ తైపీ)పై గెలుపొంది ముందంజ వేశాడు. భారత్‌కే చెందిన హేమంత్ గౌడ, రవి కూడా మెయిన్ 'డ్రా'లోకి అడుగు పెట్టారు.



లానింగ్, జొనాసెన్ చెలరేగగా...

ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం ● 42 పరుగులతో యూపీ ఓటమి ● మహిళల ప్రీమియర్ లీగ్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్ మరోసారి భారీ స్కోరుతో విజయాన్ని అందుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఢిల్లీ 42 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌పై జయభేరి మోగించింది. ముందుగా క్యాపిటల్స్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 211 పరుగుల స్కోరు చేసింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (42 బంతుల్లో 70; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జెస్ జొనాసెన్ (20 బంతుల్లో 42 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన యూపీ వారియర్స్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 169 పరుగులకే పరిమితమైంది. సహచరులు తడబడినా... తాహ్లియా మెక్‌గ్రాత్ (50 బంతుల్లో 90 నాటౌట్; 11 ఫోర్లు, 4 సిక్సర్లు) అసాధారణ పోరాటం చేసి అజేయంగా నిలిచింది.

లానింగ్ అర్ధ సెంచరీ

తొలి రెండు ఓవర్లు నెమ్మదిగా ఆడిన ఓపెనర్లు లానింగ్, షఫాలీ ఆ తర్వాత భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. షబ్నిమ్ ఐదో ఓవర్లో లానింగ్ ఒక సిక్స్, రెండు బౌండరీలతో 16 పరుగులు పిండుకుంది. రాజేశ్వరి వేసిన ఆరో ఓవర్లో షఫాలీ ఫోర్ కొడితే లానింగ్ మూడు బౌండరీలతో రెచ్చిపోయింది. పవర్ ప్లేలో ఢిల్లీ స్కోరు 62/0. మరుసటి ఓవర్లోనే షఫాలీ (17; 1 ఫోర్, 1 సిక్స్) ఆటను తాహ్లియా ముగించగా, మెగ్ లానింగ్ మాత్రం తన ధాటిని కొనసాగించి 32 బంతుల్లో (7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించింది. తర్వాత కాసేపు వాన ఆటంకపరిచింది. ఆట తిరిగి మొదలయ్యాక 11వ ఓవర్లో ఢిల్లీ స్కోరు 100 దాటింది. స్వల్ప వ్యవధిలో మరిజన్ (16; 2 ఫోర్లు), లానింగ్ నిష్క్రమించారు. తర్వాత వచ్చిన జెమిమా (22 బంతుల్లో 34 నాటౌట్; 4 ఫోర్లు), క్యాప్సీ (10 బంతుల్లో 21; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కూడా ఢిల్లీ వేగాన్ని కొనసాగించారు. ఆఖర్లో జొనాసెన్ భారీ సిక్సర్లతో విరుచుకుపడింది. దీంతో ఆఖరి 4 ఓవర్లలో ఢిల్లీ 58 పరుగులు సాధించడంతో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 200 మార్క్ దాటింది.


జొనాసెన్


లానింగ్

మెక్‌గ్రాత్ ఒంటరి పోరాటం

కొండంత లక్ష్యం ముందుంటే యూపీ వారియర్స్ టాపార్డర్ నిర్లక్ష్యంగా వికెట్లను పారేసుకుంది. కెప్టెన్ అలీసా హీలీ (17 బంతుల్లో 24; 5 ఫోర్లు), శ్వేత (1), కిరణ్ నవ్‌గిరే (2) 'పవర్ ప్లే'లోనే పెవిలియన్‌కెళ్లారు. తర్వాత వచ్చిన వారిలో తాహ్లియా ఒంటరిపోరాటం చేసింది. దీప్తి శర్మ (12), దేవిక వైద్య (21 బంతుల్లో 23; 2 ఫోర్లు)లు దూకుడుగా ఆడబోయి వెనుదిరిగారు. బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపించిన జొనాసెన్ స్పిన్ బౌలింగ్‌తో యూపీని చావుదెబ్బ తీసింది. మెక్‌గ్రాత్ 36 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న మెక్‌గ్రాత్... ఆఖరి ఓవర్లలో ఆమె ఫోర్లు, సిక్సర్లు బాదడంతో యూపీ 150 పైచిలుకు స్కోరు చేయగలిగింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

గుజరాత్ జెయింట్స్ X బెంగళూరు

రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: మెగ్ లానింగ్ (బి) రాజేశ్వరి 70; షఫాలీ (సి) నవ్‌గిరే (బి) తాహ్లియా 17; మరిజన్ (సి) దీప్తిశర్మ (బి) ఎకిల్‌స్టోన్ 16; జెమిమా నాటౌట్ 34; క్యాప్సీ (సి) ఎకిల్‌స్టోన్ (బి) షబ్నిమ్ 21; జొనాసెన్ నాటౌట్ 42; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం** (20 ఓవర్లలో 4 వికెట్లకు) 211. **వికెట్ల పతనం:** 1–67, 2–96, 3–112, 4–144.

బౌలింగ్: షబ్నిమ్ 4–0–29–1, అంజలీ 3–0–31–0, రాజేశ్వరి గైక్వాడ్ 2–0–31–1, తాహ్లియా మెక్‌గ్రాత్ 3–0–37–1, దీప్తిశర్మ 4–0–40–0, సోఫీ ఎకిల్‌స్టోన్ 4–0–41–1.

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: హీలీ (సి) జెమిమా (బి) జొనాసెన్ 24; శ్వేత (సి) తానియా (బి) మరిజన్ 1; కిరణ్ నవ్‌గిరే (సి) క్యాప్సీ (బి) జొనాసెన్ 0; తాహ్లియా మెక్‌గ్రాత్ నాటౌట్ 90; దీప్తిశర్మ (సి) రాధ (బి) శిఖా 12; దేవిక (సి) రాధ (బి) జొనాసెన్ 23; సిమ్రన్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 169. **వికెట్ల పతనం:** 1–29, 2–31, 3–31, 4–71, 5–120.

బౌలింగ్: మరిజన్ 4–1–29–1, శిఖాపాండే 4–0–18–1, జెస్ జొనాసెన్ 4–0–43–3, నోరిస్ 2–0–25–0, క్యాప్సీ 4–0–25–0, రాధ 1–0–11–0, అరుంధతి 1–0–14–0.

ఆఖరి పోరుకు జోరుగా సాధన

నెట్స్‌లో శ్రమించిన భారత ఆటగాళ్లు

అహ్మదాబాద్: బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో చివరి అంకానికి ముందు భారత జట్టు సాధన జోరందుకుంది. ఆస్ట్రేలియాతో గురువారంనుంచి జరిగే నాలుగో టెస్టుకు రెండు రోజుల పాటు టీమిండియా ఆటగాళ్లు నెట్స్‌లో సుదీర్ఘ సమయం పాటు ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. నిజానికి మంగళవారం 'ఆప్షనల్ ప్రాక్టీస్' అయినా సరే జట్టు ఆటగాళ్లంతా సాధనకు మొగ్గు చూపారు. ముఖ్యంగా చాలా కాలంగా టెస్టుల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న విరాట్ కోహ్లి ఎక్కువ సేపు ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టాడు. వేర్వేరు పిచ్‌లపై అతను దాదాపు రెండు గంటల పాటు నిరంతరాయంగా సాధన చేయడం విశేషం. మరో వైపు అందరి దృష్టి వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌పై నిలిచింది. కోచ్ ద్రవిడ్ ప్రత్యేకంగా కిషన్ ప్రాక్టీస్‌పై దృష్టి పెడుతూ సూచనలు ఇచ్చాడు. ఇండోర్ టెస్టు అనుభవం తర్వాత భారత టీమ్ మేనేజ్‌మెంట్ ఈ సారి బ్యాటింగ్ పిచ్‌ను కోరుకున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే కిషన్ దూకుడైన ఆట జట్టుకు అదనపు ప్రయోజనం కలిగించవచ్చని భావిస్తున్నారు. వికెట్ కీపర్‌గా ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ భరత్ అద్భుతంగా ఆకట్టుకున్నా... అతని బ్యాటింగ్ సంతృప్తికరంగా లేదనే వాదన వినిపిస్తోంది. ఐదు ఇన్నింగ్స్‌లలో కలిపి భరత్ 57 పరుగులే చేశాడు. కీలక సమయాల్లో భరత్ బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడలేదు కాబట్టి కిషన్‌కు అవకాశం దక్కవచ్చని సమాచారం. అయితే కోచ్ ద్రవిడ్ దీనిపై మాత్రం ఎలాంటి స్పష్టతనివ్వలేదు. తీవ్ర ఒత్తిడి మధ్య, సవాల్‌తో కూడుకున్న పరిస్థితుల్లో భరత్ బాగా కీపింగ్ చేశాడని ప్రశంసించాడు. మరో వైపు మంగళవారం భారత జట్టు సభ్యులంతా ఆడి పాడి హోలీ పండుగను వేడుకగా జరుపుకున్నారు.


టీమ్ బస్సులో భారత క్రికెటర్లు కోహ్లి, రోహిత్, గిల్ హోలీ సంబరాలు

డబ్ల్యూటీసీ పాయింట్ల కోసమే...

ఇండోర్ పిచ్‌ను ఐసీసీ 'నాసిరకం'గా తేల్చి మూడు డీమెరిట్ పాయింట్లు శిక్షగా విధించడంపై కోచ్ రాహుల్ ద్రవిడ్ ఆచితూచి స్పందించాడు. మ్యాచ్ రిఫరీకి తన నివేదిక ఇచ్చే అధికారం ఉందన్న ద్రవిడ్...ప్రపంచవ్యాప్తంగా కూడా పిచ్‌లు ఇదే తరహాలో ఉంటున్నాయని గుర్తు చేశాడు. 'ఇప్పుడు ప్రతీ సిరీస్‌లో సాధించే వరల్డ్ టెస్టు చాంపియన్ పాయింట్లు ఎంతో కీలకంగా మారాయి. అందుకే అన్ని జట్లు డ్రా కోసం ఫలితం తేల్చే పిచ్‌లు కావాలనే కోరుకుంటున్నాయి. స్వదేశంలో అయితే తమకు కాస్త అనుకూలించే వికెట్ తయారు చేసుకోవడం సహజమే. ఏ టీమ్ అయినా ఒక టెస్టులో గెలిచి 12 పాయింట్లు సాధించాలని కోరుకుంటుంది తప్ప డ్రా చేసుకొని 4 పాయింట్లతో సరిపెట్టుకోదు. భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా అన్ని చోట్లా ఇదే పరిస్థితి ఉంది. మేం దక్షిణాఫ్రికాలో ఆడినప్పుడు ఆ పిచ్‌లు స్పిన్నర్లకు అసలు ఏమాత్రం అనుకూలించలేదు' అని ద్రవిడ్ వ్యాఖ్యానించాడు.

శ్రీజ ముందంజ

సింగపూర్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) సింగపూర్ స్మాష్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మెయిన్ 'డ్రా' బెర్త్‌కు విజయం దూరంలో నిలిచింది. మంగళవారం జరిగిన మహిళల క్వాలిఫయింగ్ సింగిల్స్ తొలి మ్యాచ్‌లో జాతీయ చాంపియన్ శ్రీజ 11–5, 8–11, 11–8, 12–10తో చార్లోటి లుట్జ్ (ఫ్రాన్స్)పై గెలిచింది. నేడు జరిగే క్వాలిఫయింగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో దక్షిణ కొరియాకు చెందిన జూ చెన్‌హుయ్‌తో శ్రీజ ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో శ్రీజ గెలిస్తే మెయిన్ 'డ్రా'కు చేరుకుంటుంది.



రష్మిక జోడీ ఓటమి

బెంగళూరు: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీ డబుల్స్ విభాగంలో హైదరాబాద్ క్రీడాకారిణులు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, సహజ యామలపల్లిలకు నిరాశ ఎదురైంది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రష్మిక–వైదేహి (భారత్) ద్వయం 6–7 (5/7), 7–5, 5–10తో హెసీ అమండైన్ (ఫ్రాన్స్)–దాలియా జకుపోవిచ్ (స్లొవేనియా) జోడీ చేతిలో... సహజ–సోహా సాదిక్ (భారత్) ద్వయం 4–6, 6–7 (3/7)తో ఎలీనా టియోడోరా (రొమేనియా)–డయానా మర్సిన్‌కెవికా (లాత్వియా) జోడీ చేతిలో ఓడిపోయాయి. రెండో సీడ్ అంకిత రైనా–రుతుజా భోస్లే (భారత్) ద్వయం 5–7, 6–3, 10–6తో షర్మదా బాలు (భారత్)–సారా రెబెకా (జర్మనీ) జోడీని ఓడించి క్వార్టర్ ఫైనల్‌లోకి ప్రవేశించింది.

బెంగళూరును గెలిపించిన ఛెత్రి



ముంబై: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) మొదటి సెమీ ఫైనల్ తొలి అంచెలో ముంబై సిటీ ఎఫ్‌సీపై బెంగళూరు ఎఫ్‌సీ పైచేయి సాధించింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బెంగళూరు 1–0 గోల్ తేడాతో ముంబైని ఓడించింది. మ్యాచ్ 79వ నిమిషంలో స్టార్ ఆటగాడు సునీల్ ఛెత్రి చేసిన ఏకైక గోల్‌తో బెంగళూరు విజేతగా నిలిచింది. అయితే ఈ గెలుపుతో బెంగళూరు ఫైనల్ చేరడం ఖాయం కాలేదు. ఇంటా, బయటా పద్ధతిలో ఒక సెమీస్ మ్యాచ్‌ను రెండు అంచెలుగా నిర్వహిస్తుండగా... ఇరు జట్లు ఆదివారం బెంగళూరులో జరిగే రెండో అంచె పోరులో మళ్లీ తలపడతాయి. మరో వైపు రెండో సెమీఫైనల్లో భాగంగా గురువారం హైదరాబాద్ ఎఫ్‌సీ, ఏటీకే మోహన్ బగాన్ మధ్య గురువారం హైదరాబాద్‌లో తొలి అంచె మ్యాచ్ జరుగుతుంది.

మెయిన్ 'డ్రా'కు తస్నీమ్

ముల్హీమ్: జర్మన్ ఓపెన్ బీడబ్ల్యూఎఫ్ సూపర్ 300 టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడి సుమీత్ రెడ్డి – అశ్విని పొన్నప్ప ఆట ముగిసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లోనే సుమీత్ – అశ్విని 10–21, 12–21 తేడాతో స్కాట్లాండ్‌కు చెందిన ఆడమ్ హాల్ – జూలీ మాక్‌ఫెర్సన్ చేతిలో పరాజయంపాలయ్యారు. మరో వైపు మహిళల సింగిల్స్‌లో తస్నీమ్ మీర్ మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో తస్నీమ్ 24–22, 21–8 స్కోరుతో రాచెల్ దరాగ్ (ఐర్లాండ్)ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో మాత్రం శంకర్ ముత్తుసామి మెయిన్ డ్రాకు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. చివరి క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ముత్తుసామి 21–23, 19–21తో రెస్కీ డ్వికాయో (అజర్‌బైజాన్) చేతిలో ఓడాడు.

సినిమా


● హంసా నందిని

చిరునవ్వుతో పోరాడా - హంసా నందిని

"కేన్సర్ అని నిర్ధారణ అయ్యాక గతం తాలూకు భయాలు, అయోమయాలు, ఒత్తిడి... అన్నీ మళ్లీ నన్ను చుట్టుముట్టినట్లు అనిపించింది. పలుమార్లు వైద్య పరీక్షలు, పలు స్కానింగ్స్ చేయించుకుని, శస్త్ర చికిత్స పూర్తయ్యాక ఇక ఏ భయం లేదు అనుకుంటున్న సమయంలో మరో రొమ్ముకి కూడా కేన్సర్ సోకే ప్రమాదం ఉందని నిర్ధారణ అయింది. మళ్లీ పోరాటం ఆరంభం" అని హంసా నందిని చెప్పారు. 2020లో ఆమెకు గ్రేడ్ 3 'కార్సినోమా' (రొమ్ము కేన్సర్) నిర్ధారణ అయింది.
ఈ మహిళా దినోత్సవం సందర్భంగా హంసా నందిని ఆ సంగతులు పంచుకున్నారు.

"18 ఏళ్ల క్రితం మా అమ్మగారికి బ్రెస్ట్ కేన్సర్ అని నిర్ధారణ అయింది. దురదృష్టం కొద్దీ ఆ పోరాటంలో ఆమె ఓడిపోయారు. ఇక నాకు కేన్సర్ నిర్ధారణ అయ్యాక 9 సార్లు కీమోథెరపీ జరిగింది. ఈ క్లిష్ట పరిస్థితి ముగిసిందనుకున్నాను. కానీ ఆ ఆనందం కొన్నాళ్లే. ఎందుకంటే 'బీఆర్‌సీఏ1' (వంశ పారంపర్య రొమ్ము కేన్సర్) అని, జీవితంలో మరో రొమ్ముకి కూడా 70 శాతం కేన్సర్ సోకే ప్రమాదం ఉందని తేలింది. దాంతో పలు శస్త్ర చికిత్సలు, మరో ఏడు సార్లు కీమోథెరపీ చేయించుకోవాల్సి వచ్చింది. నిజానికి ఇది ఎంతో సవాల్‌తో కూడుకున్నది. అందుకే 'చిరునవ్వుతో పోరాడాలి. మళ్లీ స్క్రీన్ మీద (నటించాలి) కనబడాలి. ఇతరులకు స్ఫూర్తిగా నిలిచేలా మన జీవితం గురించి చెప్పాలి' అని నాకు నేనుగా వాగ్దానం చేసుకున్నాను. నేను జీవించడానికి, ఆరోగ్యంగా ఉండడానికి ముందుగా రోగ నిర్ధారణ కావడం, మంచి డాక్టర్లు, నా ఫ్యామిలీ, నా పాజిటివ్ మైండ్ కారణం. గత నవంబర్‌లో షూటింగ్ సెట్లోకి కూడా అడుగుపెట్టాను.

ఎప్పటికప్పుడు అందరూ రెగ్యులర్ చెకప్స్ చేయించుకోండి. నేను సజీవంగా ఉన్నందుకు ఈ విశ్వానికి ధన్యవాదాలు చెబుతున్నాను. కీమోథెరపీ చేయించుకుంటున్నప్పుడు నాకు నేనుగా ఓ ప్రామిస్ చేసుకున్నాను. 'ప్రతి నిమిషాన్ని ఇదే చివరి నిమిషం అనుకుని బతకాలన్నది' ఆ ప్రామిస్. ఈ సందర్భంగా మా అమ్మగారి పేరు మీద 'యామినీ కేన్సర్ ఫౌండేషన్'ని ఆరంభించాలనుకుంటున్న విషయాన్ని ఆనందంగా పంచుకుంటున్నాను.

మరోసారి ఆర్‌ఆర్‌ఆర్



'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది మార్చి 25న విడుదలైన విషయం తెలిసిందే. ఈ సినిమా మళ్లీ ఈ నెల (మార్చి) 10న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రీ రిలీజ్ కానుంది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ నెల 12న లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న 95వ ఆస్కార్ ప్రదానోత్సవం సందర్భంగా 'ఆర్‌ఆర్‌ఆర్'ను రీ రిలీజ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే ఈ మూవీలోని 'నాటు నాటు' పాట 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఆస్కార్‌కు నామినేట్ అయిన సంగతి తెలిసిందే.


● అలీ, న్యాయమూర్తి నందా, శ్రీలేఖ, కోటి, విజయేంద్రప్రసాద్

అందుకే మ్యూజిక్ డైరెక్టర్ అయ్యింది - విజయేంద్ర ప్రసాద్

"చిన్నప్పుడు నేను శ్రీలేఖకు ఒక ఆశ చూపించాను. ఆ ఆశ కోసమే తను మ్యూజిక్ డైరెక్టర్ అయ్యింది. మంచి పాటలతో ప్రేక్షకులను అలరించింది. శ్రీలేఖ అన్న కీరవాణి సంగీతంలో ఆస్కార్ రేసులో ఉన్నారు. తన అన్నలానే శ్రీలేఖ కూడా ఆస్కార్ అంతటి అవార్డు అందుకోవాలి" అన్నారు రచయిత, ఎంపీ విజయేంద్ర ప్రసాద్. 'నాన్నగారు' (1994) సినిమాతో సంగీత దర్శకురాలిగా పరిచయమైన శ్రీలేఖ ఇప్పటి వరకూ 5 భాషల్లో 80 చిత్రాలకుపైగా సంగీతం అందించారు. ఆమె సినిమా రంగంలోకి వచ్చి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 25 దేశాల్లో 25మంది సింగర్స్‌తో ఈ నెల 17 నుంచి 'వరల్డ్ మ్యూజిక్ టూర్'ని స్టార్ట్ చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీలేఖ మాట్లాడుతూ– "ఇండస్ట్రీకి వచ్చి ఇన్నేళ్లయినా ఇప్పటికీ అద్దె ఇంట్లోనే ఉంటున్నాను. ఆస్తులు సంపాదించకపోయినా నా పాటలతో ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకోవడం హ్యాపీగా ఉంది" అన్నారు.

నా పాత్ర సరికొత్తగా ఉంటుంది - వెంకటేశ్


● రానా, వెంకటేశ్


"ఒక నటుడిగా కొత్త పాత్రలు చేయాలని ఎప్పుడూ ఉంటుంది. 'రానా నాయుడు'లో నాగ నాయుడు పాత్రలో కొత్తగా చేయడానికి అవకాశం దొరికింది. ఇలాంటి పాత్రని నేను గతంలో చేయలేదు. సరికొత్తగా ఉండే నా పాత్ర ప్రేక్షకులకు నచ్చుతుంది" అని హీరో వెంకటేశ్ అన్నారు. కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ ఎస్.వర్మ దర్శకత్వం వహించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. ఇందులో వెంకటేశ్ నాగ నాయుడు (తండ్రి), రానా.. రానా నాయుడు (కొడుకు) పాత్రలు పోషించారు. సుందర్ ఆరోన్, లోకోమోటివ్ గ్లోబల్ నిర్మించిన ఈ వెబ్ సిరీస్ ఈ నెల 10 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ– "'రానా నాయుడు' నాకు కొత్త ప్రపంచం. ఓటీటీలో చేయడం ఇదే మొదటిసారి . చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇందులో భావోద్వేగ సన్నివేశాలు చాలా కొత్తగా, పవర్‌ఫుల్‌గా ఉంటాయి. రానాతో తొలిసారి ఫుల్ లెంత్ స్క్రీన్‌ను పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. కరణ్, సుపర్ణ్ వర్మలతో పని చేయడం గొప్ప ప్రయాణంలా అనిపించింది" అన్నారు. రానా మాట్లాడుతూ– "'రానా నాయుడు' డార్క్ కామెడీ డ్రామా. ఇలాంటి కథలు సినిమాల్లో చేయడం కష్టం. హైదరాబాద్‌కి చెందిన ఓ కుటుంబం ముంబై వెళ్లి అక్కడ గ్యాంగ్‌స్టర్ పనులు చేస్తే ఎలా ఉంటుంది? అనే ఆసక్తికర అంశాలు ఇందులో ఉంటాయి. ఈ సిరీస్ కోసం బాబాయ్‌తో (వెంకటేశ్) పని చేయడం మర్చిపోలేని అనుభూతి" అన్నారు. "వెంకటేశ్, రానాగార్లతో పని చేయడం ఆనందంగా ఉంది" అన్నారు కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ వర్మ. "'రానా నాయుడు' వీక్షకులను తప్పకుండా అలరిస్తుంది" అన్నారు నిర్మాత సుందర్ ఆరోన్.

ఆనందాల హోలీ



హోలీ పండగ సందర్భంగా మంగళవారం రంగులతో ఆడారు సినీ తారలు. ఆ ఆనందోత్సాహాలను సోషల్ మీడియా వేదికగా ఫొటోల రూపంలో అభిమానుల కోసం షేర్ చేశారు. నేపాల్‌లో హోలీ సెలబ్రేషన్స్ జరుపుకున్నారు తమన్నా. పెళ్లైన తర్వాత తొలి హోలీ ఫెస్టివల్‌ను భర్త సోహైల్ కతూరియాతో జరుపుకున్నారు హన్సిక. కరీనా కపూర్, కరిష్మా కపూర్, అనన్యా పాండే కూడా హోలీ సంబరాల్లో మునిగారు. బాలీవుడ్ ప్రముఖ రచయిత జావేద్ అక్తర్ ఏర్పాటు చేసిన హోలీ సెలబ్రేషన్స్‌లో ఫర్హాన్ అక్తర్, రిచా చద్దా, అలీ ఫజల్ తదితర తారలు పాల్గొన్నారు.

స్టయిలిష్ డీజే


● సుధీర్‌బాబు

సుధీర్ బాబు హీరోగా నటించిన తాజా చిత్రం 'మామా మశ్చీంద్ర'. నటుడు–దర్శకుడు హర్షవర్ధన్ దర్శకత్వం వహించారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు తెలుగు, హిందీ భాషల్లో నిర్మించారు. సుధీర్ బాబు ఈ చిత్రంలో చేసిన మూడు పాత్రల్లో దుర్గ, పరశురామ్‌ల లుక్స్ ఇప్పటికే విడుదల కాగా, తాజాగా స్టయిలిష్‌గా ఉన్న డీజే క్యారెక్టర్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్రయూనిట్. "వినూత్న కాన్సెప్ట్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందింది" అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలి నారంగ్, సృష్టి (సృష్టి సెల్యులాయిడ్), సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: పీజీ విందా.

వెన్నెల్లో ఆడపిల్ల..


● కార్తికేయ, నేహా శెట్టి

'వెన్నెల్లో ఆడపిల్ల.. కవ్వించే కన్నెపిల్ల... కోపంలో చూస్తే ఎల్లా. క్షణంలో అగ్గిపుల్ల' అంటూ ప్రేమగీతం పాడుతున్నారు గుమ్మకొండ కార్తికేయ. క్లాక్స్ దర్శకత్వంలో కార్తికేయ, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'బెదురులంక 2012'. సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించారు. మణిశర్మ స్వరపరచిన ఈ చిత్రంలోని 'వెన్నెల్లో ఆడపిల్ల..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటను హారిక నారాయణ్, జేవీ సుధాంశు ఆలపించగా, బృంద మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. "గోదావరి తీర ప్రాంతంలోని ఓ గ్రామంలో ఎనిమిదెకరాల రొయ్యల చెరువు మధ్య రాత్రి వేళల్లో తీసిన పాట ఇది. త్వరలో విడుదల తేదీ వెల్లడిస్తాం" అన్నారు రవీంద్ర బెనర్జీ.

పల్లెటూరి ప్రేమకథ


● గీత

గీతా శైనీ, శ్రీ చరణ్ రాచకొండ జంటగా నటిస్తున్న చిత్రం 'కన్యాకుమారి'. 'పుష్పక విమానం' చిత్ర దర్శకుడు దామోదర స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. దామోదర మాట్లాడుతూ–"రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. శ్రీకాకుళం నేపథ్యంలో సాగే పల్లెటూరి ప్రేమకథా చిత్రం. ప్రస్తుతం ఫైనల్ షెడ్యూల్ జరుగుతోంది" అన్నారు. ఈ సినిమాకు సంగీతం: సాహిత్య సాగర్, కెమెరా: శివ గాజుల, సహ నిర్మాతలు: సతీష్ రెడ్డి, వరీనియా మామిడి, సిద్ధార్థ్ .ఎ.

మీటర్.. పక్కా మాస్ కమర్షియల్ - బాబీ

"'మీటర్' టీజర్ చూస్తుంటే పక్కా మాస్ కమర్షియల్ మూవీ అనిపిస్తోంది. ఈ సినిమా హిట్ కావాలి" అని డైరెక్టర్ బాబీ కొల్లి అన్నారు. కిరణ్ అబ్బవరం, అతుల్య రవి జంటగా రమేష్ కాదూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మీటర్'. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని బాబీ రిలీజ్ చేశారు. చెర్రీ మాట్లాడుతూ–"చక్కని కథతో మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా 'మీటర్'ని తీశారు రమేష్" అన్నారు. "థియేటర్‌లో విజిల్స్ కొట్టి చూసే కమర్షియల్ సినిమా ఇది" అన్నారు కిరణ్ అబ్బవరం. "నన్ను ఇంత దూరం తీసుకొచ్చిన బాబీ, గోపీచంద్ మలినేని గార్లకు థ్యాంక్స్" అన్నారు రమేష్ కాదూరి. చిత్ర సంగీత దర్శకుడు సాయి కార్తీక్ పాల్గొన్నారు.


● రమేష్ కాదూరి, బాబీ, కిరణ్ అబ్బవరం, చిరంజీవి

సవరణ:
మంగళవారం సంచికలో 'కెమెరామేన్ ప్రవీణ్ కన్నుమూత' వార్తలో వాడిన ఫొటో కెమెరామేన్‌ది కాకుండా అదే పేరుతో ఉన్న వేరే వ్యక్తిది ప్రచురితమైంది. పొరపాటుకు చింతిస్తున్నాం.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
415	117
60,224	17,711

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,630	▽	46
డోజోన్స్	33,066	▽	366
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,919	▽	10
డాక్స్	15,560	▽	94
షాంఘై	3,285	▽	37
నికాయ్	28,309	▲	71

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	55,210
బంగారం (22 క్యారెట్)	52,580
వెండి (కిలో)	70,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	80.08	83.76
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	96.04	100.87
€	యూరో	ఎస్‌బీఐ	85.18	88.66
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	47.00	73.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.28	57.14
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	58.60	63.14
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.85	22.52
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.04	23.02
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.69	12.77

స్టార్టప్‌లలో మహిళల హవా

ఇన్నోవేషన్‌లోనూ ముందంజ • విజయవంతంగా వ్యాపారాల నిర్వహణ • స్టాక్ ఎక్స్ఛేంజీల్లోనూ సంస్థల లిస్టింగ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గతంలో పురుషులకు మాత్రమే పరిమితమైన దేశీ స్టార్టప్ రంగంలో ఇప్పుడు మహిళలు దూసుకెళుతున్నారు. కొంగొత్త ఆవిష్కరణలతో అంకుర సంస్థలను విజయవంతంగా నడిపిస్తున్నారు. టెక్నాలజీ, ఈ-కామర్స్, ఫైనాన్స్ తదితర రంగాల్లో రాణిస్తున్నారు. మహిళల సారథ్యంలోని నైకా, జివామి, షీరోస్ వంటి పలు విజయవంతమైన అంకుర సంస్థలు ఇందుకు నిదర్శనం. ఫల్గుణీ నాయర్ నేతృత్వంలోని ఫ్యాషన్ ప్రొడక్ట్స్ సంస్థ నైకా... సంచలన స్థాయిలో స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యింది. ఇన్వెస్టర్లు భారీగా ఎగబడి మరీ షేర్లు కొన్నారు. ఇక అంతకన్నా ముందు .. దాదాపు నలభై ఏళ్ల క్రితం రజని బెక్టర్ ఏర్పాటు చేసిన బేకరీ ఉత్పత్తుల సంస్థ మిసెస్ బెక్టర్స్ లిస్టింగ్‌కు వస్తే ఇన్వెస్టర్లు బ్రహ్మరథం పట్టారు. ఇలాంటి సానుకూల స్పందన ఊతంతో మరిన్ని స్టార్టప్‌లు కూడా లిస్టింగ్ బాట పడుతున్నాయి. గజల్ అలగ్ సహ-వ్యవస్థాపకురాలిగా ఉన్న ఆరోగ్య ఉత్పత్తుల సంస్థ మామాఎర్త్ కూడా తాజాగా ఐపీవో యత్నాల్లో ఉంది. ఇలా పలు అంకుర సంస్థలు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు మహిళలకు అవసరమైన ఉత్పత్తులు, సర్వీసులను అందించడంపై ప్రధానంగా దృష్టి పెట్టేవిగా ఉంటున్నాయి. 2014లో చిన్న, మధ్య తరహా వ్యాపారాలు సహా దేశీయంగా మహిళల సారథ్యంలోని స్టార్టప్‌ల సంఖ్య .. మొత్తం అంకుర సంస్థల్లో 8 శాతంగా ఉండేది. ప్రస్తుతం ఇది దాదాపు 14 శాతానికి చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పురుషుల సారథ్యంలోని అంకుర సంస్థలతో పోలిస్తే మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌లు 2.5 రెట్లు ఎక్కువగా మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాయని, పెట్టుబడులపై 35 శాతం అధికంగా రాబడులు అందించగలుగుతున్నాయని పరిశ్రమవర్గాలు పేర్కొన్నాయి.



లక్ష్యంపైనే గురి..

వ్యాపారాన్ని ప్రారంభించడమంటే అనేక సవాళ్లతో కూడుకున్న వ్యవహారం కావడంతో పాటు మిగతా వర్గాల నుంచి సహకారం లభించడం కూడా కీలకం. వ్యాపారం ప్రారంభించడానికి ముందే టార్గెట్ మార్కెట్, పోటీ, తాము అందించే సర్వీసులు, ఉత్పత్తుల ప్రత్యేకత వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలని స్పేస్‌మంత్ర వ్యవస్థాపకురాలు నిధి అగర్వాల్ పేర్కొన్నారు. మహిళా ఎంట్రప్రెన్యూర్లు మరింత తరచుగా తమ నిర్ణయాలను ప్రశ్నించుకుంటూ ముందుకు సాగాల్సి వస్తుందని టెరావిటా వ్యవస్థాపకురాలు రాహీ అంబానీ తెలిపారు. అయితే, ఒడిదుడుకులను అధిగమించి, లక్ష్యంపైనే దృష్టి పెడితే విజయం సాధించవచ్చని ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వాల తోడ్పాటు..

స్టార్టప్ రంగంలోనూ మహిళలు రాణించేలా ప్రభుత్వాలు, వివిధ సంస్థలు తోడ్పాటు అందిస్తుండటం కూడా వారికి సహాయకరంగా ఉంటోంది. అటల్ ఇన్నోవేషన్ మిషన్, స్టాండప్ ఇండియా వంటి స్కీములు స్టార్టప్‌లకు అండగా ఉంటున్నాయి. నిధులపరంగాను, ఇతరత్రా సహాయాన్ని అందించేందుకు యాక్సిలరేటర్లు, ఇన్‌క్యుబేటర్లు మొదలైనవి ఉన్నాయి.



ఏడబ్ల్యూఎస్ నుంచి యాక్సిలరేట్‌హర్ 2023

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), ప్రముఖ వెంచర్ క్యాపిటల్ సంస్థ లైట్‌స్పీడ్ కలిసి యాక్సెలరేట్‌హర్ 2023 పేరిట ప్రత్యేక ప్రోగ్రాంను ఆవిష్కరించాయి. ప్రారంభ స్థాయి దేశీ స్టార్టప్‌ల మహిళా వ్యవస్థాపకులు తమ సంస్థలను నిర్మించుకునేందుకు, వృద్ధిలోకి తెచ్చుకునేందుకు, విజయవంతమైన వ్యాపారాలుగా తీర్చిదిద్దుకునేందుకు అవసరమైన తోడ్పాటు దీని ద్వారా పొందవచ్చు. ఈ ఆరు వారాల యాక్సిలరేషన్ ప్రోగ్రామ్‌నకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏడబ్ల్యూఎస్ ఇండియా హెడ్ (స్టార్టప్ ఎకోసిస్టమ్) అమితాబ్ నాగ్‌పాల్ తెలిపారు. దీనికి ఎంపికైన స్టార్టప్‌లు నిధుల సమీకరణ, సాంకేతిక అంశాలపరమైన మద్దతు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. కనీస లాభదాయకత ఉత్పత్తి కలిగి ఉండి, మూడు మిలియన్ డాలర్ల కన్నా తక్కువ నిధులను సమీకరించిన స్టార్టప్‌లు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు.



మహిళా మాసంగా మార్చి ..

ఐసీఐసీఐ లాంబార్డ్

ఆర్థిక, ఆరోగ్య విషయాల్లో మహిళలకు సాధికారత కల్పించే ప్రయత్నాల్లో భాగంగా మార్చి నెలను మహిళా మాసంగా పాటిస్తున్నట్లు ప్రైవేట్ రంగ బీమా సంస్థ ఐసీఐసీఐ లాంబార్డ్ వెల్లడించింది. ఈ సందర్భంగా కాంప్లిమెంటరీ హెల్త్ చెకప్‌లను అందిస్తున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ (ముందుగా వచ్చిన వారికి) ప్రాతిపదికన 10,000 మంది మహిళలకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు వివరించింది. దీని కింద థైరాయిడ్ ప్రొఫైల్, విటమిన్ డీ, బీ12 తదితర టెస్టులను నిర్వహిస్తారు. అలాగే మహిళా మోటరిస్టులకు కాంప్లిమెంటరీగా రోడ్‌సైడ్ అసిస్టెన్స్ సర్వీసులు అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఇక మహిళా ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించే దిశగా మహిళా ఏజెంట్లను రిక్రూట్ చేసుకునేందుకు, అవగాహన కల్పించేందుకు సమగ్ర శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు కంపెనీ ఈడీ సంజీవ్ మంత్రి పేర్కొన్నారు.

ఫండ్ మేనేజర్లలో 10 శాతమే..

గడిచిన కొన్నేళ్లుగా మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో మహిళల మేనేజర్ల సంఖ్య పెరుగుతున్నా ఇప్పటికీ అది సుమారు 10% స్థాయిలోనే ఉన్నట్లు మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ఇండియా వార్షిక నివేదిక పేర్కొంది. దీని ప్రకారం మహిళా ఫండ్ మేనేజర్ల సంఖ్య గతేడాది 32గా ఉండగా ప్రస్తుతం 42కి పెరిగింది. అదే సమయంలో మొత్తం ఫండ్ మేనేజర్ల సంఖ్య 399 నుంచి 428కి చేరింది. వీరిలో 42 మంది మహిళలు.. ఫండ్స్‌ను ప్రైమరీ లేదా సెకండరీ మేనేజర్లుగా నిర్వహిస్తున్నారు. 2017లో 18 మందికి పరిమితమైన ఫండ్ మేనేజర్ల సంఖ్య ఆ తర్వాత నుంచి క్రమంగా పెరిగినట్లు మార్నింగ్‌స్టార్ పేర్కొంది. ప్రస్తుతం 24 ఫండ్ సంస్థల్లో 42 మంది మహిళా మేనేజర్లు ఉన్నారు.

మహిళల కోసం సిగ్నిటీ ప్రత్యేక కార్యక్రమాలు

టెక్నాలజీ రంగంలో మహిళలకు తోడ్పాటునిచ్చే దిశగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిగ్నిటీ టెక్నాలజీస్ సంస్థ వెల్లడించింది. మార్చి 9న 'ఉమెన్ ఇన్ టెక్ రౌండ్‌టేబుల్' వర్చువల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపింది. పలు మహిళా దిగ్గజాలు పాల్గొనే ఈ చర్చాగోష్టికి సంస్థ ఎస్‌వీపీ శిరీష పెయ్యేటి సారథ్యం వహిస్తారు. అలాగే, మహిళలు కొత్త విషయాలను నేర్చుకునేలా, అనుభవజ్ఞుల నుంచి సలహాలు పొందేలా వెసులుబాటు కల్పించే దిశగా 'హర్‌డిజిటల్‌స్టోరీ' పేరిట ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందిస్తున్నట్లు సిగ్నిటీ పేర్కొంది. ఇక కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీతో కలిసి పనిచేస్తున్నట్లు, 'ప్రాజెక్ట్ సిగ్నిఫికెన్స్' పేరిట 100 మంది గ్రామీణ ప్రాంత మహిళలకు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ కల్పిస్తున్నట్లు వివరించింది.

ప్రైవేటు పెట్టుబడులు పెరగాలి: మోదీ



న్యూఢిల్లీ: బడ్జెట్‌లో ప్రభుత్వం కల్పించిన ప్రతిపాదనలను అనుకూలంగా మలుచుకోవాలని భారత పరిశ్రమలను (ఇండియా ఇంక్) ప్రధాని మోదీ కోరారు. ప్రభుత్వం మూలధన వ్యయాలను పెంచినట్టే, ప్రైవేటు రంగం కూడా మరిన్ని పెట్టుబడులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అప్పుడే గరిష్ఠ ప్రయోజనం పొందగలమన్నారు. బడ్జెట్‌పై నిర్వహించిన 10వ వెబినార్‌లో భాగంగా ప్రధాని మాట్లాడారు. ప్రభుత్వం మూలధన వ్యయాల లక్ష్యాన్ని చారిత్రక గరిష్ఠ స్థాయి అయిన రూ.10 లక్షల కోట్లకు పెంచినట్టు గుర్తు చేశారు. అంతర్జాతీయంగా భారత్ ఎకానమీకి ప్రశంసలు లభిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. జీఎస్‌టీసహా ఆదాయపన్ను, కార్పొరేట్ పన్ను తగ్గింపు వల్ల పన్నుల భారం గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గినట్టు ప్రధాని తెలిపారు. ఈ చర్యలతో పన్నుల వసూళ్లు మెరుగుపడ్డాయని.. 2013–14 నాటికి 11 లక్షల కోట్లుగా ఉన్న పన్నుల ఆదాయం 2023–24 నాటికి రూ.33 లక్షల కోట్లకు చేరుకోవచ్చన్నారు.

శ్రీసిటీ, దాద్రాలో విస్తరణ: బ్లూ స్టార్



చెన్నై: హోమ్ అప్లయెన్సెస్ తయారీ దిగ్గజం బ్లూ స్టార్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లోని తడవద్దగల శ్రీ సిటీ యూనిట్‌ను విస్తరించనున్నట్లు తాజాగా పేర్కొంది. రెండో దశలో భాగంగా ఇందుకు రూ. 200 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. రూ. 350 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన శ్రీ సిటీ యూనిట్ ఈ ఏడాది జనవరిలో ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ బాటలో గుజరాత్‌లోని దాద్రా ప్లాంటును సైతం విస్తరించనున్నట్లు తెలియజేసింది. ఇప్పటికే రూ. 180 కోట్ల పెట్టుబడులు వెచ్చించనట్లు వెల్లడించింది. కాగా.. ఏడు తయారీ ప్లాంట్లు కలిగిన కంపెనీ దాద్రా, శ్రీ సిటీలలో ఒక్కొక్క యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు బ్లూ స్టార్ ఎండీ బి.త్యాగరాజన్ పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్, అహ్మదాబాద్, దాద్రా, వాద్రా(మహారాష్ట్ర), శ్రీ సిటీలలో కంపెనీకి తయారీ యూనిట్లున్నాయి. గతేడాది(2021–22)లో రూ. 6,045 కోట్ల టర్నోవర్ సాధించిన కంపెనీ 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 8,200 కోట్ల ఆదాయం అంచనా వేస్తోంది.

అదానీ గ్రూప్ రుణ చెల్లింపులు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ తాజాగా 2025 ఏప్రిల్‌లో మెచ్యూరిటీ కానున్న రూ. 7,374 కోట్లమేర రుణాలను తిరిగి చెల్లించింది. తాజా చెల్లింపులతో 4 కంపెనీలలో ప్రమోటర్ల వాటాలను తనఖా నుంచి తిరిగి పొందింది. వీటిలో అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన 3.1 కోట్ల షేర్లు(4% వాటా), అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌కు చెందిన 15.5 కోట్ల షేర్లు(11.8% వాటా)తోపాటు అదానీ ట్రాన్స్‌మిషన్‌కు చెందిన 3.6 కోట్ల షేర్లు(4.5% వాటా), అదానీ గ్రీన్ ఎనర్జీకి చెందిన 1.1 కోట్ల షేర్లు(1.2% వాటా) ఉన్నట్లు పేర్కొంది. ఈ నెలాఖరుకల్లా ఇలాంటి మరిన్ని రుణాలను ముందస్తుగానే చెల్లించనున్నట్లు తెలియజేసింది. తద్వారా గ్రూప్ రుణ భారంపై ఇన్వెస్టర్లలో తలెత్తిన ఆందోళనలకు చెక్ పెట్టే సన్నాహాలకు తెరతీసింది. కాగా.. ఫిబ్రవరి మొదట్లో చేపట్టిన చెల్లింపులతో కలిపి మొత్తం 2.016 బిలియన్ డాలర్ల రుణ భారాన్ని తగ్గించుకున్నట్టు గ్రూప్ వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-3-2023	
విశాఖ	420–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	417–00
విజయవాడ	417–00
రిటైల్ ధర (డజను)	66.00
7-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	400–00
వరంగల్	402–00
రిటైల్ ధర	4.60

హిందూ వృద్ధి రేటు అనడం అపరిపక్వమే: ఎస్‌బీఐ



న్యూఢిల్లీ: భారత్ ప్రమాదకర హిందూ వృద్ధి రేటుకు చేరువ అవుతోందంటూ ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ చేసిన వ్యాఖ్యలు.. తప్పుడు భావనతో, పక్షపాతంతో, అపరిపక్వంగా ఉన్నాయని ఎస్‌బీఐ రీసెర్చ్ సంస్థ పేర్కొంది. 1950 నుంచి 1980 వరకు భారత్ జీడీపీ వృద్ధి అత్యంత తక్కువగా, సగటున 3.5 శాతంగా కొనసాగింది. దీన్ని హిందూ వృద్ధి రేటుగా భారత ఆర్థికవేత్త అయిన రాజ్ కృష్ణ సంబోధించారు. దీంతో తక్కువ వృద్ధి రేటును హిందూ వృద్ధి రేటుగా అభివర్ణిస్తుంటారు.

జాబ్ పాయింట్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో 5369 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో పనిచేసేందుకు వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 5369
» **పోస్టుల వివరాలు:** ఇన్వెస్టిగేటర్ గ్రేడ్–2, డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్, లైబ్రరీ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, హిందీ టైపిస్ట్, సౌండ్ టెక్నీషియన్, అకౌంటెంట్, ప్లానింగ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, టెక్స్‌టైల్ డిజైనర్, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్, రీసెర్చ్ అసిస్టెంట్, లాబొరేటరీ అసిస్టెంట్, జూనియర్ కంప్యూటర్ అసిస్టెంట్, లైబ్రరీ కమ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, జూనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్ మాన్, ప్రాసెసింగ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, అసిస్టెంట్ వెల్ఫేర్ అడ్మినిస్ట్రేటర్, నావిగేషనల్ అసిస్టెంట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్, గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు వయసులో సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** స్కిల్ టెస్ట్/కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్/డేటాఎంట్రీ టెస్ట్/కంప్యూటర్ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** పరీక్షలో భాగంగా జనరల్ ఇంటెలిజెన్స్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. అందుకు 50 మార్కులు కేటాయిస్తారు. జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు– 50 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు– 50 మార్కులు, ఇంగ్లిష్ నుంచి 25 ప్రశ్నలు– 50 మార్కులు ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి 0.50 రుణాత్మక మార్కు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 06.03.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.03.2023
» **ఆన్‌లైన్ పేమెంట్ చివరితేది:** 28.03.2023.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** జూన్–జూలై 2023.
» **వెబ్‌సైట్:** www.ssc.nic.in

» విదేశీ విద్యవైపు భారత విద్యార్థుల చూపు
» గత మూడేళ్లలో దాదాపు మూడింతల వృద్ధి
» తొలి గమ్యంగా అగ్రరాజ్యం అమెరికా
» ఎక్కువ మంది చేరేది ఎంఎస్, ఎంబీఏలోనే!
» ముందస్తు సన్నద్ధతతోనే సక్సెస్ అంటున్న నిపుణులు

విదేశీ విద్యకు.. ముందస్తు ప్రణాళిక!

స్టడీ అబ్రాడ్.. విదేశీ విద్య. నేడు దేశంలో లక్షల మంది స్వప్నం! ముఖ్యంగా సైన్స్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు పయనమవుతున్నారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన భారతీయ విద్యార్థుల సంఖ్య గత మూడేళ్లలో మూడింతలు పెరగడమే ఇందుకు నిదర్శనం! కోవిడ్ కారణంగా కఠిన నిబంధనలు అమలు చేసిన అమెరికా యూనివర్సిటీల్లోనే మన విద్యార్థులు ఎక్కువగా చేరినట్లు ఇటీవల అధికారిక గణాంకాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో.. మన విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న దేశాలు, చేరుతున్న కోర్సులు, ప్రవేశ విధానాలు, ముందస్తు సన్నద్ధతపై ప్రత్యేక కథనం..

విదేశీ విద్యకు వెళ్లాలనుకునే మన విద్యార్థులు ఎంతో ముందుగానే ప్రణాళికలను సిద్ధం చేసుకొని అడుగులు వేస్తున్నారు. ఫలితంగానే..విదేశీ యూనివర్సిటీల్లో చేరే భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. దేశం నుంచి స్టడీ అబ్రాడ్‌కు వెళ్లిన విద్యార్థుల సంఖ్య గత మూడేళ్లలో భారీగా పెరిగిందని తాజాగా బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. విదేశాలకు వెళ్లిన మన విద్యార్థుల సంఖ్య 2020లో 2,59,655గా ఉంటే.. 2021లో 4,44,553గా, 2022లో 7,50,365గా ఉంది.

ఎంఎస్, ఎంబీఏ కోసమే

విదేశాల్లో ఉన్నత విద్య కోసం పయనమవుతున్న వారిలో ఎక్కువ మంది ఎంఎస్–కంప్యూటర్ సైన్స్, లేదా ఎంబీఏ కోర్సుల్లో చేరుతున్నారు. మొత్తం విద్యార్థుల్లో వీరి సంఖ్య దాదాపు 80 శాతంగా ఉంది. ఇతర ప్రొఫెషనల్ కోర్సుల విషయానికొస్తే.. హాస్పిటాలిటీ, నర్సింగ్, అగ్రికల్చర్ విభాగాలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఈ కోర్సులకు సంబంధించి యూకే, ఆస్ట్రేలియా భారతీయ విద్యార్థులకు ప్రధాన గమ్యాలుగా నిలుస్తున్నాయి.

యూఎస్.. ఓపీటీతో కొలువు

యూఎస్‌లో అడుగుపెట్టాలంటే.. పలు అర్హత ప్రమాణాలు తప్పనిసరి. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు అమెరికాలోని అధిక శాతం యూనివర్సిటీలు 16 ఏళ్ల (10+2+4) విధానంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొంటున్నాయి. మరికొన్ని విశ్వవిద్యాలయాలు మాత్రం 10+2 తర్వాత మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారికి కూడా అవకాశం కల్పిస్తున్నాయి. ప్రఖ్యాత యూనివర్సిటీలు(హార్వర్డ్, ఎంఐటీ, యూసీ, కార్నెగీ తదితర) మాత్రం తప్పనిసరిగా 10+2+4 విధానంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలని స్పష్టం చేస్తున్నాయి. దీంతోపాటు సైన్స్, ఇంజనీరింగ్ కోర్సుల అభ్యర్థులు జీఆర్‌ఈలో, మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులు జీమ్యాట్‌లో మంచి స్కోర్ సాధించాల్సి ఉంటుంది. ప్రవేశం ఖరారయ్యాక వర్సిటీలు అందించే ఐ–20 ఫామ్ ద్వారా స్టూడెంట్ వీసాకు దరఖాస్తు చేసుకోవాలి.

కొలువుకు మార్గం: అమెరికాలో ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీ) పేరుతో ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని ప్రకారం-యూఎస్‌లోని ఏదైనా యూనివర్సిటీలో పీజీ కోర్సులో చేరిన అంతర్జాతీయ విద్యార్థులు చదువు పూర్తయిన తర్వాత ఓపీటీ పేరుతో అక్కడి సంస్థల్లో 12 నెలలపాటు పని చేయొచ్చు.స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల విద్యార్థులు 36 నెలలపాటు ఓపీటీ విధానంలో యూఎస్‌లోని సంస్థల్లో పని చేసే అవకాశం ఉంటుంది. ఆ సమయంలో చక్కటి పనితీరుతో సదరు సంస్థలను మెప్పిస్తే.. అదే కంపెనీలో శాశ్వత కొలువు కోసం అభ్యర్థుల తరఫున హెచ్–1బి పిటిషన్‌కు కంపెనీలు దరఖాస్తు చేసే అవకాశముంది. వాస్తవానికి గత కొన్నేళ్లుగా యూఎస్‌లో దాఖలవుతున్న హెచ్–1బి పిటిషన్లలో ఓపీటీ పూర్తి చేసుకున్న విద్యార్థుల సంఖ్యే ఎక్కువగా ఉంటోంది.

ఫీజు 50 వేల డాలర్లు: అమెరికాలోని వర్సిటీల్లో కోర్సుల వార్షిక ఫీజు 35 వేల డాలర్ల నుంచి 50 వేల డాలర్ల వరకు ఉంటోంది. హార్వర్డ్, ఎంఐటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్‌లీ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో చదవాలంటే.. ఏడాదికి కనీసం యాభై వేల డాలర్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

కెనడా.. సైన్స్, రీసెర్చ్

సైన్స్, ఇంజనీరింగ్, రీసెర్చ్ కోర్సుల విద్యార్థులకు కెనడా బెస్ట్ డెస్టినేషన్‌గా నిలుస్తోంది. అమెరికాకు పొరుగునే ఉండడంతో భవిష్యత్తు అవకాశాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కువ మంది కెనడాకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అక్కడ ప్రభుత్వం అమలు చేస్తున్న సింప్లిఫైడ్ వీసా ఫ్రేమ్ వర్క్ విధానం, వర్క్ పర్మిట్, ఇమిగ్రేషన్ విధానం భారతీయులకు వరంగా మారింది. ఈ దేశంలో కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత ఏడాది పాటు అక్కడే ఉండి ఉద్యోగాన్వేషణ సాగించొచ్చు. ఆ సమయంలో ఉద్యోగం సొంతం చేసుకుని స్పాన్సర్‌షిప్ లెటర్ ఆధారంగా వర్క్ వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. మూడేళ్లపాటు పని అనుభవంతో పర్మనెంట్ రెసిడెన్సీ కోసం దరఖాస్తు చేసుకునే విధంగా సరళీకృత నిబంధనలను కెనడా రూపొందించింది.

కెనడా..బెస్ట్ కోర్సులు: ప్రస్తుతం కెనడాలో సైన్స్, డెయిరీ టెక్నాలజీ, రీసెర్చ్, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, జనరల్ మేనేజ్‌మెంట్, ఏవియేషన్ టెక్నాలజీ, ఆస్ట్రానమీ, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ బెస్ట్ కోర్సులుగా నిలుస్తున్నాయి. ఈ కోర్సుల వ్యవధి 14 నెలల నుంచి 24 నెలలు. ఇక్కడ ఫీజులు ఏడాదికి 30 వేల డాలర్ల నుంచి 40 వేల డాలర్ల వరకు ఉంటున్నాయి. మెక్‌గిల్ యూనివర్సిటీ; క్వీన్స్ యూనవర్సిటీ; యూనివర్సిటీ ఆఫ్ టొరంటో; వాటర్‌లూ యూనివర్సిటీ; యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా; యూనివర్సిటీ ఆఫ్ అల్బెర్టా;యూనివర్సిటీ డి మాంట్రియల్; మెక్‌మాస్టర్ యూనివర్సిటీ; వెస్టర్న్ యూనివర్సిటీ; యూనివర్సిటీ ఆఫ్ కల్గెరీ వంటి టాప్–10 యూనివర్సిటీల్లో చదవాలంటే.. ఏడాది 40 వేల డాలర్లకు పైగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

యూకే.. ఏడాది పీజీ

మన విద్యార్థుల మరో ముఖ్య గమ్యం.. యూకే. ఇక్కడి వర్సిటీల్లో బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్,హ్యూమానిటీస్ కోర్సుల్లో చేరుతున్నారు. ప్రధానంగా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, ఎకనామిక్స్, బ్యాంకింగ్, లా కోర్సులకు యూకే కేరాఫ్‌గా నిలుస్తోంది. యూకేలోని చాలా యూనివర్సిటీల్లో పీజీ కోర్సును ఒక ఏడాదిలోనే పూర్తి చేసే అవకాశం ఉండటం మన విద్యార్థులకు కలిసి వస్తోంది. ఫీజులు కూడా అమెరికా, కెనడాలతో పోల్చుకుంటే తక్కువగా ఉంటున్నాయి. ఏడాది వ్యవధిలో ఉండే పీజీ కోర్సు ఫీజు 10వేల పౌండ్ల నుంచి 25 వేల పౌండ్ల మధ్యలోనే ఉంటోంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్,లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్,యూనివర్సిటీ ఆఫ్ సెయింట్ ఆండ్రూస్,వార్విక్ యూనివర్సిటీ, కింగ్స్ కాలేజ్, ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీ, లాంకెస్టర్ యూనివర్సిటీ, గ్లాస్గో యూనివర్సిటీలు టాప్–10 జాబితాలో నిలుస్తున్నాయి.

ఆస్ట్రేలియా..అవకాశాలకు మార్గం

ఇటీవల కాలంలో మన విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న దేశం.. ఆస్ట్రేలియా. అగ్రికల్చర్, డెయిరీ టెక్నాలజీ, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ కోర్సులు అందించడంలో ఇక్కడి యూనివర్సిటీలకు మంచి పేరుంది. మేనేజ్‌మెంట్ కోర్సుల వ్యవధి 14 నెలల నుంచి 20 నెలలు; ఇంజనీరింగ్ కోర్సుల వ్యవధి 24 నెలల వరకు ఉంటోంది. కోర్సు పూర్తి చేసిన తర్వాత అక్కడే ఏడాది పాటు ఉద్యోగాన్వేషణ సాగించే అవకాశం ఉంది. ఆ సమయంలో ఉద్యోగం లభిస్తే అక్కడే కొనసాగే అవకాశముంది.

ఫిబ్రవరి, జూలై నెలల్లో ఇక్కడి యూనివర్సిటీల్లో అకడమిక్ సెషన్ ప్రారంభమవుతుంది. ఫీజు కనిష్ఠంగా 22 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు, గరిష్ఠంగా 50 వేల ఆస్ట్రేలియన్ డాలర్ల వరకూ ఉంది. ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్సిటీ; యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్; యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ; అడిలైడ్ యూనివర్సిటీ; మొనాష్ యూనివర్సిటీ; యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్; యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్; యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా వంటి వర్సిటీల్లో ఏడాదికి సగటున 30 వేల ఆస్ట్రేలియన్ డాలర్లను ఫీజులుగా చెల్లించాల్సి ఉంటుంది.



జర్మనీ..రీసెర్చ్‌కు కేరాఫ్

భవిష్యత్తులో రీసెర్చ్ దిశగా అడుగులు వేయాలనుకునే అభ్యర్థులకు కేరాఫ్‌గా నిలుస్తోంది.. జర్మనీ. ఆటోమొబైల్, మాన్యుఫ్యాక్చరింగ్ విభాగాల్లో ఎంఎస్ బై రీసెర్చ్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సులు ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రధాన ఆకర్షణగా చెప్పొచ్చు. వీటి తర్వాత స్థానంలో మేనేజ్‌మెంట్ కోర్సులు నిలుస్తున్నాయి. అకడమిక్ సెషన్ జనవరి, జూలై నెలల్లో ప్రారంభమవుతుంది. ఇక్కడ అధిక శాతం యూనివర్సిటీలు ప్రభుత్వ ఆధీనంలో ఉండటంతో ఫ్రీ ఎడ్యుకేషన్ విధానం అమలవుతోంది. విద్యార్థులు సెమిస్టర్‌కు కనీసం రూ.500 యూరోలు డెవలప్‌మెంట్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేటు యూనివర్సిటీల్లో మాత్రం పది వేల యూరోల నుంచి 20 వేల యూరోల వరకు చెల్లించాల్సి ఉంటుంది. కోర్సు పూర్తయ్యాక 18 నెలలపాటు ఆ దేశంలోనే ఉండి ఉద్యోగాన్వేషణ సాగించే విధంగా సరళీకృత ఇమిగ్రేషన్ విధానం అమల్లో ఉంది. హంబోల్ట్ యూనివర్సిటీ, ఫ్రీ యూనివర్సిటీ ఆఫ్ బెర్లిన్, టెక్నికల్ యూనివర్సిటీ మ్యునిచ్, జార్జ్ అగస్ట్ యూనివర్సిటీ, ఎబర్‌హార్డ్ కార్ల్స్ యూనివర్సిటీ, టెక్నికల్ యూనివర్సిటీ బెర్లిన్, లీప్‌జిగ్ యూనివర్సిటీ, జెనా యూనివర్సిటీ, బ్రెమెన్ యూనివర్సిటీ, రెగెన్స్‌బర్గ్ యూనివర్సిటీలు టాప్‌లో నిలుస్తున్నాయి.

ఫాల్, స్ప్రింగ్.. ప్రవేశాలు

- విదేశీ యూనివర్సిటీలు ఫాల్, స్ప్రింగ్ సెషన్ పేరుతో ఏటా రెండుసార్లు ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తున్నాయి.
- ఫాల్ సెషన్ ఆగస్ట్‌లో, స్ప్రింగ్ సెషన్ జనవరిలో ప్రారంభమవుతుంది. వీటికి సంబంధించిన ప్రవేశాలు సదరు సెషన్ ప్రారంభానికి ఆరు నెలల ముందుగానే ప్రారంభమవుతున్నాయి.
- ఫాల్ సెషన్ అడ్మిషన్ల కోసం జనవరి నుంచి ఏప్రిల్ నెల వరకు, స్ప్రింగ్ సెషన్ ప్రవేశాలకు జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో యూనివర్సిటీలు దరఖాస్తులు స్వీకరిస్తున్నాయి.
- ఫాల్, స్ప్రింగ్ సెషన్లతోపాటు కొన్ని యూనివర్సిటీలు రోలింగ్ అడ్మిషన్ల పేరిట ఏడాది ఆసాంతం దరఖాస్తు ప్రక్రియ చేపడుతుంటాయి.
- అమెరికాకు వెళ్లాలనుకునే విద్యార్థులు తాము చేరదలచుకున్న సెషన్‌కు కనీసం 15 నుంచి 18 నెలల ముందుగా కసరత్తు ప్రారంభించాలి. అలాగే ఇతర దేశాలకు కూడా ముందస్తు కసరత్తు ప్రారంభించడం మేలు చేస్తుంది.

స్టాండర్డ్ టెస్ట్‌లు తప్పనిసరి

• విదేశీ యూనివర్సిటీల నిబంధనల ప్రకారం–నిర్దేశిత స్టాండర్డ్ టెస్ట్‌లలో ఉత్తీర్ణత సాధించి నిర్దేశిత స్కోర్ సొంతం చేసుకుంటేనే ప్రవేశం లభిస్తుంది. • సైన్స్,ఇంజనీరింగ్ కోర్సుల విద్యార్థులు జీఆర్‌ఈలో కనీసం 300కుపైగా పాయింట్లు సాధించాలి. •మేనేజ్‌మెంట్ కోర్సుల అభ్యర్థులు జీమ్యాట్‌లో 650కు పైగా స్కోర్ సొంతం చేసుకుంటే బెస్ట్ యూనివర్సిటీల్లో ప్రవేశం లభిస్తుంది. • విదేశీ విద్య అభ్యర్థులు లాంగ్వేజ్ టెస్ట్‌లలోనూ స్కోర్ సొంతం చేసుకోవాలి. • టోఫెల్‌లో కనీసం 100స్కోర్; ఐఈఎల్‌టీఎస్‌లో 9బ్యాండ్స్‌లో కనీసం 6.5 బ్యాండ్స్ సొంతం చేసుకుంటే.. బెస్ట్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందొచ్చు. • అకడమిక్‌గా పదో తరగతి నుంచి బ్యాచిలర్ డిగ్రీ వరకు కనీసం 60 శాతం మార్కులు లేదా దానికి సమానమైన జీపీఏ సాధించిన వారికి ప్రవేశాల్లో ప్రాధాన్యం దక్కుతోంది.

ఈ డాక్యుమెంట్లు సిద్ధంగా

విదేశీ విద్య అభ్యర్థులు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించే ముందే కొన్ని డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోవాలి. అవి.. అప్లికేషన్, కవరింగ్ లెటర్; అప్లికేషన్ ఫీజు; జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, ఎస్ఏటీ పరీక్షల్లో స్కోరు; స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్; లెటర్ ఆఫ్ రికమండేషన్; వ్యాసాలు; అకడమిక్ సర్టిఫికెట్లు; ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్; పాస్‌పోర్ట్; స్పాన్సర్ లెటర్స్, స్పాన్సరర్స్ ఆదాయపు పన్ను స్టేట్‌మెంట్.

క్లుప్తంగా...

మహిళలను పూజించే గొప్ప సంస్కృతి మనది

గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మహిళలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. వందల ఏళ్లుగా మహిళలను శక్తిదేవతగా పూజించే, గౌరవించే గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు మనవని ఆమె పేర్కొన్నారు. సమ్మిళిత, సమ సమాజ నిర్మాణం కోసం అన్ని రంగాల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించేలా మహిళలను ప్రోత్సహించాలని సూచించారు. మహిళలు సాధించిన విజయాలను ఉత్సవంగా జరుపుకోవడానికి మహిళా దినోత్సవం గొప్ప సందర్భమన్నారు. కుటుంబ బాగోగులు చూసుకోవడం నుంచి జాతి నిర్మాణం వరకు మహిళలు గొప్ప పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.

గిరి ప్రాంతాల్లో జనరిక్ మందులు దొరకాలి

గిరిజన ఆవాస ప్రాంతాల్లో మరిన్ని జనరిక్ మందుల దుకాణాలను ప్రారంభించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కోరారు. జన్ ఔషధి దినోత్సవం సందర్భంగా మంగళవారం రాష్ట్రంలోని జన్ ఔషధి కేంద్రాల ఇన్‌చార్జిలతో ఆమె వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాణాలు కాపాడే మందులను.. ధరల వల్ల చాలామంది రోజూ తీసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనరిక్ మందులను అందరికీ అందుబాటులోకి తెస్తే విలువైన ప్రాణాలను కాపాడగలమన్నారు.

మహిళాభ్యున్నతితోనే దేశప్రగతి: సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: సమాజంలో సగభాగమైన మహిళలు అన్ని రంగాల్లో పురోగమించినప్పుడే దేశాభివృద్ధి సంపూర్ణమవుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పురుషునితో సమానంగా అవకాశాలను అందిపుచ్చుకుంటూ విభిన్న రంగాలలో మహిళలు సాధిస్తున్న అపూర్వమైన విజయాలు నారీశక్తిని చాటుతున్నాయన్నారు. మహిళా సాధికారతకు ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. మహిళా సంక్షేమ రాష్ట్రంగా తెలంగాణ వెలుగొందుతోందని సీఎం పేర్కొన్నారు.

ఆడబిడ్డలపై మరింత గౌరవం, శ్రద్ధ

- ప్రతి కుటుంబానికి ఏపీ సీఎం వైఎస్ జగన్ పిలుపు
- మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో అక్క చెల్లెమ్మలకు, అవ్వలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 21వ శతాబ్దపు ఆధునిక భారతీయ మహిళ ఆంధ్రప్రదేశ్‌లోనే అవతరించేలా ప్రతి ఒక్క నిర్ణయాన్ని తీసుకున్న తమ ప్రభుత్వం రాజకీయ పదవుల్లో కూడా చట్టాలు చేసి మరీ సగభాగం కల్పించిందని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆడబిడ్డల పట్ల మరింత గౌరవం, శ్రద్ధ కనబర్చేలా ప్రతి కుటుంబం, మొత్తంగా సమాజం నిర్ణయాలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

మహిళా దినోత్సవానికి సిద్ధమైన కాకతీయ వర్సిటీ

సాక్షి ప్రతినిధి, వరంగల్: హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో బుధవారం జరిగే రాష్ట్రస్థాయి మహిళా దినోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆడిటోరియం ప్రవేశద్వారం, ఆవరణలో టెంట్లు ఏర్పాటు చేశారు. వేడుకలను 'డిజిట్ ఆల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈ క్వాలిటీ'థీమ్‌తో నిర్వహించనున్నారు. వేడుకలకు అతిథులుగా మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పి.సబితా ఇంద్రారెడ్డి తదితరులు హాజరవుతారు.

ఆడ పిల్ల పుడితే ఇక్కడ డెలివరీ ఖర్చు ఫ్రీ !

సాక్షి, కామారెడ్డి: కడుపులో పెరుగుతోన్న బిడ్డ ఆడో, మగో తేల్చి అబార్షన్లు చేస్తూ సొమ్ము చేసుకుంటున్న ఆస్పత్రులకు భిన్నంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ మెటర్నిటీ, సర్జికల్ ఆస్పత్రి నిర్వాహకులు ఆడపిల్ల పుడితే ఎలాంటి డెలివరీ ఖర్చులు తీసుకోవడం లేదు. గతేడాది సెప్టెంబర్ 1 నుంచి ఇప్పటి వరకు ఆ ఆస్పత్రిలో 49 మంది ఆడబిడ్డలు జన్మించారు. నార్మల్ అయినా సిజేరియన్ అయినా నయా పైసా తీసుకోవడం లేదు. ఆడపిల్లలంటే ఇప్పటికీ వివక్ష కొనసాగుతోందని, అందుకే తమ ఆస్పత్రిలో ఆడ పిల్ల పుడితే డెలివరీకి ఎలాంటి డబ్బులు తీసుకోవద్దని నిర్ణయం తీసుకున్నామని డాక్టర్ శ్రావణికా రెడ్డి, ఆస్పత్రి నిర్వాహకులు బోగి రవి తెలిపారు.



- నాయకత్వ లక్షణాలు మహిళల్లోనే అధికం
- ఒత్తిడిలోనూ సానుకూల నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం వారి సొంతం
- స్పష్టం చేస్తున్న పలు పరిశోధనలు, అధ్యయనాలు
- అయినా ప్రపంచవ్యాప్తంగా నాయకత్వ హోదాలో స్త్రీలు అంతంతే
- దేశాల పగ్గాలు చేపట్టిన మహిళల సంఖ్య స్వల్పమే
- గతేడాది నాటికి ప్రపంచ దేశాల్లో దేశాధ్యక్ష లేదా ప్రభుత్వ అధినేత్రి స్థానాల్లో ఉన్నది 28 మందే
- అన్ని దేశాల్లో మంత్రుల స్థానాల్లో మహిళలు 21 శాతమే

హై హై నాయికా

దొడ్డ శ్రీనివాసరెడ్డి

నాయకత్వ లక్షణాల్లో ఎవరు గొప్ప.. మహిళలా.. పురుషులా? దీనిచుట్టూ జరిగిన అనేక పరిశోధనలు, అధ్యయనాల్లో బయటపడింది ఏమంటే నాయకత్వ లక్షణాలు ఎక్కువగా మహిళల్లోనే మెరుగ్గా ఉంటాయట!. అమెరికాకు చెందిన ప్యూ రిసెర్చ్ సెంటర్ నివేదిక ప్రకారం ఒక మంచి నేతకు ఉండాల్సిన ముఖ్యమైన లక్షణాలు నిజాయితీ, మేధాశక్తి, కరుణతోపాటు సృజనాత్మకత. ఈ లక్షణాలు ఎక్కువగా మహిళల్లోనే ఉంటాయని ఈ సంస్థ పరిశోధనాత్మక వ్యాసంలో పేర్కొంది. ఇతరులు చెప్పేది వినడం, తనతోపాటు అందరి అభివృద్ధికి సాయం చేయడం, ఎలాంటి పరిస్థితులనైనా సృజనాత్మకతతో ఎదుర్కోవడం వంటి నాయకత్వ లక్షణాలు మహిళల్లో అధికంగా ఉంటాయని అమెరికాకు చెందిన నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ సైకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎలైస్ ఈగ్లీ వెల్లడించారు. సాధారణ పరిస్థితుల్లో స్త్రీ, పురుషులు దాదాపు ఒకేవిధమైన నిర్ణయాలు తీసుకున్నా అధిక ఒత్తిడిలో పురుషులు ప్రమాదంతో కూడిన క్లిష్టమైన నిర్ణయాలు తీసుకుంటారని, కానీ మహిళలు ఒత్తిడిలోనూ సానుకూల నిర్ణయాలు తీసుకుంటారని సదరన్ కాలిఫోర్నియా యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. అధిక ఒత్తిడికి లోనైనప్పుడు మనిషిలో కార్టిసాల్ అనే హార్మోన్ అధికంగా విడుదల అవుతుంది. ఈ కార్టిసాల్ హార్మోన్ విడుదలైనప్పుడు అది మనం తీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. కార్టిసాల్ స్థాయి పెరిగినా మహిళల మెదడు పురుషులకంటే సానుకూలంగా వ్యవహరిస్తున్నట్లు శాస్త్రీయ పరిశోధనలో వెల్లడైంది.

మందకొడిగా నాయకత్వ హోదా..

ఒక మహిళ మంచి నాయకురాలిగా రాణించగలదని సామాజిక, శాస్త్రీయ పరిశోధనలు, అధ్యయనాలు చెబుతున్నా ప్రపంచవ్యాప్తంగా స్త్రీలు నాయకత్వ హోదాలోకి ఎదగడం అత్యంత మందకొడిగా సాగుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే నాయకత్వ హోదా విషయంలో స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం సాధించడానికి ఇంకో 130 ఏళ్లు పడుతుందని ఐక్యరాజ్యసమితి అంచనా.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

- గతేడాది చివరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 28 దేశాల్లోనే మహిళలు దేశాధ్యక్ష లేదా ప్రభుత్వ అధినేత్రి హోదాలో ఉన్నారు. అందులో భారత్ సహా 13 దేశాల్లో అధినేత్రిలుగానూ మరో 15 దేశాల్లో ప్రభుత్వ అధినేత్రిలుగా ఉన్నారు.
- అన్ని దేశాలు కలిపి మంత్రుల స్థానాల్లో 21 శాతమే మహిళలు ఉన్నారు. 14 దేశాల్లో మాత్రమే మంత్రివర్గాల్లో సగం లేదా ఆపైన అతివలు ఉన్నారు.
- ప్రస్తుతానికి అన్ని దేశాల పార్లమెంటుల్లో కలిపి 26 శాతం మహిళా అభ్యర్థులు సభ్యులుగా ఉన్నారు. 1995 నాటికి ఇది 11 శాతమే ఉండేది. వీటిలో ఐదు దేశాల్లో సగానికిపైగా మహిళా పార్లమెంటు సభ్యులు ఉన్నారు. రువాండాలో 61 శాతం, క్యూబాలో 53 శాతం, నికరగ్వాలో 51, మెక్సికోలో 50, యూఏఈలో 50 శాతం మంది మహిళలు పార్లమెంటు సభ్యులుగా ఉన్నారు.
- మరో 27 దేశాల్లో మహిళా పార్లమెంటు సభ్యులు 40 శాతానికిపైగా ఉన్నారు. అందులో 15 యూరప్‌లో, 5 లాటిన్ అమెరికా దేశాల్లో, 5 ఆఫ్రికాలో, చెరొకటి ఆసియా, పసిఫిక్ దేశాల్లో ఉన్నాయి. ఇందులో అధిక దేశాల్లో మహిళల కోసం పార్లమెంటు స్థానాల్ని రిజర్వు చేయడం వల్ల సాధ్యమైంది.
- ప్రపంచవ్యాప్తంగా 24 దేశాల్లో పార్లమెంటులో 10 శాతం కన్నా తక్కువగా మహిళలు ఉన్నారు. అందులో మూడు దేశాల్లో ఒక్క మహిళ కూడా పార్లమెంటులో లేరు. అవి మైక్రోనేసియా, పపువా న్యూగినియా, వనౌతు దేశాలు.
- 136 దేశాల సమాచారం క్రోడీకరిస్తే స్థానిక సంస్థలకు ఎన్నికైన మహిళల సంఖ్య 30 లక్షలుగా (34 శాతం) ఉంది. ఈ విషయంలో ప్రపంచ సగటు కంటే భారత్‌లో స్థానిక సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యం మెరుగ్గా ఉంది. స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కారణంగా మనదేశంలో మొత్తంగా మహిళా ప్రాతినిధ్యం 44 శాతానికి పెరిగింది. అదే ఫ్రాన్స్‌లో 40, బ్రిటన్‌లో 34, జర్మనీలో 27.5, చైనాలో 23, జపాన్‌లో 13 శాతంగా ఉంది.
- భారత్‌లో మొత్తం 2.5 లక్షల పంచాయతీలు ఉండగా మొత్తం 32 లక్షల మంది వాటికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారిలో 14.5 లక్షల మంది మహిళలే. అత్యధికంగా ఉత్తరాఖండ్‌లో మహిళా ప్రాతినిధ్యం 54.8 శాతం ఉండగా అత్యల్పంగా జమ్మూకశ్మీర్‌లో 32 శాతం ఉంది.
- మహిళలు నేతృత్వం వహిస్తున్న స్థానిక సంస్థల పనితీరు మెరుగ్గా ఉంటోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.
- భారత్‌లో మంచినీటి ప్రాజెక్టులు విషయంలో పురుషులు నేతృత్వం వహిస్తున్న పంచాయతీలకన్నా మహిళా నాయకత్వంలోని పంచాయతీల్లోనే 62 శాతం అధికంగా ఉన్నాయని తేలింది.
- ప్రపంచవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో మహిళా ప్రాతినిధ్యం 50 శాతం దాటిన దేశాలు రెండే ఉన్నాయి. మరో 20 దేశాల్లో 40 శాతంగా ఉంది.

అధినాయికలు నామమాత్రమే..

ప్రపంచవ్యాప్తంగా 1960 నుంచి ఇప్పటివరకు 59 దేశాల్లో మహిళలు అత్యున్నత స్థానాన్ని అధిరోహించారు. మొత్తంగా 77 మంది మహిళలు ఉన్నత స్థానాలకు ఎదిగారు. 1960లో సిరిమావో బండారునాయికే శ్రీలంక ప్రధానిగా ఎన్నికై ప్రపంచంలో అత్యున్నత స్థానాన్ని అధిరోహించిన తొలి మహిళా నేతగా ఖ్యాతిగాంచారు. ఈ ఏడాది ప్రారంభం నాటికి 15 దేశాలకు మహిళలు నేతృత్వం వహిస్తున్నారు. ఇందులో ఇటలీ, హోండురస్‌లో తొలిసారి మహిళా అధ్యక్షురాలిని ఎన్నుకున్నాయి. నిరంతరాయంగా అత్యధిక కాలం దేశాధినేతగా కొనసాగిన కీర్తి జర్మనీకి చెందిన ఎంజెలా మెర్కెల్‌కు దక్కింది. ఆమె జర్మనీ చాన్సలర్‌గా 16 ఏళ్ల 16 రోజులు ఉన్నారు. ఆ తరువాత స్థానాల్లో డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన దామె యుజెనియా చార్లెస్ (14 ఏళ్ల 328 రోజులు), లైబీరియాకు చెందిన ఎలెన్ జాన్సన్ సిర్లీఫ్ (12 ఏళ్ల 6 రోజులు) ఉన్నారు. మధ్యలో అంతరాయం వచ్చినా మొత్తంగా అత్యధికకాలం ప్రభుత్వాధినేత్రి హోదాలో ఉన్న ఘనత ఇందిరాగాంధీకి కూడా దక్కుతుంది. ఆమె భారత్ ప్రధానిగా మొత్తం 16 ఏళ్ల 15 రోజులు పనిచేశారు. ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ఏకంగా 19 ఏళ్లకుపైగా ప్రధాని పదవిని అలంకరించారు.

విమెన్ థియేటర్

కుమురంభీం జిల్లాలో మహిళల ఆధ్వర్యంలో బెలూన్ థియేటర్





శ్రీదేవి

సాక్షి, ఆసిఫాబాద్: సరిగ్గా ఏడాది క్రితం. ముప్పై మంది మహిళలు కలిసి మూడు దశాబ్దాల రంగుల కలను నిజం చేశారు. కుమురం భీం జిల్లా మహిళా సమాఖ్యసభ్యులు పైసా పైసా కూడబెట్టి పొదుపు చేసిన డబ్బుతో ఏకంగా బెలూన్ థియేటర్ నిర్మించారు. పిక్చర్ టైమ్ సంస్థ తోడ్పాటునివ్వడంతో ఈ థియేటర్ ఆసిఫాబాద్ పట్టణంలో అందుబాటులోకి వచ్చింది. కనీసం ఒక్క థియేటర్ కూడా లేకపోవడంతో ప్రజలు సినిమా వినోదం కోసం పక్క జిల్లాకు వెళ్లాల్సి వచ్చేది. ఈ విషయాన్ని సమాఖ్య సభ్యులు అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వరుణ్‌రెడ్డి ముందుంచారు. వారు కూడా వెంటనే అంగీకరించడంతో తక్కువ సమయంలో నిర్మించే బెలూన్ థియేటర్‌ని శ్రీకారం చుట్టారు. 'పైసా పైసా పొదుపు చేసిన సొమ్మును సినిమా రంగంలో పెట్టుబడిగా పెట్టి చరిత్ర సృష్టిస్తామనుకోలేదు. గతేడాది నుంచి ఇప్పటి వరకు రూ.10 లక్షల లాభం వచ్చింది'అని చెప్పారు సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి. 'సమాఖ్య దగ్గర మూలధనంగా రూ.30 లక్షలు పోగయ్యాయి. ఆ మొత్తాన్ని మంచి వ్యాపారంలో పెట్టి మరింత అభివృద్ధి చేయాలనుకున్నాం. అప్పుడే సినిమా థియేటర్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చింది'అని గుర్తుచేసుకున్నారు సమాఖ్య కార్యదర్శి స్వరూప. దేశంలో పూర్తిగా మహిళలే నిర్వహిస్తున్న థియేటర్ ఇది. ఇందులో 120 సీట్ల సామర్థ్యం ఉంది. హెచ్‌డీ ప్రొడక్షన్‌తోపాటు 5.2 డాల్బీ డిజిటల్ సౌండ్, ఏసీ, కుషన్ సీట్లూ ఉన్నాయి. ప్రమాదాలకు తట్టుకునే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని రూపొందించారు. థియేటర్‌లో టికెట్ బుకింగ్, ఆవరణలో చిరుతిళ్ల దుకాణాలను సైతం మహిళలే నిర్వహిస్తున్నారు. దేశంలో పూర్తిగా మహిళలే నిర్వహిస్తున్న థియేటర్ గురించి తెలిసి సినీ దర్శకుడు రాజమౌళి దంపతులు ఇక్కడికి వచ్చారు. సదుపాయాలు చూసి నిర్వాహకులను ప్రశంసించారు.



ఓ కంపెనీ 2 వేల మంది మహిళలు

ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ కేంద్రంలో ఉద్యోగులంతా వనితలే..

మహిళా దినోత్సవం సందర్భంగా నేడు కాఫీ టేబుల్ బుక్ విడుదల

సాక్షి, హైదరాబాద్: మహిళాసాధికారతకు మద్దతుగా నిలిచింది ఓలా. రెండు వేలమంది మహిళలకు ఉపాధి కల్పించి పెద్ద ఊతమిచ్చింది. ఇది వనితకు పట్టం కట్టిన అద్భుతఘట్టం. దీనికి తమిళనాడులోని కృష్ణగిరిలో ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ కేంద్రం వేదికగా నిలిచింది. ఈ ఫ్యూచర్ ఫ్యాక్టరీలో కేవలం మహిళా ఉద్యోగులే పనిచేయడం ఇక్కడి ప్రత్యేకత. ఇది ప్రపంచవ్యాప్తంగా మహిళలతో కూడిన ఏకైక ఆటోమోటివ్ తయారీ కేంద్రంగా గుర్తింపు పొందింది. ఈ ఉత్పత్తి కేంద్రంలో పనిచేసే మహిళలు భారత్‌లో వేగవంతమైన విద్యుద్దీకరణకు నాయకత్వం వహిస్తున్నారు. పురుషులు ఆధిపత్యం వహించే ప్రతి ఇంజనీరింగ్ ఫంక్షన్‌ను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారతకు నిదర్శనంగా నిలుస్తున్న ఈ వనితలకు గౌరవప్రదంగా ఓలా ఆధ్వర్యంలో కాఫీ టేబుల్ పుస్తకాన్ని విడుదల చేయనుంది. ఈ ఉత్పత్తి కేంద్రంలోని వివిధ విభాగాల్లో ఉద్యోగం చేస్తున మహిళామణుల విజయ ప్రస్థానం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడ పనిచేస్తున్న 'రేఘ'అనే మహిళ తన గ్రామంలో కాలేజీకి వెళ్లిన మొదటి అమ్మాయి. గ్రామంలో చాలా మంది అమ్మాయిలకు పదిహేనేళ్లలోపు వివాహాలు జరిగినా రేఘ మాత్రం పెళ్లయిన తర్వాత జర్మనీలో పీజీ చేసి ప్రస్తుతం కృష్ణగిరిలోని ఓలా ఫ్యూచర్ ఫ్యాక్టరీలో బ్యాటరీ షాప్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. చిన్నతనంలోనే తల్లదండ్రులు విడిపోగా అర్ధంతరంగా జీవితాన్ని నెట్టుకొచ్చిన జయసుధ బ్యాటరీ షాప్ అసోసియేట్‌గా సేవలందిస్తోంది. ఆమె పాఠశాల విద్య, డిప్లొమా పూర్తి చేసి ఇక్కడ ఉద్యోగం సంపాదించింది. మాన్యుఫ్యాక్చరింగ్ క్వాలిటీ అస్యూరెన్స్ అసోసియేట్‌గా పనిచేస్తున్న 19 ఏళ్ల భైరవి టూవీలర్ నడపడంలో తన ప్రత్యేకతను చాటుకుంటుంది. ఇలా వీరందరి అద్భుత విషయాలతో సంస్థ కాఫీ టేబుల్ పుస్తకాన్ని విడుదల చేయనుంది.

33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి: ఎమ్మెల్సీ కవిత



మల్లారెడ్డి వర్సిటీలో జరిగిన మహిళాదినోత్సవ వేడుకల్లో కవిత, మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం మైసమ్మగూడలోని మల్లారెడ్డి విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో మహిళలు తమదైన ప్రత్యేకతను చాటుకోవాలన్నారు. మహిళా సాధికారత దానంతట అదే రాదని, కృషితో సాధించుకోవాలని సూచించారు. రాజకీయ రంగంలో మహిళలు తమదైన ప్రత్యేక ముద్ర వేయాలన్నారు. కవిత స్టెప్పులతో మల్లారెడ్డి మనవరాలు చేసిన ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంత్రి మల్లారెడ్డి, యూనివర్సిటీ ప్రతినిధులు కల్పనారెడ్డి, మహేందర్‌రెడ్డి, శాలినీరెడ్డి, చందన్‌రెడ్డి, ప్రీతిరెడ్డి, వీసీ ఎస్‌వీకే రెడ్డి, ప్రిన్సిపల్ మాధవీలత పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా పక్షపాతి

ఎమ్మెల్యే సీతక్క



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ మహిళా పక్షపాతి అని, దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా మహిళలను నియమించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రాధాన్యాన్ని ఏ పార్టీ ఇవ్వలేదని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకుని, డ్యాన్సులు చేస్తూ ఉల్లాసంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతక్క మాట్లాడుతూ అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు మహిళలను మభ్య పెట్టాలని చూస్తున్నాయని విమర్శించారు. ఈ రెండు పార్టీలు మహిళల పేరుతో కేవలం రాజకీయం మాత్రమే చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పుడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్థానంలో మహిళా పోరాట దినోత్సవం జరుపుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని సీతక్క ఆందోళన వ్యక్తంచేశారు. మహిళా దినోత్సవం స్ఫూర్తితో మహిళలందరూ తమ తమ రంగాల్లో రాణించాలని, రాజకీయ, కుటుంబ నిర్ణయాల్లో మహిళలే కీలక పాత్ర పోషించాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పుష్పలీల, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు, రాష్ట్ర నాయకులు నీలం పద్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళాజర్నలిస్టుల కోసం స్పెషల్ యాక్సిలేటరీ ప్రోగ్రాం

- మంత్రి కేటీఆర్ వెల్లడి
- విమెన్స్ డే సందర్భంగా మహిళాజర్నలిస్టులకు సన్మానం



సన్మానగ్రహీతలతో మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, సత్యవతి రాథోడ్

ఖైరతాబాద్: మహిళాజర్నలిస్టులను మరింత ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం తరపున వి హబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక యాక్సిలేటరీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు మంత్రి కె.తారకరామారావు తెలిపారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నెక్లెస్ రోడ్డు పీపుల్స్‌ప్లాజాలో మహిళాజర్నలిస్టులను మంత్రి కేటీఆర్, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి సన్మానించారు. కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా జర్నలిస్టులకు మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రులు జగదీష్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ మహిళా జర్నలిస్టులతో కలిసి మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. మహిళా జర్నలిజం అంటే కత్తిమీద సాములాంటిది. అలాంటి వారిని ఈ సందర్భంగా సన్మానించుకోవడం సంతోషంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలతో పాటు డిజిటల్ మీడియాలో రాణిస్తున్న మహిళా జర్నలిస్టులను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ, మున్సిఫల్ అడ్మినిస్ట్రేషన్ అరవింద్ కుమార్, చీఫ్ విఫ్ బాల్కసుమన్, ఎమ్మెల్యే చందర్‌లతో పాటు అధికారులు పాల్గొన్నారు. కాగా ఈ సందర్భంగా సాక్షి టీవీ తరపున పద్మావతి, సుస్మిత, కావేరి, సాక్షి దినపత్రిక నుంచి కట్ట కవిత, డి.జి.భవానీ, వి.మంజుల, జి.నిర్మల, ఎస్.సరస్వతి రమలను సన్మానించారు.

కొత్త భవనంలో యూఎస్ కాన్సులేట్

- ఈ నెల 20 నుంచి నానక్‌రాంగూడలో కార్యకలాపాలు
- 15 నుంచి బేగంపేట కాన్సులేట్ భవనంలో కార్యకలాపాలు నిలిపివేత



కాన్సులేట్ నూతన భవనం

సాక్షి, హైదరాబాద్: అమెరికా.. నూతన కాన్సులేట్ భవనాన్ని మార్చి 20న హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో ప్రారంభిస్తోంది. రూ. 27.87 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ అత్యాధునిక భవనం నుంచే ఇక నుంచి యూఎస్ కాన్సులేట్ కార్యకలాపాలు సాగనున్నాయి. నూతన కాన్సులేట్‌లో అందించే వివిధ సేవల వివరాలను యూఎస్ కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ విభాగం ప్రకటించింది.

ప్రస్తుతం యూఎస్ కాన్సులేట్ కొనసాగుతున్న బేగంపేట 'పైగా ప్యాలెస్'లో ఈనెల 15 మధ్యాహ్నం 12:00 గంటల నుంచి కార్యకలాపాలన్నింటినీ నిలిపివేస్తున్నట్లు తెలిపింది. 15వ తేదీ మధ్యాహ్నం 12:00 గంటల నుండి 20వ తేదీ ఉదయం 8:30 గంటల వరకు కాన్సులేట్ మూసివేసి ఉంటుంది. ఈ నెల 20న ఉదయం 8.30 గంటల నుంచి అధికారికంగా నూతన భవనం నుంచి కార్యకలాపాలను ప్రారంభించనుంది. మార్చి 20 ఉదయం 8:30 వరకు అత్యవసర సేవలు కోరే అమెరికా పౌరులు +91 040-4033 8300 నంబర్ పైన సంప్రదించాలని కాన్సులేట్ జనరల్ వివరించింది. మార్చి 20 ఉదయం 08:30 తరవాత అత్యవసర సేవలు కోరుతున్న అమెరికా పౌరులు +91 040 6932 8000 పై సంప్రదించవలసి ఉంటుంది. అత్యవసరంకాని సందేహాల కోసం, అమెరికా పౌరులు HydACS@ state.gov కి ఈ-మెయిల్ చేయవలసి ఉంటుంది. బయోమెట్రిక్ అపాయింట్‌మెంట్‌లు, ''డ్రాప్‌బాక్స్''అపాయింట్‌మెంట్‌లు (ఇంటర్వ్యూ మినహాయింపు ఉన్నవారు), పాస్‌పోర్ట్ పికప్ సహా ఇతర వీసా సేవలు – లోయర్ కాంకోర్స్, హైటెక్ సిటీ మెట్రో స్టేషన్, మాదాపూర్, హైదరాబాద్ 500081లో ఉన్న వీసా అప్లికేషన్ సెంటర్ (VAC) లో కొనసాగుతాయని తెలిపింది. కాన్సులేట్ మార్పు ప్రక్రియ వల్ల వీసా అప్లికేషన్ సెంటర్ సేవలపై ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొంది. వీసా సేవలకి సంబంధించి సందేహాలకు +91 120 4844644 లేదా +91 22 62011000 పై కాల్ చేయాలని యూఎస్ కాన్సులేట్ పేర్కొంది. కొత్త ఆఫీస్ చిరునామా సర్వే నం. 115/1, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్ గూడ, హైదరాబాద్, తెలంగాణ, 500032.

మహిళా ప్రతిభకు పట్టం

- మహిళా దినోత్సవం సందర్భంగా 27 మందికి పురస్కారాలు
- అవార్డుతోపాటు రూ.లక్ష నజరానా అందించనున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: వివిధ రంగాల్లో అద్భుత ప్రతిభ చాటుతున్న పలువురు మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ రంగాల్లో సత్తా చాటుతున్న 27 మంది మహిళలకు అవార్డులు అందజేయనుంది. వారికి అవార్డులతోపాటు రూ. లక్ష చొప్పున నజరానా అందజేయనున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి భారతీ హోళికేరి మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ అవార్డులు అందజేయనున్నట్టు వివరించారు.

అవార్డుగ్రహీతలు వీరే....

బానోతు జ్యోతి (అంగన్‌వాడీ టీచర్), గుండా రాజకుమారి (భరోసా సెంటర్ కోఆర్డినేటర్), ఆల్ఫీ కిడాంగెన్ (సామాజిక సేవ), మీనాక్షి గడిగె (సర్పంచ్, ముత్రా, ఇచ్చోడ), సుజాతా దీక్షిత్ (థియేటర్ ఆర్ట్స్), స్వరూప పొట్లపల్లి (జర్నలిజం), డా. బండారు సుజాతా శేఖర్ (జానపద సాహిత్యం), అరుణ నారదభట్ల (సాహిత్యం), డా.అమూల్య మల్లన్నగారి (వైద్యం), నారా విజయలక్ష్మి (పెయింటర్), ఓని సిస్టర్స్ (వినోద, విజయ, విజయలక్ష్మి)-(సంగీతం), రుక్మిణి, ఇన్‌స్పెక్టర్ (షీ-టీమ్స్ భరోసా సెంటర్), అనసూయ, డీసీపీ (పోలీసు), అన్వితరెడ్డి (పర్వతారోహకురాలు), త్రిష గొంగడి (అండర్-19 క్రికెటర్), అనురాధ తడకమళ్ల (శాస్త్రీయ నృత్యం), దంతు కనకదుర్గ (కాలమిస్టు), డాక్టర్ మాలతి (పేట్లబురుజు ఆసుపత్రి సూపరింటెండెంట్), సమంతారెడ్డి (మహిళా పారిశ్రామికవేత్త), కర్నె శంకరమ్మ (కిన్నెర వాయిద్యకారిణి), డా.గూడూరు మనోజ (ఆద్య కళ), సామల్ల శ్వేత (కమ్యూనిటీ మొబిలైజేషన్), జి.నందిని (సూపర్ వైజర్, నిజామాబాద్ అర్బన్‌ప్రాజెక్టు). రజియా సుల్తానా (అంగన్‌వాడీ హెల్పర్, కొడిపల్లి), ఎం కృష్ణవేణి (ఆశా వర్కర్), ఇందిర (ఏఎన్‌ఎం), డాక్టర్, కె.రాణీప్రసాద్ (సాహిత్యం).

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.